



www.prajapakshamin

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


**శుభాకాంక్షలు**

పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు 'ప్రజాపక్షం' సంక్రాంతి శుభాకాంక్షలు

**సెలవు**

మకర సంక్రాంతి సందర్భంగా 'ప్రజాపక్షం' కార్యాలయానికి మంగళవారం సెలవు. బుధవారం పత్రిక వెలువడదు. పునర్దర్శనం గురువారం.

- ఎడిటర్


సంపుటి 08, సంచిక: 47 | మంగళవారం | 14-01-2025 | కరీంనగర్ Published from: **Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar** పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అరెస్టు

ప్రజాపక్షం/హైదరాబాద్

హుజురాబాద్ బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని హైదరాబాద్‌లో సోమవారం రాత్రి కరీంనగర్ పోలీసులు అరెస్టు చేశారు. జూబ్లీహిల్స్‌లోని 10 టివి ఆఫీస్‌లో ఇంటర్వ్యూ ముగించుకొని ఇంటికి వెళ్తుండగా పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమీక్షా సమావేశంలో జగిత్యాల ఎంఎల్‌ఎ తరువాయి 2లో

### వీధుల్లో భోగి మంటలు.. ఊరూవాడా

# సంక్రాంతి సందడి

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు భోగి పండగను ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జామున 4 గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి భోగి మంటలు వెలిగించారు. పిల్లలు, పెద్దలు భోగి మంటల చుట్టూ చేరి ఆట పాటలతో ఆనందంలో మునిగి తేలారు. అనంతరం ఆలయాలకు వెళ్లి తమ ఇష్ట దైవాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండుగ వేళ సంప్రదాయ దుస్తులను యువతులు ధరించగా, చిన్నారులు కొత్త బట్టలతో మురిసి పోయారు. చిన్నలు, పెద్దలు పతంగులతో పూర్తిగా సందడి చేశారు. మహిళలు తమ ఇళ్ల ముందు అందమైన రంగవల్లులను తీర్చిదిద్దారు. ముఖ్యంగా హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి, కె.పి.హెచ్‌బి, అమీర్‌పేట్, దిల్‌సుఖ్‌నగర్ తరువాయి 2లో



## భక్తజనసంద్రం.. త్రివేణి సంగమం

05

## కౌశిక్‌రెడ్డిపై స్పీకర్‌కు ఎమ్మెల్యే సంజయ్ ఫిర్యాదు

ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. కరీంగనర్ కలెక్టరేట్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో కౌశిక్ రెడ్డి వ్యవహరించిన తీరుపైన విచారణ చేపట్టి,ఆయనపైనచర్యలు తీసుకోవాలని సంజయ్ కోరారు. కౌశిక్ రెడ్డి తనపై అసభ్య పదజాలంతో దూషణలతో రెచ్చిపోయారని, సమావేశంలో తాను మాట్లాడుతుండగానే తనను తోసేశారని స్పీకర్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. పాడి కౌశిక్ రెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.



### ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులకు సానుకూలతలు

## ప్రపంచ వేదికకు పరిచయం

సంబంధిత అధికారులు సన్నద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

ప్రజాపక్షం / హైదరాబాద్

'ఫ్యూచర్ సిటీ'గా వెలుగొందుతున్న హైదరాబాద్ సిటీలో పెట్టుబడులకు ఉన్న సానుకూలతలను ప్రపంచ వేదికపై పరిచయం చేసేందుకు సన్నద్ధంగా ఉండాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తరువాయి 2లో

## 'తెలంగాణ.. జరూర్ ఆనా..'

- పర్యాటకులకు పిలుపు ఇచ్చిన మంత్రి జూపల్లి
- హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైన ఇంటర్నేషనల్ కైట్, స్వీట్ ఫెస్టివల్
- 16 దేశాల నుంచి పాల్గొన్న కైట్ ప్లైయర్లు

ప్రజాపక్షం/హైదరాబాద్

'తెలంగాణ..జరూర్ ఆనా..' అనే టూరిజం ప్రచారంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. నెలలో ఒక్కసారైనా తెలంగాణలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించాలని ఆయన కోరారు. సోమవారం సికింద్రాబాద్ పరేడ్ మైదాన్‌లో ఇంటర్నేషనల్ కైట్, స్వీట్ ఫెస్టివల్‌ను రాష్ట్ర రోడ్డు రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌తో కలిసి తరువాయి 2లో



### ఫేస్‌బుక్, ఇన్‌స్టాలలో

## ఫ్యాక్ట్ చెక్ ఎత్తివేత

ప్రకటించిన మెటా సిఇఒ జ్యూకర్‌బెర్గ్



**న్యూయార్క్ :** ఇకపై ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, థ్రెడ్స్ తదితర సామాజిక వేదికలలో ఫ్యాక్ట్ చెకింగ్ పద్ధతిని నిలిపివేస్తున్న ట్లు ఈ సంస్థల యజమాని, మెటా సిఇఒ మార్క్ జ్యూకర్‌బెర్గ్ ఇటీవల వెల్లడించారు. ఈ మేరకు ఆయన గత వారం ఒక వీడియోను విడుదల చేశారు. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ పరిరక్షణ, మితిమీరిన సెన్సార్‌షిప్‌కు వ్యతిరేకంగా ఇలాంటి కొత్త విధానాలను తీసుకువచ్చినట్లు ఆయన తెలిపారు. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ తరువాయి 2లో







# చర్చల్లో పురోగతి!

గాజా స్ట్రిప్‌లో కాల్పుల విరమణ దిశగా అడుగులు?



**కైరో:** గాజా స్ట్రిప్‌లో శాంతి నెలకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. పేర్లు చెప్పడానికి ఇష్టపడని కొందరు ఇచ్చిన సమాచారాన్ని ఉటంకిస్తూ పిటిఐ కథనాన్ని అనుసరించి, ఇజ్రాయెల్-హమాస్ మధ్య సయోధ్యకు మార్గం సుగమమవుతున్నది. అమెరికా, ఈజిప్టు, ఇరాన్ మధ్యవర్తిత్వంతో సుమారు ఏడాది కాలంలో ఇరు వర్గాల మధ్య చర్చలు పలు దఫాలుగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. తాజా చర్చలు ఆశాజనకంగా ఉన్నాయని, చాలా అంశాల్లో అంగీకారం కుదరవచ్చని ఈ చర్చల్లో చురుకైన పాత్ర పోషిస్తున్న ఒక వ్యక్తి తెలిపాడు. చర్చల వివరాలు వెల్లడించే అధికారం తనకు లేదు కాబట్టి, వ్యక్తిగత వివరాలు ఇవ్వలేకపోతున్నానని పేర్కొన్న అతను, పలు అంశాలపై చర్చలు పురోగతి సాధించాయని, అయితే కొన్ని విషయాల్లో తాత్కాలికంగా స్తబ్దత నెలకొందని పేర్కొన్నాడు. ఇలావుంటే, ఇరాన్, కతార్, ఈజిప్టు తదితర దేశాలు హమాస్‌పై కాల్పుల విరమణ ఒప్పందానికి అనుకూల నిర్ణయం కోసం ఒత్తిడి తెస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడిగా ఈనెల 20న ప్రమాణ స్వీకారం చేయనున్న డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే తన దూత స్టీవ్ విట్‌కాఫ్‌ను పంపారు. హమాస్-ఇజ్రాయెల్ యుద్ధం ముగిసేలా చర్యలు తీసుకుంటానని అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చుకోవాలన్న పట్టుదలతో ఉన్న ట్రంప్ తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. విట్‌కాఫ్ ఈ ప్రయత్నంలోనే నిమగ్నమయ్యారు. చర్చలు కీలక దశకు చేరుకున్నాయని, రాబోయే 24 గంటలు అత్యంత కీలకంగా మారనున్నాయని పరిశీలకులు అంటున్నారు. గాజా స్ట్రిప్ నుంచి సైనిక దళాల ఉపసంహరణ, ఖైదీల అప్పగింత వంటి అంశాలపై ఇజ్రాయెల్ స్పష్టత ఇవ్వాలని హమాస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. హమాస్ వద్ద బందీలుగా ఉన్న తమ దేశ పౌరులను వెంటనే విడిచిపెట్టాలన్నది ఇజ్రాయెల్ డిమాండ్. 2023 అక్టోబర్ నుంచి కొనసాగుతున్న ఈ యుద్ధానికి తెరపడితేగానీ మధ్య ఆసియాలో శాంతి స్థాపన జరగదు. పరిస్థితులు మూడో ప్రపంచ యుద్ధ భయాన్ని రేకెత్తిస్తు న్న సమయంలో, శాంతి చర్చలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. గాజాపై ఇజ్రాయెల్ దాడులు నిలిపివేయాలని, మానవ హక్కుల ఉల్లంఘనకు తెరదించాలని ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ వ్యక్తమవుతున్నది. ప్రస్తుత చర్చలు సఫలమయ్యే అవకాశాలున్నాయన్న వార్త అందరికీ ఊరటనిస్తున్నది.

# పొంచివున్న మరో ముప్పు!

**లాస్‌ఏంజెల్స్ (అమెరికా):** అమెరికా కాలిఫోర్నియాలోని లాస్ ఏంజెలెస్‌లో భీకరంగా వ్యాపిస్తున్న కార్చిచ్చు ప్రమాదం పూర్తిగా సమసిపోయే దాఖలాలు కనిపించడం లేదు. ముప్పు పొంచి ఉందని, కనీసం మరో మూడునాలుగు రోజులు అత్యంత వేగంతో గాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. గంటకు సగటున 80 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, పర్వత ప్రాంతంలో శీఘ్రత 113 కిలోమీటర్ల వరకూ ఉండవచ్చని పేర్కొన్నారు. ప్రత్యేకించి మంగళవారం పరిస్థితి దారుణంగా ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. కార్చిచ్చు మృతుల సంఖ్య 24కు చేరిందని, కనీసం 16 మంది జాడ తెలియడం లేదని నేషనల్ వెదర్ సర్వీసెస్ ప్రకటించింది. గాలుల తీవ్రత కారణంగా, ఇప్పటికే కార్చిచ్చు అదుపులోకి వచ్చిన ప్రాంతాల్లో మరోసారి మంటలు చెలరేగే ప్రమాదం ఉందని హెచ్చరిస్తూ, ముందు జాగ్రత్త చర్యగా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ప్రభావిత ప్రాంతాల ప్రజలకు సూచించింది. ఇలావుంటే, కార్చిచ్చు వ్యాపించిన ప్రాంతాల్లో మంటలను అదుపులోకి తీసుకురావడానికి పాలిసేడ్స్, ఏటోన్ ప్రాంతాల్లోని ఫైర్ సర్వీసెస్ బృందాలు నిర్విరామంగా ప్రయత్నిస్తున్నాయి. అయితే, పలు చోట్ల ఇంకా మంటలు అదుపులోకి రా లేదు. వేలాది ఇళ్లు ఇప్పటికీ పాక్షికంగా లేదా పూర్తిగా మంటలకు ఆహుతయ్యాయి. దావాగ్నిని అదుపులోకి తెచ్చేందుకు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా యత్నిస్తున్నారు.

కొన్ని రసాయనాలతో కూడిన, గులాబీ రంగు ఫోస్ చెక్ అనే మిశ్రమాన్ని దాదాపు 9 విమానాలు, 20 హెలికాప్టర్ల సాయంతో మంటలు వ్యాప్తి చెందుతున్న ప్రాంతాల్లో వెదజల్లుతున్నారు. మొత్తం మీద ఇప్పటి వరకూ పాలిసేడ్స్‌లో 23,707 ఎకరాలను, ఏటోన్‌లో 14,117 ఎకరాలను, కెన్నెత్ లో 1,052 ఎకరాలను, హర్ట్స్‌లో 779 ఎకరాలను కార్చిచ్చు దగ్ధం చేసింది. మొత్తం 12వేల నిర్మాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. దాదాపు 160 చదరపు కిలోమీటర్లు కాలిబూడిదయ్యాయి. కాగా, 14 వేల మంది సిబ్బంది, 1,354 అగ్నిమాపక యంత్రాలు, 84 ఎయిర్‌క్రాఫ్ట్‌లు కార్చిచ్చును అదుపు చేసేందుకు కృషి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.






## సందట్లో సడేమియా..

కార్చిచ్చుకు ఇళ్లువాకిళ్లు దగ్ధమై వేలాది మంది అల్లాడుతుంటే, దొరికించే అవకాశంగా భావించి కొంత మంది దొంగలు చిక్కినకాడికి దోచేసుకుంటు నాఇ్నరు. కొంత మంది ఏకంగా అగ్నిమాపక సిబ్బంది దస్తుల్లో వెళ్లి మరీ ఇలాంటి అకృత్యాలకు పాల్పడుతున్నారు. లాస్‌ఏంజిలిస్ పోలీసులు 29 మంది దొంగలను అదుపులోకి తీసుకున్నారు. ఇలాంటి వారితో జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచిస్తునాఇ్నరు. ఇలావుంటే, కార్చచ్చును ఎరియల్ వ్యూలో రికార్డు చేసేందుకు పలువురు ప్రైవేటు డ్రోన్లను ఉపయోగిస్తున్నారు. సోషల్ మీడియాలో మైలేజ్ కోసం పెరిగిన ఈ పోటీ కారణంగా డ్రోన్ల సంఖ్య పెరిగాయి. కార్చిచ్చును నిరోధించడానికి ప్రయత్నిస్తున్న విమానాలు, హెలికాప్టర్లకు ప్రమాదకరంగా మారాయి. సూపర్ స్కూపర్ విమానాన్ని ఓ ప్రైవేటు డ్రోన్ ఢీకొన్న నేపథ్యంలో, అధికారులు అప్రమత్తమయ్యారు. ఆ డ్రోన్ ఆపరేటర్ కోసం ఎఫ్‌బిఐ గాలింపు చర్యలు మొదలుపెట్టింది. ముందస్తు అనుమతి లేకుండా డ్రోన్ల వినియోగాన్ని నేరంగా పరిగణిస్తామని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు.



## నూతన సంవత్సర వేడుకలే కారణమా?

కాలిఫోర్నియా కార్చిచ్చుకు నూతన సంవత్సర వేడుకలే కారణమా? అనే ప్రశ్న ప్రశ్నకు అవుననే సమాధానం వస్తున్నది. వాషింగ్టన్ పోస్ట్' కతనాన్ని అనుసరించి, కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా కొందరు కాల్చిన మాణాసంచా మంటలు అంటుకొని, క్రమంగా దావానలంగా మారాయి. అగ్నిమాపక సిబ్బంది వెంటనే అప్రమత్తమై, తొలుత మంటలను అదుపులోకి తీసుకొచ్చినప్పటికీ, మిగిలిన కొద్దిపాటి నిప్పు క్రమంగా జ్వాలగా మారిందని, బలమైన గాలుల కారణంగా ఇతర ప్రాంతాలకు కూడా వ్యాపించిందని అధికారులు అంటున్నారు. ఉపగ్రహ చిత్రాలు, రేడియో కమ్యునికేషన్ల సమాచారాన్ని వాషింగ్టన్ పోస్టు ప్రామాణికంగా స్వీకరించింది. అంతేగాక, స్థానికులను ఇంటర్వ్యూ చేసింది.పాలిసేడ్స ఫైర్‌కు బాణాసంచాయే కారణమని నిర్ధారణకు వచ్చింది.

## బ్ల్యూ ఆరిజిన్ ప్రయోగం

చివరి క్షణాల్లో వాయిదా




**కేప్ కానవెరాల్ (అమెరికా):** జెఫ్ బెజర్ అంతరిక్ష స ంస్థ తలపెట్టిన బ్యూ ఆరిజిన్ రాకెట్ ప్రయోగం చివరి క్షణాల్లో వాయిదా పడింది. సాంకేతిక సమస్యలు తలెత్తినందవల్ల, అనుకున్న సమయానికి రాకెట్ ప్రయోగం జరగలేదని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. అ యితే, సమస్య వివరాలను మాత్రం గోప్యంగా ఉం చింది. జెఫ్ బెజర్ అంతరిక్ష సంస్థ ఏకంగా 320 అడుగులు (98 మీటర్లు) ఎత్తుగల న్యూ గ్లెన్ ర్యాకెట్ ప్రయోగాన్ని చేపట్టడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. అంత భారీ ర్యాకెట్ నింగిలోకి దూసుకెళ్లే సమయం కో సం ఎంతో మంది ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అ యితే, గతంలో దీని ప్రయోగం వివిధ కారణాలతో వా యిదా పడింది. తాజాగా, కౌంట్‌డౌన్ ప్రారంభమైన కొ న్ని సెకన్లలోనే, ర్యాకెట్ ప్రయోగాన్ని నిలిపివేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. ఆ వెంటనే ర్యాకెట్‌లోని ఇంధనాన్ని పూర్తిగా తీసివేశారు. హఠాత్తుగా ప్రయోగాన్ని ఎందుకు నిలిపివేశారన్నది వివరించని అధికారులు, సాంకేతికపరమైన లోపాన్ని సవరించడానికి కొంత సమయం పడుతుందని తమ ప్రకటనలో పేర్కొన్నారు. తదుపరి ప్రయోగం తేదీని ప్రకటించలేదు.

## బైడెన్ బిజీబిజీ

**వాషింగ్టన్:** అఫ్గానిస్థాన్‌లో తాలిబన్ల చెరలో ఉన్న ముగ్గురు తమ దేశ పౌరులను విడిపించే ప్రయత్నం చేస్తున్నట్టు వారి బంధువులకు వివరిస్తున్న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్. ఈనెల 20న డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో, వైట్‌హౌస్‌లో చివరి సమయాన్ని బైటెన్ బిజీబిజీగా గడుపుతున్నారు. ఈ క్రమంలోనే భాగంగా, తాలిబన్లు నిర్బంధించిన ర్యాన్ కార్బెట్, జార్జి గ్లెజ్మన్, మహమూద్ హబీబీ కుటుంబ సభ్యులతో ఆయన దృశ్యమాధ్యమంగా మాట్లాడారు. ఈ ముగ్గురినీ విడిపించేందుకు తాలిబన్లతో చర్చలు జరుగుతున్నాయని వివరించారు. 2021లో అమెరికా దళాలు అఫ్గాన్‌ను విడిచిపెడుతున్న సమయంలో కార్బెట్ అక్కడే ఉన్నారు. 2022 ఆగస్టులో ఒక వ్యాపార సంబంధమైన పనిమీద అఫ్గాన్‌కు వెళ్లినప్పుడు ఆయనను తాలిబన్ అధికారులు అరెస్టు చేశారు. అట్లాంటాకు చెందిన ఎయిర్‌లైన్ మెకానిక్ గ్లెజ్మన్‌ను 2022 డిసెంబర్‌లో అరెస్టు చేశారు. ఆయన అరెస్టుకు కారణాలను వెల్లడించలేదు. కాగా, హబీబీకి కాబూల్‌లో ఒక కంపెనీ ఉంది. తాలిబన్ భద్రతాధికారులు హబీబీతోసహా 29 మందిని ఆ కంపెనీ నుంచే నిర్బంధంలోకి తీసుకున్నారు. మిగతా 27 మందిని విడిచిపెట్టినప్పటికీ, హబీబీ, మరో వ్యక్తి ఇంకా తాలిబన్ చెరలోనే ఉన్నాడని అమెరికా నిఘా సంస్థ ఎఫ్‌బిఐ అనుమానిస్తున్నది. కార్బెట్, గ్లెజ్మన్, హబీబీ అమెరికా పౌరులు కావడంతో, వారిని విడిపించేందుకు బైడెన్ ప్రయత్నిస్తున్నారు. కానీ, ఇప్పటి వరకూ ఒప్పందం కుదిరిన దాఖలాలు లేవు. ఇలావుంటే, అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో తాను పోటీ చేసి ఉంటే తప్పక గెలిచి ఉండేవాడినని ఒక ఇంటర్వ్యూలో బైడెన్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ట్రంప్‌తో వరుసగా రెండోసారి పోటీపడి, అమెరికా అధ్యక్ష స్థానాన్ని మరోసారి సొంతం చేసుకోవాలన్న ప్రయత్నంలో భాగంగా డెమోక్రాటిక్ అభ్యర్థిగా తొలుత బైడెన్ బరిలో ఉన్న విషయం తెలిసిందే. కానీ, ట్రంప్‌తో జరిగిన తొలి డిబేట్‌లో చాలా పేలవమైన ప్రదర్శనతో తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న బైడెన్ హఠాత్తుగా తన అభ్యర్థిత్వాన్ని రద్దు చేసుకోవడంతో, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి ట్రంప్‌ను ఢీకొనే అవకాశాన్ని కమలా హారిస్ దక్కించుకున్న విషయం విదితమే. ట్రంప్ చేతిలో ఆమె ఓటమికాగా, బైడెన్ ఇప్పుడు నోరు విప్పడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. ట్రంప్‌తో తాను పోటీ పడి ఉండే తప్పక గెలిచి ఉండేవాడినని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అయితే, పోటీ నుంచి ఎందుకు వైదొలగారన్న విషయాన్ని చెప్పకుండా దాటవేశారు. ఏదిఏమైనా, అధ్యక్ష పదవి నుంచి వైదొలిగే రోజు దగ్గరపడుతున్నకొద్దీ బైటెన్ ఏదో ఒక చర్య లేదా వ్యాఖ్యతో వార్తల్లో ఉండేందుకు ప్రయత్నిస్తున్నట్టు కనిపిస్తున్నది.

## నిజామాబాద్‌లో పసుపు బోర్డు

చైర్మన్‌గా పల్లె గంగారెడ్డి



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** నిజామాబాద్‌లో జాతీయ పసుపు బో ర్డు ఏర్పాటుకు కేంద్రం అంగీకరించింది. బోర్డు చైర్మన్‌గా పల్లె గంగారెడ్డి ని యమితులయ్యారు. మూడేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. మ ంగళవారం నిఖిల్‌సాయి ఇంటర్నేషనల్ హోటల్‌లో నిర్వహించే రైతుల సమావేశంలో కేంద్రమంత్రి పీయూష్ గోయాల్ హాజరై వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. అందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్‌లో మంత్రి కిషన్‌రె డ్డి, మంత్రులతో కలిసి మాట్లాడారు. కాగా, ప్రధాని నరేంద్రమోదీ 2023 అ క్టోబర్ 1న మహబూబ్‌నర్‌లో జరిగిన బహిరంగ సభలో తెలంగాణకే పసుపు బోర్డు అని ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే అత్యధికంగా ప సుపు ప ండించే జిల్లాలోను పసుపు బోర్డు ఏర్పాటవుతుందని ఎంపి అరవింద్ పలుమా ర్లు ఈ విషయాన్ని అన్ని వేదికలపై స్పష్టం చేశారు. కేంద్రంలోని మూడవసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ఏడాది పాలన గడిచినా పసుపు బోర్డు ఏర్పాటుపై ఎలాంటి ప్రకటన చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తమ

## ప్రపంచ వేదికకు పరిచయం

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించారు. పెట్టుబడులకు గమ్య స్థానంగా ఇప్పటికే తెలంగాణ దేశంలో అందరి దృష్టిని ఆకర్షిస్తుందని అన్నారు. దేశ విదేశాల్లో పేరొందిన కంపెనీలు భారీగా పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్రంలో అనుకూలమైన వాతావరణం ఉందని తెలిపారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని నివాసంలో పరిశ్రమల శాఖపై అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సిఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, టిజిఐఐసి మేనేజింగ్ డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. జనవరి 20 నుంచి దావోస్ పర్యటన నేపథ్యంలో రాష్ట్రంలో పెట్టుబడుల సమీకరణ, వాటి పురోగతిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రులు, అధికారులతో సమీక్షించారు. గత ఏడాది ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న ఏయే కంపెనీలు రాష్ట్రంలో కార్యకలాపాలను ప్రారంభించాయి, అవి ఏయే దశలో ఉన్నాయని ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. తొలి ఏడాదిలో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయని ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. ''గత ఏడాది దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో చేసుకున్న ఒప్పందాలతో రాష్ట్రానికి రూ.40,232 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 14 ప్రముఖ కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకు వచ్చాయి. దాదాపు 18 ప్రాజెక్టులకు ఒప్పందాలు కుదిరాయి. వీటిలో దాదాపు 17 ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయి. పది ప్రాజెక్టులు వివిధ దశల్లో వేగం పుంజుకున్నాయి. ఏడు ప్రాజెక్టుల అమలు ప్రారంభ దశలో ఉంది'' అని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. కంపెనీల వారీగా పురోగతిని మంత్రి శ్రీధర్‌బాబుతో సిఎం చర్చించారు. ఈ నెల 16వ తేదీ నుంచి నుంచి 19వ తేదీ వరకు సింగపూర్, ఈ నెల 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకు ముఖ్యమంత్రి దావోస్‌లో పర్యటించనున్నారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రి శ్రీధర్‌బాబు, పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు ఈ పర్యటనలో ఉంటారు. సింగపూర్‌లో స్కిల్ యానివర్సిటీతో ఒప్పందాలతో పాటు ఇతర పెట్టుబడులకు సంబంధించి సంప్రదింపులు జరుపుతారు. దావోస్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో పాల్గొంటారు. ఈ ఆరు రోజుల పర్యటనకు సంబంధించిన షెడ్యూలుతో పాటు, అక్కడ జరిగే సదస్సులు, వివిధ పరిశ్రమల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశాల ప్రణాళికను అధికారులు సిఎంకు వివరించారు.

## కౌశిక్ రెడ్డి అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

సంజయ్ కుమార్‌పై కౌశిక్‌రెడ్డి దాడికి పాల్పడ్డాడు. సంజయ్‌కుమార్ కరీంనగర్ వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో కౌశిక్‌రెడ్డిపై ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కౌశిక్‌రెడ్డిపై మూడు ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారు. బిఎన్‌ఎస్2023 కింద అతనిపై 126 (2), 115(2),352,292 సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేశారు. కౌశిక్ రెడ్డి హైదరాబాద్‌లో ఉన్నాడని తెలుసుకున్న కరీంనగర్ పోలీసులు అరెస్టు చేశారు.ఇదిలావుండగా ఎంఎల్‌ఎ పాడి కౌశిక్ రెడ్డి పై చర్యలు తీసుకోవాలంటూ ఎంఎల్‌ఎ సంజయ్‌కుమార్ స్పీకర్ కు ఫిర్యాదు చేశారు.

## గల్లీ నుంచి ఢిల్లీ వరకు నడుస్తున్న బిసి నినాదం

లెక్చరర్లు, మేధావులు బిసి ఉద్యమాన్ని భుజానికెత్తుకొని పోరాడాలి

తెలంగాణ లెక్చరర్స్ అసోసియేషన్ సమావేశంలో ఆర్. కృష్ణయ్య



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గల్లీ నుంచి ఢిల్లీ వరకు బిసి నినాదం నడుస్తుందని, ఈ సమయంలో లెక్చరర్లు, మేధావులు బిసి ఉద్యమాన్ని భుజానికెత్తుకొని పోరాడాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. తెలంగాణ లెక్చరర్స్ అసోసియేషన్ స్టేట్ కౌన్సిల్ సమావేశం హైదరాబాద్ విద్యానగర్‌లోని బిసి భవన్‌లో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ చదువు ద్వారానే కులాలు అభివృద్ధి జరుగుతుందన్నారు. సమాజంలో మార్పు కోసం ముందుకు రావాలన్నారు. ప్రపంచంలో జరిగిన విప్లవాత్మకమైన మార్పు మేధావులతో సాధ్యమైందన్నారు. రాష్ట్రంలో బిసి ఉద్యమం బలంగా ఉందని, వచ్చేది బిసిల రాజ్యమే అన్నారు. దేశ ప్రధాని బిసి కావడం గొప్ప విషయమని, ఆయన ఒక త్యాగి అన్నారు. పదోన్నతులలో బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. సివిల్ సర్వీసెస్‌లలో బిసిల సంఖ్య తక్కువ ఉందని, కేంద్ర ప్రభుత్వంలో 100 మంది ముఖ్య కార్యదర్శులు ఉంటే, బిసిలు కేవలం ముగ్గురు మాత్రమే ఉన్నారన్నారు. సుప్రీం కోర్టు జడ్జీలలో ఒక్కరూ కూడా బిసి లేరన్నారు. ఉన్నత స్థాయి పదవులలోకి వెళ్లకుండానే బిసిలు రిటైర్‌మెంట్ అవుతున్నారని ఆర్.కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని సవరించి, బిసిలకు పదోన్నతులలో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. రాచప్ప కమిటీ సిఫార్సు మేరకు బిసిలకు పదోన్నతులలో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. బిసి మేధావులు బలమైన ఉద్యమం చేపడితే, పాలకులు దిగివచ్చి సమస్యలను పరిష్కరిస్తారన్నారు. మేధావులైన లెక్చరర్లు బిసి ఉద్యమానికి నాయకత్వం వహించాలన్నారు. మీరు నాయకత్వం వహిస్తే ఈ ఉద్యమం బలంగా ప్రజల్లోకి వెళ్లుతుందన్నారు. సామాజిక పరివర్తన జరుగుతుందని, మన కులాలకు సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. పార్లమెంట్‌లో బిసి బిల్లు పెట్టి చట్టసభలలో 50 శాతం రిజర్వేషన్‌లను సాధించడమే లక్ష్యంగా ఉద్యమిద్దామ ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, తెలంగాణ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కాముని సుదర్శన్, మామిడి విఠల్, చింతల శంకర్, డాక్టర్ మండలోజు నర్సింహస్వామి, బి.శేఖర్, బాబురావు, పరుశురామ్, సంతోష్, పృధ్వీగౌడ్, గుజ్జ సత్యం, నందగోపాల్, సుధాకర్, ఉదయ్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

## 'తెలంగాణ.. జరూర్ ఆనా'..

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి జూపల్లి కృష్ణారావు జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రాంభించారు. ఆ తరువాత ఇద్దరు మం త్రులు గాలిపటాలను ఎగరవేసి కనువిందు చేశారు. ఈ సందర్భంగా జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలందరికీ భోగి, సంక్రాంతి పండగ శుభాకాంక్షలు తెలిపారు. పతంగులు ఎగడరవేయడం అనాదిగా వస్తుందని, 'ఇంటర్నేషనల్ కైట్ స్వీట్ ఫెస్టివల్'కు మన హైదరాబాద్ వేదికగా నిలవడం సంతోషాన్నిస్తుందన్నారు. ఇండోనేషియా, స్విడన్, ఆస్ట్రేలియా, శ్రీలంక, కెనడా, కం బోడియా, థాయిలాండ్, దక్షిణ కొరియా, ఫిలిప్పీన్స్, వియత్నాం, మలేషియా, ఇటలీ, దక్షిణాఫ్రికా, జపాన్, ట్యునీషియా, పోలాండ్, సింగాపూర్, ఉక్రెయిన్, ఫ్రాన్స్ వంటి 19 దేశాల నుంచి వచ్చిన 47 మ ంది అంతర్జాతీయ కైట్ ఫ్లైయర్స్, 14 రాష్ట్రాల నుంచి 60 దేశవాళీ కైట్ క్లబ్ సభ్యులు ఈ ఫెస్టివల్‌లో పా ల్గొంటున్నారన్నారు. ఇలాంటి వేడుకలు ఆయా దేశాల సాంస్కృతిక వినిమయానికి దోహదం చేస్తాయన్నారు. మన సంస్కృతి, వారసత్వం గొప్పదని, పండగలు మన సంస్కృతి, సాంప్రదాయాలు, వారసత్వానికి ప్రతీకలు అన్నారు. సంక్రాంతి పండుగలో కైట్స్ ది ముఖ్యపాత్ర అని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. నేటితరం యువత అవుట్ డోర్ గేమ్స్ మరిచిపోయి ఆన్ లైన్ గేమ్స్‌కు అలవాటు పడుతున్నారన్నారు. అతిగా మొబైల్ ఫోన్లను వాడుతూ.. ఎక్కువ సమయం సోషల్ మీడియాలో గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాంస్కృతిక పునరుజ్జీవనం, జీవన విధానం సంరక్షణకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. చైనా మాంజా వాడడం వల్ల ప్రాణాలు పోయే ప్రమాదం ఉందన్నారు. దారంతో చేసిన మాంజాను మాత్రమే వాడాలని కైట్ ఫ్లైయర్లకు ఆయన సూచించారు. అనంతరం ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలను మంత్రులు తిలకించారు. ఈ సందర్భంగా తెలుగు ప్రజలందరికీ మంత్రులు.. సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కైట్ ఫెస్టివల్‌లో 16 దేశాలకు చెందిన 40 మంది అంతర్జాతీయ కైట్ ఫ్లైయర్లు, వివిధ రాష్ట్రాల నుంచి 60 మంది కైట్ ఫ్లైయర్లు ఈ వేడుకల్లో పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్ పర్సన్ డా. వెన్నెల గద్దర్, రోడ్ డెవలప్మెంట్ కార్పోరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ మెంబర్ సంకేపల్లి సుధీర్ రెడ్డి, పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్, పర్యాటక శాఖ సంచాలకులు జెండగే హనుమంతు కొండిబా, భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, కైట్ ఫెస్టివల్ కన్సల్టెంట్ పవన్. డి. సోలంకి, క్లిక్ కన్వీనర్ లిబి బెంజిమన్, దేశీయ, అంతర్జాతీయ కైట్ ఫ్లయర్స్, వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



### పతంగి ధర రూ.కోటిన్నర

ఆ పతంగి విలువ అక్షరాల కోటిన్నర రూపాయలు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం ప్రారంభమైన కైట్ ఫెస్టివల్‌లో రూ.1.5 కోట్ల విలువైన పతంగి నింగిలోకి ఎగిరింది. మకర సంక్రాంతి పండుగ సందర్భంగా కోటి రూపాయల పతంగి, తెల్లదారానికి గోల్డ్ కోటింగ్ మాంజాకు రూ.40 లక్షలు పెట్టి హైదరాబాద్ పాతబస్తీకి చెందిన గోల్డ్‌మెన్ సూర్యాభాయ్ పతంగిని ఎగురవేశారు. భోగి, కైట్ ఫెస్టివల్ హైదరాబాద్‌లో ఘనంగా జరుగుతోంది. జంటగనగరాల్లో చిన్నా, పెద్దలు పంతగులు ఎగురవేస్తూ సందడి చేస్తున్నారు. ఈ సందర్భంగా సూర్యాభాయ్ మీడియాతో మాట్లాడుతూ కోటిన్నర రూపాయల విలువైన పతంకి ఎగురవేశానని, ఈ పతంగితో పోటీ పడే మరో పతంగి లేదని తెలిపారు. మొట్ట మొదటి సారిగా భారీమొత్తంలో ఖర్చు పెట్టి పతంగి తయారు చేయించినట్లు ఆయన తెలిపారు. వెయ్యి పతంగులు వచ్చినా ఇలా తగిలి అలా పక్కకి వెళ్లిపోతాయని ఆయన అన్నారు. ప్రతి సంక్రాంతికి 'గోల్డ్ కైట్ ఎగురవేస్తానని, ఎపి, తెలంగాణలో తనలా కోటిన్నర రూపాయల విలువైన పతంగి మరెవరు ఎగురవేయలేరని ఆయన సవాల్ విసిరారు. పరేడ్‌గ్రౌండ్స్‌లో జరుగుతున్న కౌట్ ఫెస్టివల్‌లో ఈ గోల్డ్ కైట్ అందరినీ ఆకట్టుకుంది.

## ఫ్యాక్ట్ చెక్ ఎత్తివేత

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికైన తరువాత కొత్త శకం ప్రారంభమైందని ఆయన ప్రకటించడం ద్వారా తాజా నిర్ణయాల వెనుక కథేమిటో బహిర్గతమైంది. ప్రపంచవ్యాప్తంగా జ్యాకర్‌బెర్గ్ తన మల్టీ బిలియన్ డాలర్ల టెక్ కంపెనీ సంపదను విస్తరించడంపై ప్రభుత్వం నుంచి తక్కువ నియంత్రణలు ఉండేలా ఈ చర్య తీసుకున్నా డు. ఫ్యాక్ట్ చెకింగ్ ప్రోటోకాల్స్‌ను ఎత్తివేత పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేయడంతో పాటు, ఈ నిర్ణయంపై సామాజిక మాధ్యమాలను వినియోగించేవారు, విధాన నిర్ణేతలు, మీడియా నిపుణుల మధ్య ఒకేలాంటి చర్చకు దారి తీసింది. కంటెంట్ పరిశీలన వాస్తవాల నిర్ధారణ, సరైన సమాచారం అందించడం, ప్రజా భద్రత విషయాలను జ్యాకర్‌బెర్గ్ గాలికి వదిలేసారనే అభిప్రాయం వ్యక్తమవుతంది. అయితే, ప్లాట్‌ఫామ్ యూజర్‌లకు నష్టం కలిగించడం మెటా వ్యవస్థాపకుడికి కొత్తేమి కాదు. ఫేస్‌బుక్ యూజర్‌ల వినియోగం ఆధారంగా వారి ప్రొఫైల్స్‌ను 2016లో డొనాల్డ్ ట్రంప్ అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ఉపయోగించుకున్నారు. బ్రిటీష్ కన్సల్టింగ్ సంస్థ కేంబ్రిడ్జ్ అనాలిటికా లక్షలాది ఫేస్‌బుక్ వినియోగదారుల వ్యక్తిగత సమాచారాన్ని వారి అనుమతి లేకుండా సేకరించి, ట్రంప్ కోసం వినియోగించింది. ఈ విషయాన్ని విజిల్ బ్లోయర్ క్రిస్టఫర్ వైల్ బైటపెట్టాడు. 2021లో ఊడా డాటా సైంటిస్ట్ ఫ్రాన్సెస్ హేవ్‌జెన్ సైతం ఫేజ్‌బుక్ విజిల్‌బ్లోయర్‌గా మారి, ప్రజల మంచికి, సామాజిక మీడియా దిగ్గజం ప్రయోజనాలకు మధ్య ఘర్షణ తలెత్తినప్పుడు ఫేస్‌బుక్ తన ప్రయోజనాల వైపై నిలబడిందని ఆమె అంతర్గత నివేదికలతో సహా ఇంటర్వ్యూలు ఇచ్చారు. సెనెట్ విచారణలో ఆమె వాంగ్మూలమిస్తూ ఫేస్ బుక్ ఉద్దేశ్యపూర్వకంగా ప్రజలు, అమెరికా ప్రభుత్వం, ప్రపంచంలోని ఇతర ప్రభుత్వాల నుంచి కీలక సమాచారాన్ని దాచిపెట్టిందని తెలిపారు. పదే పదే ప్రజలను తప్పుదారి పట్టించిందని తన స్వంత పరిశోధనలో తేలిందని, అలాగే చిన్నపిల్లల భద్రత విషయంలో, కృత్రిమ మేధస్సు వ్యవస్థలల్లో, విభజనవాదాన్ని, పరుష సందేశాలను ప్రచారం చేయడంలో ఇది నిజమని నిరూపితమైందన్నారు. 2016 డిసెంబర్ నుంచి మెటా ఫ్యాక్ట్ చెకింగ్‌కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. నాటి నుంచి కూడా తప్పుడు సమాచారానికి మెటాకు చెందిన అతి పెద్ద సామాజిక మాధ్యమం ఫేస్‌బుక్ వేదికగా నిలిచిందని, వ్యాక్సిన్‌లు, కొవిడ్–19, తదితర అంశాలపై జరిగిన అధ్యయనాలలో తేలింది. ఇది అనుకోకుండా జరిగింది కాదని, ఉద్దేశ్యపూర్వకంగానే జరిగింది. జ్యాకర్‌బెర్గ్ తన వీడియో సందేశంలో చివరకు తాము ప్రెసిడెంట్ ట్రంప్‌తో కలిసి పని చేస్తామని, అమెరికా సంస్థల వెంటపడుతున్న, సెన్సార్ చేస్తున్న ప్రపంచంలోని ఇతర ప్రభుత్వాలను వెనక్కి నెట్టేందుకు ఆయనతో కలిసి కృషి చేస్తామన్నారు.

## సంక్రాంతి సందడి

(మొదటి పేజీ తరువాయి)

వనస్థలి పురం తదితర ప్రాంతాల్లో భోగి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. హరిదాసుల కీర్తనుల గంగిరెద్దుల విన్యాసాలతో పండగ పూర్తిగా ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆనందోత్సవా మధ్య జరుపుకున్నారు. సాయంత్ర వేళా చిన్నారులకు తమ తల్లిదండ్రులు బోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. శనగలు, రేగుపండ్లు, నాణేలు, పూలు కలిపి చిన్నారుల తలలపై నుంచి పోయడంతో వారి మురిసి పోయ్యారు.

### ఆకట్టుకున్న రంగవల్లులు, సాంస్కృతిక కార్యక్రమాలు

సంక్రాంతి పండుగ మొదటి రోజు భోగి వేడులలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆకట్టుకున్నాయి. హైదరాబాద్‌లోని కాలనీలు, బస్తీలు, అపార్ట్‌మెంట్లు, గెటెడ్ కమ్యూనిటీ అసోసియేషన్లను ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించారు. ఇందులో భాగంగా చిన్నారులు క్విజ్ పోటీలు, పతంగుల పోటీలు, క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులను అందజేశారు. అదేవిధంగా ఎక్కడికక్కడ మహిళలు ముగ్గుల పోటీలను నిర్వహించారు. దీంతో పలు నగరంలోని పలు వీధులు, మైదానాలు, దేవాలయాల ప్రాంగణాలు రంగు వల్లులతో మంత్ర ముగ్దులను చేశాయి. ఈ రంగ వల్లులను న్యాయ నిర్ణేతలు పరిశీలించి ప్రథమ, ద్వితీయ,తృతియ బహుమతులను ప్రధాన చేశారు. మరోవైపు మాదాపూర్‌తో పాటు ఉప్పల్ శిల్పరామంలో సంక్రాంతి పర్వ దిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈవేడుకలను తిలకించేందుకు నగరవాసులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

# ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన

మంచుకొండ ఎత్తిపోతల పథకానికి ఉపముఖ్యమంత్రి, మంత్రులు శంకుస్థాపన



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ఇందిరమ్మ రాజ్యంలో పాలన సాగిస్తున్నట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. గత ప్రభుత్వంలో అమలు చేయని పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని ఉపముఖ్యమంత్రి తెలిపారు. సాగునీటిని అందించే ప్రాజెక్టులకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు. ఖమ్మం జిల్లాలో సోమవారం రఘునాథపాలెం మండల పరిధిలోని మంచుకొండ గ్రామంలో రూ.66 కోట్లతో నిర్మించనున్న మంచుకొండ ఎత్తిపోతల పథకానికి నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిలతో కలిసి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ త్వరలో రైతు భరోసా కింద రూ.12వేలు, భూమిలేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రూ.12వేలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఖమ్మం జిల్లా ప్రస్తుతం వ్యవసాయ ఆధారిత జిల్లా మాత్రంగానే ఉందని, గతంలో ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు భద్రాచలం పేపర్‌బోర్డు, సింగరేణి, కెటిపిఎస్, భారజల కర్మాగారం వంటి అనేక పరిశ్రమలు ఉన్నాయని భట్టి తెలిపారు. ఖమ్మంజిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలంటే పరిశ్రమలు ఏర్పాటు కావాలని దానికి అనుగుణంగా ఖమ్మం జిల్లాలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు భట్టి తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని భట్టి తెలిపారు.

**సామాజిక న్యాయం అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

సామాజిక న్యాయం అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు అందించే ప్రాజెక్టులకు ప్రాధాన్యతనిస్తూ వాటి నిర్మాణానికి కృషిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. దేశంలోనే రికార్డు స్థాయిలో 66.07 లక్షల ఎకరాల్లో వరి పంట సాగైందని 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిందని ఆయన తెలిపారు. ప్రభుత్వమే రైతులు పండించిన పంటను మద్దతు ధరకు కొనుగోలు చేయడంతో పాటు సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ కూడా అందించినట్లు తెలిపారు.

**ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంది : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

మార్పు కావాలని ప్రజలు ఇందిరమ్మ రాజ్యాన్ని కోరుకున్నారని దానికి అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే ఇచ్చిన హామీల్లో కొన్ని కార్యక్రమాలను అమలు చేసినట్లు ఆయన తెలిపారు. ఈనెల 26 నుంచి నాలుగు కొత్త పథకాలను ప్రారంభించనున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల పంపిణీ వంటి కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. రఘునాథపాలెం మండలంలో ఎక్కువగా గిరిజనులు ఉన్నారని ఈ ప్రాంత ప్రజలకు సాగునీటిని అందించేందుకు మంచుకొండ ఎత్తిపోతల పథకం ప్రారంభించుకోవడం సంతోషకరమన్నారు.

**10 నియోజక వర్గాలు పచ్చగా ఉండటమే లక్ష్యం : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని 10 నియోజక వర్గాలు పచ్చగా ఉండటమే తన లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గత ప్రభుత్వం లక్షల కోట్లు ఖర్చు పెట్టి కొత్తగా ఒక ఎకరానికి సాగునీటిని అందించలేదని ఆయన తెలిపారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను ఉమ్మడి ఖమ్మం జిల్లాకు తీసుకు వచ్చి సస్యశ్యామలం చేయడమే తన లక్ష్యమన్నారు. వరదలు వచ్చినప్పుడు నీరు వృథాగా పోకుండా మున్నేరు లింక్ కెనాల్ ఏర్పాటు చేసి పాలేరు చెరువుకు నీటిని తరలించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆయన తెలిపారు. సత్తుపల్లి ట్రంక్ పూర్తయితే సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజక వర్గాల సాగు కష్టాలు తీరుతాయని దానికి రూ.70కోట్లు అవసరమని వాటిని మంజూరు చేయాలని ఉప ముఖ్యమంత్రిని కోరారు. రైతులు పామాయిల్ సాగు చేపట్టాలని కోరారు. 31జిల్లాల్లో పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.

**పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి : మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీటిని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిలు రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాం నాయక్, ఎంఎల్ఎలు కూనంనేని సాంబశివరావు, మట్టా రాగమయి, మాలోత్ రాందాస్ నాయక్, జారె ఆదినారాయణ, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మినారాయణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, వాంకుడోత్ దీప్లానాయక్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ చెన్నారెడ్డికి సిఎం రేవంత్‌రెడ్డి నివాళి



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ మర్రి చెన్నారెడ్డి జయంతి సందర్భంగా ఆయనకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నివాళులు అర్పించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో డాక్టర్ చెన్నారెడ్డి చిత్రపటానికి రేవంత్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు. రాష్ట్రానికి డాక్టర్ చెన్నారెడ్డి చేసిన సేవలను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.



## మంద జగన్నాథంకు నేతల కన్నీటి వీడ్కోలు

సైదాబాద్‌లో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నాగర్ కర్నూల్ మాజీ ఎంపి మంద జగన్నాథంకు రాష్ట్ర మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు, పలు పార్టీల నాయకులు నివాళ్లు అర్పించారు. ఆదివారం ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో సైదాబాద్ శ్మశానవాటికలో మంద జగన్నాథం అంత్యక్రియలు జరిగాయి. అంత్యక్రియల్లో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకరగౌడ్, దామోదర రాజనర్సింహ్మా, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్య, మాజీ ఎంపి కే.కేశవరావు, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎంఎల్ఏ సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు మధుయాష్కీ, సంపత్‌కుమార్, మందకృష్ణ మాదిగతో పాటు పలువురు అధికారులు, నేతలు పాల్గొన్నారు. మంద జగన్నాథం సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ప్రజలకు ఎనలేని సేవలు అందించారని, ఆయన మరణం తీరని లోటని మంత్రి జూపల్లి ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లావాసిగా ఆయనతో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేసుకున్నారు. గత కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న మంద జగన్నాథం ఆదివారం తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. నిత్యం ప్రజల గురించి ఆలోచించే ఓ సీనియర్ నాయకుడ్ని రాష్ట్రం కోల్పోయిందని మంత్రి దామోదర రాజనర్సింహ్మా అన్నారు. తెలంగాణ ఏర్పాటుకు ఎంతో కృషి చేసి, ఎప్పుడూ తెలంగాణ అభివృద్ధిని ఆయన కోరుకునే వారని కెటిఆర్ అన్నారు.

### మందాజగన్నాథం మృతికి సిపిఐ సంతాపం

మాజీ పార్లమెంట్ సభ్యుడు మందా జగన్నాథం మరణం పట్ల సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. జగన్నాథం కుటుంబ సభ్యులకు వారు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మంద జగన్నాథం తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారని, కేంద్రంతో పోట్లాడి తెలంగాణ సాధనకు కృషి చేశారని సాంబశివరావు తన సంతాప సందేశంలో తెలిపారు. నాలుగు పర్యాయాలు ఎంపిగా పనిచేసిన మంద జగన్నాథం ప్రత్యేక తెలంగాణ సాధన కోసం పార్లమెంట్‌లో తన గొంతును వినిపించారని చాడ వెంకటరెడ్డి గుర్తు చేసుకున్నారు. ప్రభుత్వ ప్రతినిధిగా ఢిల్లీలో ఉండి తన సేవనలు అందించారని కొనియాడారు.

## సినీనటి 'అన్షు'పై దర్శకుడు త్రినాథరావు అసభ్యకర వ్యాఖ్యలు

సుమోటోగా కేసు నమోదు చేసిన మహిళా కమిషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హీరోయిన్ అన్షుపై దర్శకుడు త్రినాథరావు చేసిన అసభ్యకర వ్యాఖ్యలపై తెలంగాణ మహిళా కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆయన చేసిన వ్యాఖ్యలను సుమోటో కింద కేసు నమోదు చేసింది. నేడో, రేపో త్రినాథరావుకు మహిళా కమిషన్ నోటీసులు జారీ చేయనుంది. సినీనటి అన్షుపై దర్శకుడు త్రినాథ రావు నక్కిన చేసిన వ్యాఖ్యలు టాలీవుడ్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. నటుడు సందీప్ కిషన్ హీరోగా తాను డైరెక్ట్ చేసిన 'మజాకా' టీజర్‌ను అదివారం లాంచ్ చేశారు. ఈ సందర్భంగా వేదికపై త్రినాథరావు మాట్లాడుతూ.. హీరోయిన్ అన్షుపై అసభ్యకర వ్యాఖ్యలు చేశారు. 'తెలుగు సినిమాల్లో ఇలా సన్నగా ఉంటే కుదరదని.. బాగా తిని సైజులు పెంచాలి' అంటూ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే త్రినాథరావు అసభ్యకర వ్యాఖ్యలపై తెలంగాణ మహిళా కమిషన్ సీరియస్ అయింది. హీరోయిన్ అన్షుపై చేసిన వ్యాఖ్యలను తాము సుమోటోగా స్వీకరించామని ప్రకటించింది. త్వరలో త్రినాథరావుకు నోటీసులు జారీ చేస్తామని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద తెలిపారు.

## గుండెపోటుతో సీనియర్ జర్నలిస్టు అనిల్ మృతి

సిఎం, మంత్రులు, టిపిసిసి చీఫ్, కెసిఆర్, కెటిఆర్ సంతాపం

నేడు అల్వాల్‌లో అంత్యక్రియలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ టుడే ఆంగ్ల దిన పత్రిక సీనియర్ జర్నలిస్టు అనిల్‌కుమార్ గుండెపోటుతో మృతిచెందారు. అనిల్‌కు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. అనిల్ అంత్యక్రియలు మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు అల్వాల్ శ్మశాన వాటికలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సంక్రాంతి సెలవులు కావడంతో ఆదివారం అనిల్ కుటుంబ సభ్యులతో కలిసి తీర్థయాత్రలకు వెళ్లారు. దైవ దర్శనం ముగించుకుని ఆలయం బయటికి వచ్చిన ఆయనకు ఛాతిలో నొప్పి వచ్చింది. ఈ విషయం గ్రహించిన స్నేహితులు, కుటుంబ సభ్యులు భత్కల్‌లోని ఆసుపత్రికి తరలించారు. ఐసియులో చికిత్స పొందుతూ అర్ధరాత్రి ఆయన తుదిశ్వాస విడిచారు. అనిల్ మృతదేహాన్ని అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. అనిల్ మృతి చెందడంతో ఆల్వాల్‌లోని ఆయన నివాసంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తెలంగాణ టుడే సీనియర్ జర్నలిస్ట్ అనిల్‌కుమార్ ఆకస్మిక మరణం పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అనిల్ కుమార్ కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. జర్నలిస్ట్‌గా పత్రికా రంగానికి అనిల్‌కుమార్ అందించిన సేవలను ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. సీనియర్ జర్నలిస్ట్ అనిల్ కుమార్ మృతి పట్ల టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్‌గౌడ్ సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్రమశిక్షణ జలిగిన జర్నలిస్టు అనిల్ ఆకస్మిక మృతి దిగ్భ్రాంతికి గురిచేసిందని ఆయన పేర్కొన్నారు. సీనియర్ జర్నలిస్ట్ అనిల్ కుమార్ మృతి పట్ల పలువురు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి అనుసూయ సీతక్క సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనిల్ మృతి జర్నలిజం రంగానికి తీరని లోటు వారు పేర్కొన్నారు. జర్నలిజం వృత్తిలో అనిల్‌తో ఉన్న సంబంధాలను మంత్రులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. స్నేహశీలి, మృదు స్వభావి, మంచి భవిష్యత్తు ఉన్న అనిల్ కుమార్ మరణంతో తెలంగాణ ఒక మంచి జర్నలిస్టును కోల్పోయిందని మంత్రి సీతక్క తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. ఆంగ్ల దిన పత్రిక తెలంగాణ టుడే సీనియర్ జర్నలిస్టు అనిల్ కుమార్ అకాల మృతి పట్ల బిఆర్ఎస్ అధ్యక్షులు కె.చంద్రశేఖర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు సంతాపం ప్రకటించారు. అనిల్ కుటుంబ సభ్యులకు వారు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## సాగునీటి కోసం కొట్లాడింది 'సిపిఐ'నే

మంచుకొండ ఎత్తిపోతల పథకం నిర్మాణం అభినందనీయం : ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/ఖమ్మం :** నాగార్జున సాగర్ ఎడమ కాలువ డిజైన్ మార్పు కారణంగా కామేపల్లి, కారేపల్లి, ఇల్లందు సహా పలు ప్రాంతాలు సాగునీటికి నోచుకోలేదని వెంకటాయపాలెం వద్ద డీప్ కట్ ఏర్పాటు కారణంగా జిల్లాకు నష్టం జరిగిందని కొత్తగూడెం ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. సాగునీటి కోసం నల్లమల గిరిప్రసాద్, పువ్వాడ నాగేశ్వరరావు, మహ్మద్ రజబ్‌అలీ, టివి చౌదరి తదితరుల నేతృత్వంలో అనేక పోరాటాలు చేశామన్నారు. సోమవారం మంచుకొండ వద్ద ఎత్తిపోతల పథకం శంకుస్థాపన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు మల్లు భట్టివిక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితరులతో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కూంనేని మాట్లాడుతూ అప్పటి ఇంజనీర్ కెఎల్.రావు వైఖరి కారణంగా జరిగిన నష్టానికి మంచుకొండ ఎత్తిపోతల పథకంతో కొంతమేర న్యాయం జరుగుతుందన్నారు. మహ్మద్ రజబ్‌అలీ ప్రస్తుతం రఘునాథపాలెం మండలంలోనే పాపటపల్లిలో జన్మించారని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. తక్కువ ఖర్చుతో సాగునీటిని అందించేందుకు ఖమ్మం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి అభినందనీయమన్నారు. గతంలో మధిర నియోజక వర్గంలోని వందనం, కోదుమూరు, రాఘవాపురం గ్రామాలకు నాగార్జున సాగర్ ఎడమ కాలువపై ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేసి మల్లు భట్టివిక్రమార్క సాగునీటి కొరతకు పరిష్కారం చూపారని, అదే రీతిలో భక్తరామదాసు ఎత్తిపోతల పథకాన్ని కూడా నిర్మించడం జరిగిందని సాంబశివరావు తెలిపారు. ఖమ్మంజిల్లాకు చెందిన మంత్రులు భట్టి, తుమ్మల, పొంగులేటి తో పాటు ఇన్‌చార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కలిసి పంచ పాండవుల్లా ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కృషిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలు వేరు కాదని, రెండు జిల్లాల అభివృద్ధికి పంచపాండవులు చేయూతనందించాలని కోరారు.

## బీబీనగర్ ఎయిమ్స్ ఆస్పత్రిలో 'హెచ్‌ఎంపివి వైరస్ పరీక్షలు'

నోడల్ అధికారిగా డాక్టర్ రాహుల్ నరంగ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు హెచ్‌ఎంపివి వైరస్ నమూనాలను బీబీనగర్‌లోని ఎయిమ్స్ ఆస్పత్రికి పంపించాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. హెచ్‌ఎంపివి వైరస్‌కు సంబంధించిన పర్యవేక్షణ, ఆస్పత్రులతో సమన్వయం చేసుకునేందుకు ప్రత్యేకంగా ఒక నోడల్ అధికారిని నియమించారు. దీంతో వైరస్ నమూనాల పరీక్షలు, వాటి ఫలితాలు తదితర అంశాలను ఎయిమ్స్‌లోని డాక్టర్ రాహుల్ నరంగ్‌కు పర్యవేక్షించనున్నారు. ఏమైనా అనుమానాలు, సలహాలు కావాలంటే రాహుల్ నరంగ్‌ను సంప్రదించాలని వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్రంలోని డిఎంహెచ్‌ఒలు, ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులకు సూచించింది. ఐహెచ్ఐపి పోర్టల్‌లో దీనికి సంబంధించి ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయనున్నారు. 2024సం.లో (జనవరి,డిసెంబర్) వరకు సుమారు 9500 నమూనాలను పరీక్షిస్తే, ఇందులో 3 శాతం హెచ్‌ఎంపివి పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. పాజిటివ్ వచ్చిన వారిలో స్వల్ప లక్షణాలు ఉన్నప్పటికీ వారంతా కోలుకున్నట్టు వైద్య ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది. అయితే ఈ వైరస్ శ్వాసకోశపై స్వల్పంగా ప్రభావం చూపించినప్పటికీ రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి ఎక్కువ ప్రభావం పడుతుందని వైద్యాధికారులు చెబుతున్నారు. కాగా వైరస్ సోకిన వారితో కరచాలనం చేయకుండా దూరంగా ఉండాలని వైద్యులు సూచించారు.

## 'గేమ్ చేంజర్' హెచ్‌డి ప్రింట్ లీక్!

కుట్ర జరిగిందంటూ పోలీసులకు ఫిర్యాదు చేసిన టీమ్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** కోట్లకు కోట్ల రూపాయలు ఖర్చు చేసి గ్లోబల్ రేంజ్‌లో ఇమేజ్ ఉన్న ఒక స్టార్ హీరో మూడేళ్లకు పైగా కష్టపడి చేసిన సినిమా విడుదలైన రోజే ఆన్‌లైన్‌లో సినిమా పైరసీ ప్రింట్ లీక్ అయినట్టు గుర్తించారు. సంక్రాంతికి రామ్‌చరణ్ హీరోగా, శంకర్ దర్శకత్వంలో 'దిల్ రాజు, శిరీష్ నిర్మించిన 'గేమ్ చేంజర్ విడుదలైంది. సినిమా విడుదలైన తర్వాత సినిమా హెచ్‌డి ప్రింట్ లీక్ చేయడమే కాకుండా టెలిగ్రామ్, సోషల్ మీడియాలో ఆడియన్స్ అందరికీ షేర్ చేశారని, కాగా, తమను బెదిరించి, పైరసీ ప్రింట్ లీక్ చేశారని 45 మందిపై గేమ్ చేంజర్ సినిమా టీమ్ ఆధారాలతో సహా సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ 45 మంది కలిసి ఓ ముఠాగా ఏర్పడి 'గేమ్ చేంజర్'పై వ్యతిరేకతను వ్యాప్తి చేశారా? పైరసీ ప్రింట్ లీక్ చేశారా? లేదా వాళ్ళ వెనుక ఎవరైనా ఉన్నారా? అనేది తెలియాల్సి ఉందని మేకర్స్ పేర్కొన్నారు. గేమ్ చేంజర్ చిత్ర బృందం నుంచి ఫిర్యాదు అందుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సోషల్ మీడియా (ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్ బుక్, యూట్యూబ్) పేజీలలో ఒక పథకం ప్రకారం 'గేమ్ చేంజర్'పై పలువురు దుష్ప్రచారం చేశారని మేకర్స్ ఆరోపించారు. సినిమా క్లిప్స్ షేర్ చేయడంతో పాటు కీలకమైన ట్విస్టులు రివీల్ అయ్యేలా చేసి ఆడియన్స్ సినిమాను ఎంజాయ్ చేయకుండా చేశారని వారు తెలిపారు. దీని వెనుక సుమారు 45 మందితో కూడిన ఒక ముఠా ఉందని మేకర్స్ ఆరోపిస్తున్నారు. 'గేమ్ చేంజర్' విడుదలకు ముందు నిర్మాతలతో పాటు చిత్ర బృందంలోని కీలక వ్యక్తులు కొందరికి సోషల్ మీడియా, అలాగే వాట్సాప్‌లలో కొంత మంది నుంచి బెదింపులు వచ్చాయని వారు వెల్లడించారు. తాము అడిగిన డబ్బులు ఇవ్వకపోతే సినిమా పైరసీ ప్రింట్ లీక్ చేస్తామని గొడవకు దిగారని, 'గేమ్ చేంజర్' విడుదలకు రెండు రోజుల ముందు సినిమాలో కీలక ట్విస్టులను సోషల్ మీడియా అకౌంట్లలో షేర్ చేశారని సినిమా ప్రతినిధి ఒక ప్రకటనలో వివరించారు. ఆ సోషల్ మీడియా పేజీలపై కూడా ఫిర్యాదు చేశామని, త్వరలో ఆ సోషల్ మీడియా పేజీలపై కూడా చర్యలు ఉంటాయని తెలియచేశారు.

## 26న ఎస్‌కెఎం నిరసన

జిల్లా డివిజన్ స్థాయిలో ట్రాక్టర్, వాహనాలు, ద్విచక్రవాహనాల ప్రదర్శన

21వ తేదీ వరకు ముసాయిదా ప్రతుల దగ్ధం

ఎస్‌కెఎం రాష్ట్ర కమిటీ వెల్లడి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం తక్షణమే రైతు వ్యతిరేక కొత్త జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధాన ముసాయిదాను ఉపసంహరించుకోవడంతో పాటు సీ టూ ప్లస్ 50 శాతంతో పంటలకు మద్దతు ధరల గ్యారంటీ చట్టం చేయాలని, 46 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న రైతు నాయకులు జగ్జీత్‌సింగ్ దల్లేవాల్‌ను రక్షించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న రాష్ట్రవ్యాప్తంగా జిల్లా, డివిజన్ స్థాయిలో ట్రాక్టర్, వాహనాలు, ద్విచక్రవాహనాల ప్రదర్శనను నిర్వహించాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. రైతు ఉద్యమంలో భాగంగా ఈనెల 21వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా రైతులు, రైతు సంఘాల నాయకులు కేంద్ర ప్రతిపాదిత జాతీయ మార్కెట్ విధాన ముసాయిదా ప్రతుల దగ్ధం కార్యక్రమాలను నిర్వహించాలని ఎస్‌కెఎం కోరింది. ఈమేరకు సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కెఎం) రాష్ట్ర కన్వీనర్లు పశ్య పద్మ, టి.సాగర్, ప్రభాకర్, మందా వెంకన్న, నాగిరెడ్డి, మట్టయ్య, రమేష్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానలను నిరసిస్తూ రైతు నాయకులు జగ్జీత్‌సింగ్ 46 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న కేంద్ర ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం, రాష్ట్రపతి సైతం జోక్యం చేసుకోకపోవడం దారుణమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీకి రైతుల ప్రయోజనాల కంటే కార్పొరేట్ కంపెనీలే ముఖ్యమని, వారికి గులామ్‌లుగా మారి వారి ఆర్థిక ప్రయోజనాల కోసం మాత్రమే నిర్ణయాలు తీసుకుంటున్నారని ఎస్‌కెఎం నేతలు తీవ్రంగా విమర్శించారు. వ్యవసాయ రంగంపై పూర్తి ఆధిపత్యం చెలాయించడానికి కార్పొరేట్ కంపెనీలకు పాలకులు పూర్తి మద్దతు ఇస్తూ, దేశానికి వెన్నుముక అయిన రైతులను దగా చేస్తున్నారని అగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తుల అనుకూల నిర్ణయాల కారణంగా దేశంలోని ప్రజలు జీవించే హక్కును కోల్పోతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

## పదేళ్ల ప్రగతి ప్రస్థానాన్ని ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించాలి : కెసిఆర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాజకీయాలతీతంగా, రైతుల సంక్షేమమే ధ్యేయంగా, రాజీపడకుండా పదేళ్ల ప్రగతి ప్రస్థానాన్ని నేటి ప్రభుత్వం (కాంగ్రెస్ ప్రభుత్వం) కొనసాగించాలని బిఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ రావు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. తద్వారా రైతు పండుగ సంక్రాంతి వేడుకలకు వన్నె చేకూర్చినవారమవుతామన్నారు. సంక్రాంతి రైతులకు, వ్యవసాయానికి ప్రత్యేకమైన పండుగ అని అన్నారు. సోమవారం ఆయన రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. రైతుల జీవితాల్లో వెలుగులు కొనసాగాలే వారిని దీవించాలని కెసిఆర్ ఈ సందర్భంగా ప్రకృతి మాతను ప్రార్థించారు. దేశంలో మరెక్కడాలేని విధంగా వ్యవసాయానికి, రైతు సంక్షేమానికి నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం పెద్ద పీట వేసిందన్నారు. భోగితో ప్రారంభమై మకర సంక్రాంతి, కనుమతో మూడు రోజుల పాటు సాగే సంక్రాంతి పండుగ, వ్యవసాయాధారిత పల్లె సంస్కృతిలో ప్రత్యేకతను చాటుకుంటుందని పేర్కొన్నారు. పండిన పంటల రాశులతో ఇండ్లు కళ కళలాడుతుండగా, రైతుల జీవితాల్లో సంక్రాంతి శోభ నిండుదనాన్ని సంతరించుకుంటుందని, రంగవల్లులతో, భోగి మంటలతో, గొబ్బెమ్మలతో, గంగిరెద్దుల ఆటలతో, పిల్లలు పెద్దలు ఆనందోత్సాహాల నడుమ జరుపుకునే ప్రకృతి పండుగ మకర సంక్రాంతి అని కెసిఆర్ వివరించారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాల అభివృద్ధి, రైతు సంక్షేమమే తొలి ప్రాధాన్యత అంశంగా నాడు అమలు చేసిన కార్యాచరణ, పదేళ్ల అనతికాలంలో సత్ఫలితాలనిచ్చిందని ఆయన చెప్పారు. 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్, ప్రాజెక్టులు, కాల్వల ద్వారా సాగునీరు, పంటకు పెట్టుబడిగా రైతుబంధు, రైతు కుటుంబానికి భరోసాగా రైతుబీమా వంటి పలు పథకాలను పటిష్టంగా అమలు చేశామని పేర్కొన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వం దాదాపు నాలుగున్నర లక్షల కోట్ల రూపాయలను వ్యవసాయ రంగాభివృద్ధికోసం ఖర్చు చేసిందని వివరించారు.

## నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి కొత్త సూపరింటెండెంట్

బర్త్‌డే సెలబ్రేషన్‌లో వైద్యుల చప్పట్లు

నూతన సూపరింటెండెంటెగా డాక్టర్ పి.శ్రీనివాస్

ప్రజాపక్షం ఎఫెక్ట్



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** రోగుల ప్రాణాలను గాలికి వదిలి పుట్టిన రోజు వేడుకల్లో వైద్యసిబ్బంది పాల్గొనటం రోగులకు ప్రభుత్వ ఆస్పత్రిలో ఇక్కట్లు.. బర్త్ డే సెలబ్రేషన్‌లో వైద్యుల చప్పట్లు అనే ప్రజాపక్షం దినపత్రికలో వచ్చిన కథనాలకు స్పందించి ఉన్నతాధికారులు జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి నూతన సూపరింటెండెంట్‌గా డాక్టర్ పి.శ్రీనివాస్ నియమించారు. ఎన్నో ఆరోపణలు ఎదుర్కొన్న ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌ను పక్కన పెట్టారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులు ఇబ్బందులకు గురవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ మాత్రం సెలబ్రెటీగా మారి, బర్త్‌డే ఫంక్షన్లు, వేడుకలు, పలు కార్యక్రమాలకు అతిథిగా వెళుతూ పత్రికా ప్రకటనలకు మాత్రమే పరిమితమవుతున్నారని పలు ఆరోపణలు వచ్చిన ఆమె తీరుపై సర్వత్ర విమర్శలు వెల్లువెత్తినా అధికారులు మాత్రం చూసిచూడనట్లు వ్యవహరించారు. ఎట్టకేలకు సోమవారం ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌ను నియమించటంతో ఆమెపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేపడుతారా ? లేదా అన్న దానిపై వేచి చూడాల్సింది. ఏదిఏమైనా ఇటీవల రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మా, మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పలుమార్లు హెచ్చరించినా ఆమె తీరు మారకపోవటంతో ఎట్టకేలకు నూతన సూపరింటెండెంట్‌ను నియమించినట్లు విశ్వసనీయ సమాచారం.

**ఆస్పత్రిలో బర్త్‌డే సెలబ్రేషన్ చేయడమే కారణమా ?**

ప్రభుత్వ ఆస్పత్రిలో సేవలందించాల్సిన సూపరింటెండెంట్ సేవలు మాత్రం అంతంత మాత్రమేనని, ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకుల అండదండలతో నగరంలోని పలువురు ముఖ్యుల అండదండలతో అంత తానై నడిపిస్తున్నారనేది ఆస్పత్రిలో ఉద్యోగులు సైతం చర్చ కొనసాగుతుంది. ఇటీవల స్వయంగా రాష్ట్ర వైద్యారోగ్య మంత్రి దామోదర రాజనర్సింహ్మా ప్రభుత్వ ఆస్పత్రి పని తీరుపై ఆగ్రహం వ్యక్తం చేయడం విదితమే. కాగా మంత్రి ఆగ్రహమే ఇన్‌చార్జిగా తొలగించడం కారణమా అని ? శనివారం పుట్టినరోజు వేడుకలు ఛాంబర్‌లో అంగరంగ వైభవంగా నిర్వహించటం సర్వత్ర విమర్శలు వెల్లువెత్తిన సోషల్ మీడియాలో విమర్శలు రావటం, ఉద్యగులలో చర్చనీయాంశం కావటం విశేషం. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఛాంబర్‌ను ప్రైవేట్ కార్యక్రమంగా నిర్వహించటం పలు ఆరోపణలు కారణమైందా ? శుక్రవారం రెంజల్ మండలం కళ్యాపూర్‌కు చెందిన లక్ష్మి అనే మహిళకు తీవ్ర అనారోగ్యానికి గురికావటంతో శుక్రవారం రాత్రి ఆస్పత్రికి తీసుకురాగా ఆ సమయంలో స్ట్రెక్చర్ సిబ్బంది అందుబాటులో లేకపోవటంతో ఆరుబయటే అరగంట సేపు నరకయాతన అనుభవిస్తున్న భార్య ఆవేదన చూడలేక, సూపరింటెండెంట్‌కు ఫోన్ చేసినా స్పందించకపోవటంతో ఆ భర్త రోగిని ఏడవ అంతస్తుకు భుజాలపై మూసుకుని వెళ్లటం జిల్లా వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. ఈ మూడు కారణాల వల్లే లేక గతంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు పలు ఆరోపణల విషయంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌ను తొలగించటానికి కారణమయ్యాయా ? అని జిల్లా వ్యాప్తంగా చర్చ కొనసాగుతుంది.

ప్రజాపక్షం
మంగళవారం, జనవరి 14

# 'ద్రోహ రాజకీయాలకు అంతం' : షా

కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇటీవల షిరిడీలో రాష్ట్ర బిజెపి సదస్సులో ప్రసంగిస్తూ 'తీవ్ర పర్యవసానాలతో కూడిన' ఒక ప్రకటన చేశారు. ' ద్రోహ రాజకీయాలకు' ముగి ంపు జరగాలన్నారు. అయితే ఆయన ఎవరిని దృష్టిలో పెట్టుకుని ఈ పొడి పొడి మాటలన్నారు, నరేంద్రమోడీ ప్రభుత్వం సైతం మిత్రపక్షాల మద్దతుపై ఆధారపడి ఉండగా ఆ మాట అనాల్సిన అవసరమేమిటి? ఆ వ్యాఖ్య మహారాష్ట్రకే పరిమితమా లేక యావద్దేశంలో పొత్తు రాజకీయాలను దృష్టిలో పెట్టుకుని ఉద్దేశపూర్వకంగా ఆ మాట అన్నారా? ఎవరి వ్యాఖ్యానం వారు చెప్పుకోవచ్చు. మహారాష్ట్రలో ఎన్నికలు ముగిసి బిజెపి నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడిన అనంతరం అమిత్ షా ఈ హెచ్చరిక చేశారు కాబట్టి అది ప్రధానంగా ప్రస్తుతానికి మహారాష్ట్రకు సంబంధించే అనుకోవచ్చు. మహాయుతి కూటమి ఎన్నికల్లో పెద్ద మెజారిటీ సాధించాక ముఖ్యమంత్రిని నిర్ణయించటానికి 10 రోజులు సమ యం పట్టటం, ఆ బాధ్యతను స్వయంగా అమిత్‌షాయే నిర్వహించటం, ఆ సమయంలో తమ మాటను శాసనంగా తీసుకోకుండా మిత్రపక్షాలు–ఏక్‌నాథ్ షిండె శివ సేన, అజిత్ పవార్ ఎన్‌సిపి– కలిగించిన చికాకు పట్ల అసంతృప్తి నేరుగా వ్యక్తం చేయ లేక మొత్తంగా రాజకీయ వ్యవస్థపై ఆ వ్యాఖ్య చేసినట్లున్నారు. వాస్తవానికి ముఖ్య మంత్రి ఏక్‌నాథ్ షిండె నాయకత్వంలో మహాయుతి అనూహ్య విజయాలు సాధించింది. బిహార్ తరహాలో ముఖ్యమంత్రి పదవి తనకే కావాలని ఆయన పట్టుబట్టారు. అది కానప్పుడు హోంశాఖ, మరికొన్ని ముఖ్యమైన శాఖలతో ఆయన నెం.2 స్థానం కోరుకున్నారు. మహారాష్ట్ర రాజకీయాల్లో ఈ మలుపుకు, గెలుపుకు మూలమైన షిండె అలా కోరుకోవటంలో తప్పు లేదు. కూటమిలో తమ పార్టీ రెండవ పెద్ద పార్టీగా ఉన్నప్పటికీ అజిత్ పవార్‌తో పాటు ఉపముఖ్యమంత్రిగా నియామకం పట్ల అతనికి అసంతృప్తి ఉండవచ్చు. మహారాష్ట్రపై ఆధిపత్యం కోసం బిజెపి ఎన్నేళ్లుగానో ప్రయత్నిస్తోంది. శివసేన వ్యవస్థాపకుడు బాలా సాహెబ్ థాక్రే జమానాలో బిజెపి జూనియర్ పార్టనర్.ఆయన అనంతరం శివసేనకు సరైన నాయకత్వం లేని కారణంగా హిందూత్వ భావజాలానికి ప్రధాన ప్రతినిధిగా బిజెపి ఎన్నికల క్షేత్రంలో శివసేనతో పొత్తుతో పైచేయి సాధించింది. దేవేంద్ర పడ్నావీస్ ముఖ్య మంత్రిగా ఒక టరం శివసేనతో ఏలుబడి సాగింది. అయితే 2019 అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి పెద్ద పార్టీ గా అవతరించినా మౌఖిక అవగాహన ప్రకారం ఈపర్యాయం ముఖ్య మంత్రి పదవి తమకివ్వాలని శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ థాక్రే పట్టుబట్టారు. బిజెపి ససేమిరా అనడంతో ఆ యన కూటమి నుంచి బయటకువచ్చి కాంగ్రెస్,శరద్‌పవార్ ఎన్‌సిపితో కొత్త కూటమి ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి అయినారు. అయితే రెండున్నరేళ్లలో బిజెపి శివసేనను చీల్చి,చీలిక గ్రూపు నాయకుడు ఏక్‌నాథ్‌షిండె ముఖ్యమంత్రిగా సంకీర్ణ ప్రభుత్వం ఏర్పా టు చేసింది. తర్వాత కొద్ది మాసాలకు అజిత్‌పవార్ ఎన్‌సిపి శాసనసభా పక్షం నుండి మెజారిటీ సభ్యులను వెంటబెట్టుకుని ఆ ప్రభుత్వంలో చేరారు.

గతంలోకి వెళితే, మహారాష్ట్రలో విజయంతో అస్థిరత రాజకీయాలు, 1978లో శరద్ పవార్ ప్రారంభించిన వెన్నుపోటు రాజకీయాలు అంతమయ్యాయని అమిత్‌షా అన్నారు. ఆనాడు శరద్‌పవార్ 40 మంది ఎమ్మెల్యేలతో వసంతదాదా పాటిల్(కాంగ్రెస్) ప్రభుత్వం నుండి వైదొలిగి ముఖ్యమం త్రి అయినారు. అమిత్‌షా 2019నవంబర్ రాజకీయ సంక్షోభాన్ని ప్రస్తావించి, ''ఉద్ధవ్‌థాక్రె'' తమకు ద్రోహం చేశాడని ఆరోపించారు. యుపిఎతో చేతులు కలిపి ఆయన నవంబర్ 28న ముఖ్యమంత్రి అయినాడు.

అటువంటి ''ద్రోహుల''గూర్చి అమిత్‌షా వ్యాఖ్య కత్తికి రెండు వైపులా పదునులాంటిది. అది శరద్‌పవార్, ఉద్ధవ్ థాక్రేలతో పాటు ఏక్‌నాథ్‌షిండే, అజిత్‌పవార్‌లకూ వర్తిస్తుంది.మహారాష్ట్ర రాజకీయం గందరగోళంగా ఉంది. బిజె పి ముఖ్యమంత్రి ఫడ్నవిస్‌ను పొగుడుతూ శివసేన(ఉద్ధవ్) పత్రిక 'సామ్నా'లో ఒక కథనం ప్రచురించింది. అజిత్‌పవార్, శరద్‌పవార్ ఎన్‌సిపి గ్రూప్‌ల మధ్య సయోధ్య ప్రయత్నాలు జరుగుతున్నట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో అమిత్‌షా 'ద్రోహ రాజకీయాలు ముగింపు' వ్యాఖ్య చేశారు.అది ఇతర రాష్ట్రాల్లోని ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాలకూ హెచ్చరిక కావచ్చు.బిజెపి ఏకపక్ష ఆధిపత్యం ఆకాంక్షను అమిత్‌షా ప్రతిధ్వనించారని భావించవచ్చు.

# తెలుగు, తమిళనాట సంక్రాంతి శోభ

సంక్రాంతి అనగా నూతన క్రాంతి . సూర్యుడు మకర రాశిలో ప్రవేశించడాన్ని మకర సంక్రమణము అంటారు. అయితే ఈ సంక్రమణాన్నే సంక్రాంతి అంటారు. అయితే మనకు పన్నెండు రాశులు ఉన్నాయి.ఆ పన్నెండు రాశులలోకి సూర్యుడు ప్రవేశించే క్రమంలో మనకు పన్నెండు సంక్రాంతులు వస్తాయి. సూర్య సంక్రమణం జరిగేటపుడు సూర్యుడు ఏ రాశిలో ఉంటే ఆ సంక్రాంతి అంటారు. ఇలా ప్రతి మాసం ఒక సంక్రాంతి ఉంటుంది. సౌరమాన కాలెండరులో ప్రతినెల ఒక సంక్రాంతితో ప్రారంభమవుతుంది నవ్యాంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్టాలలో ప్రముఖంగా జరుపుకుంటారు . ఈ పండుగను పెద్ద పండుగగా ఆంధ్రులు జరుపుకుంటారు. సంక్రాంతిని మూడు రోజుల పాటు ఎంతో ఆనందంగా చేసుకుంటారు. మొదటి రోజు భోగి, రెండవ రోజు మకర సంక్రాంతి, మూడవ రోజు కనుమ. కొన్ని ప్రాంతాలలో నాలుగవ రోజు ముక్కనుమగా జరుపుకుంటారు. ఈ మూడు రోజులలో మొదటి రోజు బోగిమంటలతో, రెండవ రోజు పొంగలి, పిండివంటలతో, పితృ దేవతల, దేవుళ్ళ పూజలతో, మూడవ రోజు గో పూజలతో అలాగే మాంసప్రియులకు మంచి కూరలతో, మూడురోజుల పండుగ ఎంతో ఆనందంగా కొనసాగుతుంది.

**ఉత్తరాయణం, దక్షిణాయణం !:** సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే కాలమే మకర సంక్రమణము. మకర సంక్రమణము నుండి ఉత్తరాయణ పుణ్యకాలము ప్రారంభము అవుతుంది. ఆ తరువాత కుంభ, మీన, మేష, వృషభ, మిథున రాశులలో కొనసాగినంత కాలము ఉత్తరాయణము. కర్కాటక రాశిలోకి సూర్యుడు ప్రవేశించిన దగ్గరినుండి మొదలై, ఆ తరువాత సింహ, కన్య, తుల, వృశ్చికం, ధనూ రాశులలో కొనసాగినంత కాలము దక్షిణాయణము. మానసికమైన అర్చనకు,ధ్యానానికీ, యోగానికీ, దీక్షలకు,బ్రహ్మచర్యానికి, నియమ నిష్టలకు అనువైన, ఆవశ్యకత ఉన్న కాలము దక్షిణాయణము.

సూర్యుడి చుట్టూ భూమి పరిభ్రమించే క్రమంలో తన చుట్టూ తాను కూడా తిరుగుతుంది. అందువలన సూర్యుడు ఆరునెలలు ఉత్తరం వైపు, ఆరునెలలు దక్షిణం వైపు కనిపిస్తాడు.ఇలా ఉత్త రం వైపుకనిపించే క్రమమే ఉత్తరాయణం అంటా రు.దక్షిణంవైపు కనిపించే క్రమం దక్షిణాయణం.

## ముఖ్యమైన సంక్రాంతులు

**మకర సంక్రాంతి**–సూర్యుడు మకర రాశిలో ప్రవేశించే రోజును మకర సంక్రాంతి అం టారు. ఇది ఆరు నెలల ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభ దినం. సాంప్రదాయకంగా భారతదేశ కాలెండరు ప్రకారం ప్రతి సంవత్సరం సుమారు జనవరి 14 లేదా 15 వ తేదీలలో వస్తుంది.

మహా వైషువ సంక్రాంతి ఇది రెండు ఋతువుల మధ్య వచ్చే సంధి కాలం. మొదటిది శీతాకాలం, వేసవి కాలం మధ్య వచ్చే సంధి కాల ప్రారంభం మేష సంక్రాంతి (వసంతఋతువులో వచ్చేది), వేసవి కాలం, వర్షాకాలముల మధ్య వచ్చే సంధి కాలం తుల సంక్రాంతి (శరత్ ఋతువులో వచ్చేది). సంవత్సరం మొత్తంలో ఈ రెండు రోజులు కచ్చితంగా పగలు రేయి సమానంగా ఉంటాయి.

అంటే సూర్యోదయం, సూర్యాస్తమయాలు దాదాపు ఒకే సమయమున సంభవిస్తాయన్నమాట. ఈ సంక్రాంతి ఒరియా నూతన సంవత్సరం గానూ, బెంగాలీ కాలెండరులో ఆఖరి దినంగానూ నిర్వహిస్తారు. భారతదేశం లోని అనేక ప్రాంతాలలో ఈ రోజును వైశాఖిగా వ్యవహరిస్తారు.





**కర్కాటక సంక్రాంతి :** జూలై 16, న సూర్యుడు కర్కాటక రాశిలో ప్రవేశిస్తుంది. ఈ దినాన్ని కర్కాటక సంక్రాంతిగా వ్యవహరిస్తారు. ఈ దినం ఉత్తరాయణ పుణ్యకాలానికి ఆఖరి దినంగా హిందూ కాలెండరులో వ్యవహరిస్తారు. ఈ రోజు దక్షిణాయణ పుణ్యకాలానికి మొదటి రోజు.

**భోగి:** భోగి లేదా భోగి పండుగ అనునది ఆంధ్రులు జరుపుకునే ఒక ముఖ్యమైన పండుగ. ఆంధ్రులు పెద్ద పండుగగా జరుపుకునే మూడు రోజుల సంక్రాంతి పండుగలో మొదటిరోజును భోగి అంటారు. భోగి పండుగ సాధారణంగా జనవరి 13 లేదా 14 తేదిలలో వస్తుంది. దక్షిణాయనంలో సూర్యుడు రోజు రోజుకి భూమికి దక్షిణం వైపుగా కొద్ది కొద్దిగా దూరమవుతూ దక్షిణ అర్ధగోళంలో భూమికి దూరం అవుట వలన భూమిపై బాగా చలి పెరుగుతుంది. ఈ చలి వాతావరణాన్ని తట్టుకునేందుకు ప్రజలు సెగ కోసం భగ భగ మండే చలి మంటలు వేసుకునేవారు, ఉత్తరాయణం ముందురోజుకి చలి విపరీతంగా పెరగడం ఈ చలిని తట్టుకునేందుకు భగ భగ మండే మంటలు అందరు వేయటం వలన ఈ రోజుకు భోగి అనే పేరు వచ్చింది.

ఈ పండుగనాడు ఆంధ్రులు కొత్తబట్టలు ధరించడం ఒక సంప్రదాయంగా ఉంది. తెల్లవారుజామున భోగిమంటల వద్ద చలికాచుకున్న చిన్నా పెద్దలు భోగిమంటల సెగతో కాచుకున్న వేడినీటితో లేదా మామూలు నీటితో తలస్నానం చేసి కొత్తబట్టలు ధరిస్తారు.

**ముగ్గులు:** పండుగ నెలలో ముగ్గులు ప్రతిరోజు వేస్తారు, కాని భోగి రోజు ముగ్గు ఒక ప్రత్యేకత, ముగ్గువేసే వారికి ఇష్టంతో కూడిన మరింత కష్టం, సాధారణంగా ముగ్గు వేసే చోటనే భోగి మంటలు వేస్తారు, భోగి మంటల వలన చాలా కసువు తయారవుతుంది. ఆ కసువు అంతా పారబోసి కడిగి ముగ్గువేయడం కొంచెం కష్టంతో కూడుకొన్నప్పటికి ఇష్టమైన పనులు కాబట్టి చాలా ఆనందంగా చేస్తారు, రోజు వేసే ముగ్గుల కన్నా ఈ రోజు మరింత అందంగా రంగు రంగుల రంగవల్లికలేస్తారు.

కొన్ని ప్రాంతాలలో భోగి రోజున రైతులు తమ సాగుభూమికి ఆనవాయితీగా కొంతమేర సాగునీరు పారించి తడి చేస్తారు, ఒక పంట పూర్తయిన తదుపరి మళ్ళీ పంట కొరకు సాగు భూమిలో నీరు పారించడాన్ని పులకేయడం అంటారు, ఆనవాయితీగా భోగి రోజున పులకేయడాన్ని భోగి పులక అంటారు.

**కోడి పందాలు:** గోదావరి జిల్లాల్లో మరి కొన్ని ప్రాంతాల్లో భోగి రోజున కోడి పందాలు వేయడం ఒక ఆనవాయితీగా వస్తుంది, పౌరుషానికి ప్రతీకగా ఉండే కోళ్లు పోటీలో ప్రాణాలను పణ్ణంగా పెట్టి పోరాడుతాయి, ఈ పోటీలను చూసేందుకు ప్రజలు ఆసక్తి కనబరుస్తారు. పోటీలో పాల్గొనే కోళ్లపై పందాలు కాస్తారు. పందాలు కాయడం వలన కలిగే అనర్ధాల వలన పందాలు కాయడంపై నిషేధాంక్షలు ఉన్నాయి. కోళ్ల కాళ్లకు కత్తులు కట్టి పోటీకి దించటం, పందేలు కట్టటం పెగినందున ప్రభుత్వం కోడి పందేలను నిషేధించినా , తరతరాల ఆచారంగా కొనసాగించే ఉన్నాయి.

**గాలిపటాలు:** భోగి రోజున పిల్లలు చాలా ఆనందంగా గాలిపటాలు ఎగురవేస్తారు, వివిధ రకాల గాలిపటాలు తయారు చేసి లేదా కొనుక్కొని ఎగరవేయడంలో పోటీపడతారు.

**కనుమ:** కనుమను పశువుల పండుగగా వ్యవహరిస్తారు. పంటలు చేతికి అందడంలో తమకు సహాయపడిన పశు పక్ష్యాదులను పూజిస్తారు. సంవత్సరంలో మిగిలిన రోజులన్నీ తమతో పాటు కష్టపడి పనిచేసిన ఆవులను, ఎద్దులను, బర్రెలను పూజించి ప్రేమగా చూసుకునే రోజు ఇదే. పక్షులు కూడా రైతన్ననేస్తాలే. అందుకే వాటి కోసమేఅన్నట్టు ఇంటిగుమ్మానికి ధాన్యపు కంకులు వ్రేలాడ దీస్తారు.

**జల్లికట్టు:** తమిళనాడు, చిత్తూరు జిల్లాలలో ఈ రోజున 'జల్లి కట్టు' అని పశువులతో ప్రమాదకరమైన విన్యాసాలు చేయిస్తారు. ఇది అటు పశువులకు ఇటు మనుషులకు ప్రమాదకరం అయినందున ప్రభుత్వం దీన్ని నిషేధించింది. అయినా తమిళులు సుప్రీం కోర్టు దాకా వెళ్లి కొన్ని ఆంక్షలతో అనుమతి పొందారు.



# గుడ్ సమటరిన్‌గా మారదాం.. క్షతగాత్రులను రక్షిద్దాం..



కొన్నిరోజుల క్రితం మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాలో కీసర ప్రాంతంలో ఒక వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురై రెండు కాళ్ళు కోల్పోయి తనను రక్షించమని ఆర్తనాదాలు చేస్తున్నా చుట్టూ ఉన్న వ్యక్తులు స్పం దించకపోగా ఫోటోలు, వీడియోలు తీసుకుని వెళ్ళడం విచారించాల్సిన విషయం. ఇలా రోజు ఏదో ఒక ప్రాం తంలో ఇలాంటి సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఇలాంటి ఆపద సమయంలో మానవత్వంతో స్పందించాల్సింది పోయి పోటోలు తీయడం ఎంతవరకు సమంజసం? మనుషులలో మానవత్వం మంటగ లిసిందా? సరైన సమయంలో క్షతగాత్రులను ఆసుపత్రికి తీసుకువెళితే వారి ప్రాణాలను కాపాడవచ్చుననే ఆలోచన ఎందు కు రావడంలేదు. పైగా ఆ వీడియోలు,ఫోటోలను సోషల్ మీడియాలో పోస్టు చేయడం పరిపాటిగా మారింది.

ఇటీవల కాలంలో దేశం నలుమూలల రోడ్డుప్రమాదాలకు గురై మరణిస్తున్న వారి సంఖ్య పెరుగుతూ ఉండటం మనం గమనిస్తున్నాం. అధికారిక లెక్కల ప్రకారం గడిచిన పదేళ్లలో రోడ్డు ప్రమాదాలను దేశవ్యాప్తంగా 15 లక్షల మందిని పొట్టనబెట్టుకున్నాయి. ఒక్క 2023 లోనే మరణాల సంఖ్య 1.73 వేలు. అమెరికాలో రోడ్డు ప్రమాణ బాధితుల ప్రకటన ప్రతి 2000 మందికి ఒకరు మరణిస్తుంటే ఇండియాలో ఆరుగురిలో ఒకరు చనిపోతున్నారు.ప్రమాదం జరిగిన గంటలోపుగా క్షతగాత్రులను హాస్పిటల్స్ కు చెరవేస్తే వారి ప్రాణాన్ని రక్షించే అవకాశం ఉంటుంది. దీనినే గోల్డెన్ అవర్ అంటారు.కానీ పోలీసు కేసులు,కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తుందనే భయంతో క్షతగాత్రులను కాపాడడానికి ఎవ్వరూ ముందుకు రావడం లేదు. మరికొంతమంది పోలీస్ కేసులు, కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందని భయంతో మిన్నకుండిపోతున్నారు.

భారత ప్రభుత్వ రహదారి రవాణా మంత్రిత్వ శాఖ ద్వారా ప్రవేశపెట్టబడిన పథకం. ఇది రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి సహాయం అందించే వ్యక్తులను ప్రోత్సహించడం లక్ష్యంగా ఉంచుకుంది.ఈ పథకం ముఖ్య లక్ష్యాలు. సహాయం చేసే వ్యక్తులకు గుర్తింపు, ప్రమాద బాధితులకు సహాయం చేయడానికి ముందుకు వచ్చే వ్యక్తిని గూడ్ సమరిటన్‌గా గుర్తిస్తారు. గూడ్ సమరిటన్‌ను ప్రశంసించి ప్రోత్సహిస్తారు. గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తీసుకెళ్లే గూడ్ సమరిటన్‌కు ప్రతి ప్రమాదానికి రూ. 5,000 నగదు పురస్కారంగా అందిస్తారు.ప్రతి ఏడా ది రాష్ట్ర స్థాయిలో గూడ్ సమరిటన్‌లను గుర్తించి అవార్డులు అందజేస్తారు. భయం లేకుండా సహాయం చేయడాన్ని ఈ పథకం ప్రోత్సహిస్తుంది. సహాయం చేసిన వ్యక్తిని పోలీసులు లేదా ఇతర సంస్థలు విచారించవు లేదా వేధించవు.వారికి ఎలాంటి చట్టపరమైన బాధ్యత ఉండదు.రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి తక్షణ సహాయం అందించడం ద్వారా ప్రాణాలను రక్షించడం ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.రోడ్డు భద్రతపై ప్రజలలో అవగాహన పెంచడం ఈ పథకంలో సాధ్యపడుతుంది. ఈ పథకం 2021లో అమల్లోకి వచ్చింది. రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ ద్వారారాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు ఈ పథకాన్ని అమలు చేస్తాయి. గూడ్ సమరిటన్‌గా సహాయం చేయడం పట్ల ఎలాంటి భయం లేదా సందేహం లేకుండా ముందుకు రావచ్చు. ఈ పథకం కింద, సహాయం చేసిన వ్యక్తులకు ప్రభుత్వం నుండి అన్ని విధాలుగా రక్షణ ఉంటుంది.ఈ పథకం ప్రజల సహకారంతో రోడ్డు ప్రమాదాలలో మరణాలను తగ్గించడానికి ఒక గొప్ప అడుగు చెప్పవచ్చును.

కేంద్రం అందించే గూడ సామటరిన్ రివార్డ్ పొందాలంటే ఆఫ్ లైన్ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ముందుగా ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రుల్ని గంటలోపు ఆసుపత్రికి తరలించి ప్రాణాన్ని కాపాడిన ప్రాణదాతలు పోలీసులకు సమాచారాన్ని అందించాల్సి ఉంటుంది. పోలీసులు అధికారిక లెటర్ ప్యాడ పై మిమ్మల్ని ప్రాణదాతగా గుర్తించి మీ వివరాలను నమోదు చేసుకుంటారు. అనంతరం మీకు ఎకనాలెడ్జ్మెంట్ ఇస్తారు. ఈ ఎకనాలెడ్జ్మెంట్ ను జిల్లాస్థాయి అప్రైజల్ కమిటీకి పంపుతారు. అక్కడి నుండి ప్రాణదాతకు ప్రోత్సాహం అందించాలి అంటూ రాష్ట్ర రవాణా కమిషనర్ కు సిఫార్సు చేస్తారు. రవాణా శాఖ సంబంధిత వ్యక్తికి బ్యాంకులో రూ.5 వేలు జమ చేయడంతో పాటు ప్రశంసా పత్రం అందజేస్తుంది. బాధితుల్ని కాపాడిన వ్యక్తులకు వేధింపులు ఇతర ఇబ్బందుల నుండి గూడ్ సమటరిన్ చట్టం రక్షిస్తుంది.

ఇటువంటి పథకాల గురించి ప్రజలలో అవగాహన చాలా తక్కువగా ఉంది. అందువల్ల ప్రభుత్వం ఈ పథకాలపైన ప్రజల్లో అవగాహన పెంపొందించడానికి వివిధ కార్యక్రమాలను రూపొందించారు. కరపత్రాలు, సినిమా హాల్లో ప్రకటనల ద్వారా విస్తృత స్థాయి ప్రచారాన్ని కల్పించాలి. ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా క్షతగాత్రులను హాస్పిటల్ కు చేర్చడం వల్ల వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని చెప్పాలి. పాఠశాల స్థాయి నుండి విద్యార్థులకు రోడ్డు భద్రత విద్య గురించి అవగాహన కల్పించాలి.

–ఏ.వి.సుధాకర్ , 966674347

# ఎప్పటికెయ్యది ప్రస్తుతమో..అప్పటికా మాటలాడు ధన్యజీవి!



ఎం. కోటేశ్వరరావు

ఇంతకీ నరేంద్రమోడీ ఎవరు? లోక్‌సభ ఎన్నికలకు ముందు ఆయన స్వయంగా చెప్పినట్లు మహత్తర లక్ష్యం కోసం దేవుడు పంపిన దూత అనుకోవాలా ? తాజాగా చెప్పినట్లు 'మానవుడినే కానీ దేవుడిని కాదు, తప్పులు చేసి ఉంటా' అనే మాటలు నమ్మాలా ? మోడీ గురించి తెలిసిన వారు ఎప్పటికెయ్యది ప్రస్తుతమో అప్పటికా మాటలాడి తప్పించుకు తిరుగు ధన్యుడు అనుకుంటారు. ఇక తేల్చుకోవాల్సింది భక్తులే ! అప్పుడు దేవుడు పంపాడని ఎందుకు చెప్పారో, ఇప్పుడు మానవుడినే అని ఎందుకు అన్నారో మోడీ ఎలాగూ నోరు విప్పరు గనుక ఆయన ప్రథమ గణాలు వివరించాలి. ఈ కాలంలో మోడీ నెరవేర్చిన లేదా మిగిలిపోయిన మహత్తర లక్ష్యం ఏమిటో ఎవరికైనా తెలుసా ? జెరోధా అనే సంస్థ తరఫున నిఖిల్ కామత్ 2025 జనవరిలో మోడీతో నిర్వహించిన పాడ్‌కాస్ట్ ( ఒక జర్నలిస్టు జరిపే ముఖాముఖీప్రశ్నలు ముందే ఇవ్వాలి, ఇంటర్వ్యూ సమయంలో మోడీని ఇబ్బందికరమైన కొత్త ప్రశ్నలు అడగకూడదు అనే షరతులు వర్తిస్తాయి)లో అనేక అంశాలను వివరించారు. తనకు దేశమే ప్రథమ లక్ష్యం అన్నారు. గుజరాత్ సిఎంగా పని చేస్తున్నపుడే మరో ఇరవై సంవత్సరాల పాటు పనిచేసే బృందాన్ని తాను తయారు చేశానని, ఇప్పుడు కూడా చేస్తున్నట్లు చెప్పారు. అయితే ఆ బృందంలో ఎవరున్నారో వెల్లడించలేదు, వ్యక్తుల పేర్లు చెబితే అనేక మంది ఇతరులకు అన్యాయం చేసినట్లు అవుతుందని చెప్పుకున్నారు. దీన్ని బట్టి ఆ బృందం ఒక బ్రహ్మపదార్థం అనా ల్సి ఉంటుంది. ప్రతివారినీ తన ఖాతాలో వేసుకోవచ్చు. మరికొన్ని సుభాషితాలు, సొంత గొప్పలు ఇలా ఉన్నాయి. 'తప్పులు సహజం కానీ దురుద్దేశ్యాలతో చేయలేదు, నేనూ తప్పులు చేసి ఉంటాను, నేను మనిషిని దేవుడిని కాదు. నేను ఒక విలక్షణమైన రాజకీయవేత్తను కాదు.నేను ఎన్నికల సమయంలో రాజకీయ ప్రసంగాలు చేయాల్సి ఉంటుంది.' అది నాకు తప్పనిసరి, నాకది ఇష్టం లేదు గానీ చేయాల్సి ఉంటుంది. పాడ్‌కాస్ట్ ఇంకా ఇలా సాగింది. మహాత్మా గాంధీ, సావర్కర్ మార్గాలు వేరైనా ఇద్దరూ స్వాతంత్ర్యం కోసమే పోరాడారంటూ ఇద్దరూ ఒకటే అన్నట్లుగా చిత్రించారు. జైలు నుంచి విడుదల చేస్తే బ్రిటీష్ వారికి సేవ చేసుకుంటానని, స్వాతంత్ర్య ఉద్యమానికి దూరంగా ఉంటానంటూ లేఖలు రాసిన సావర్కర్‌ను గాంధీతో పోల్చటం చరిత్ర వక్రీకరణ తప్ప మరొకటి కాదు.

ఎనిమిది నెలల క్రితం తన జన్మ జీవ సంబంధమైనది కాదని (2024 లోక్‌సభ ఎన్నికల చివరి దశ) లో నరేంద్ర మోడీ చెప్పుకున్నారు, ఇప్పుడు మానవుడిని అని చెప్పుకోవటం నష్ట నివారణ చర్య అని స్పష్టంగా కనిపిస్తోందని కాంగ్రెస్ నేత జయరామ్ రమేష్ వ్యాఖ్యానించారు. భూమ్మీద తన ఉనికి కేవలం జీవ సంబంధమైనది కాదని, తన తల్లి మరణించిన తరువాత తనను దేవుడు భూలోకంలోకి ఒక లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు పంపాడని అవగతమైందని తన కున్న శక్తులను చూసిన తరువాత తానీ మాటలు చెప్పగలుగుతున్నట్లు మోడీ చెప్పిన సంగతి తెలిసిందే. '' నా తల్లి బతికి ఉన్నంత వరకు నేను కూడా జీవసంబంధంగానే జన్మించానని అనుకున్నాను. కానీ తరువాత అనుభవాలను చూస్తే పరమాత్ముడు ఒక లక్ష్యం కోసం పంపాడని నేను నమ్మాను, ఆ లక్ష్యం నెరవేరిన తరువాత మరోసారి నాతో పని ఉండదు. అందువల్లనే నేను పూర్తిగా దేవుడి కోసం అంకితమయ్యాను, నేను ఒక సాధనాన్ని తప్ప మరొకటి కాదు '' అంటూ అదానీ యాజమాన్యంలోని ఎన్‌డిటివితో మోడీ చెప్పారు.( ఆ లక్ష్యం ఏమిటో, ఎంత వరకు వచ్చింది, పూర్తి చేసిందీ లేనిదీ చెప్పలేదు) ఒక సామాన్యుడు ఇలాంటి మాటలు మాట్లాడితే అలాంటి వారిని నేరుగా మానసిక వైద్యుడి వద్దకు తీసుకు వెళతారు అంటూ అప్పుడు రాహుల్ గాంధీ అపహాస్యం చేశారు. ఎవరెన్ని విమర్శలు చేసినా మోడీ మారు మాట్లాడలేదు. అంతకు కొద్ది రోజుల ముందు తననెవరూ దెబ్బతీయలేరని, తాను మూడు, ఐదు చివరికి ఏడు ఎన్నికలైనా సరే గెలుస్తూనే ఉంటానని చెప్పుకున్నారు.తనకు ఓటు వేయటం అంటే పుణ్యం చేసుకోవటమే అని కూడా చెప్పారు. మోడీ చుట్టూ ఉన్నవారు కూడా ఆయనను ఆకాశానికి ఎత్తిన తీరు చూశాము. ఎంతగా అంటే



పూరీ జగన్నాధుడు కూడా నరేంద్రమోడీ భక్తుడేనని ఒడిషాకు చెందిన బిజెపి నేత సంబిత్ పాత్ర వర్ణించి తరువాత నోరు జారినట్లు చెప్పుకున్న సంగతి తెలిసిందే.

చరిత్రలో అవతార పురుషులమని ప్రదర్శించుకున్నవారందరూ ఇలాగే ఒక లక్ష్యం కోసం ఉద్భవించినట్లు చెప్పుకున్నవారే. దైవదూతను అన్న నోటితోనే అదానీ, అంబానీలు రాహుల్ గాంధీకి టెంపోల నిండుగా నోట్ల కట్టలు పంపారని తుచ్ఛ మానవుల మాదిరి మోడీ ఎన్నికల సమయంలో ఆరోపణ చేసిన సంగతిని గుర్తుకు తెచ్చుకోవాలి. అంటే ఆ పారిశ్రామిక, వాణిజ్యవేత్తల వద్ద లెక్కల్లో చూపని నల్లధనం పెద్ద ఎత్తున ఉందని చెప్పటమే. బహుశా ఆ వ్యాఖ్యల తరువాత తన స్నేహితుల గురించి మాట్లాడింది తప్పని తెలిసిందో లేక వారి నుంచి హెచ్చరికలు వచ్చాయో తెలియదు గానీ తరువాత మరోసారి ప్రస్తావించలేదు. అంతే కాదు ప్రతిపక్షపార్టీల నేతలందరూ ముజ్రా పనులు చేస్తున్నారంటూ దిగువ స్థాయి విమర్శలు కూడా చేశారు.(ఉత్తరాది దిన వేశ్యలతో కులీనులు చేసే గానాబజానాలను ముజ్రా అంటారు). తనకు ఇల్లూ, సంసార బంధాలు లేవు, దేశం కోసమే పుట్టినట్లు నరేంద్రమోడీ చెప్పుకుంటారు, భక్తులు కూడా అదే చెబుతారు. గుజరాత్ రాజధాని గాంధీ నగర్‌లో ధనికులు నివసించే ప్రాంతంలో తనకు ఒక ఇంటి స్థలం ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్లలో పేర్కొన్న అంశాన్ని కారవాన్ పత్రిక వెల్లడించింది. ముఖ్యమంత్రిగా ఉండగా తన పేరున తానే మంజూరు చేసుకున్న స్థలమది. దాని మీద వివాదం చెలరేగటం, కోర్టులకు ఎక్కటంతో సదరు స్థలాన్ని పార్టీకి ఇస్తానని మోడీ చెప్పారు. ఏ బంధాలు లేని తాను స్థలం తీసుకోవటం ఎందుకు, తిరిగి ప్రభుత్వానికి స్వాధీనం చేయకుండా పార్టీకి ఇస్తానని చెప్పటం ఏమిటి ? ఈ స్థలం ఉన్న అంశం గురించి మసిబూసి మారేడు కాయ చేసే ప్రయత్నం జరిగిందనే ఆరోపణ ఉంది.

నరేంద్రమోడీ గురించి ఉన్నతంగా చిత్రించేందుకు ప్రశాంత కిషోర్ వంటి నిపుణులెందరో పని చేశారన్నది బహిరంగ రహస్యం. దానికి గోడీ మీడియా ఎంతగానో సహకరించిందని అనేక మంది విమర్శలు చేసింది కూడా వాస్తవమే.2019లో ఎన్నికలకు ముందు ప్రధాని నరేంద్ర మోడీ పేరుతో ఒక ప్రచార సినిమా కూడా తీశారు. వాస్తవాల ఆధారంగా తీసినట్లు చెప్పిన ఆ సినిమాలో వక్రీకరణలు, అవాస్తవాలెన్నో. అన్నింటినీ త్యజించి దేశం కోసమే మోడీ పాటుపడుతున్నట్లు చిత్రించారు.ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్‌గా పనిచేసిన నరేంద్రమోడీ బాల్యంలో ఒక చేత్తో టీ అమ్ముతూ మరో చేత్తో జాతీయ జండాను పట్టుకున్నట్లు, దానికి వందనం చేసినట్లు చూపారు. వాస్తవం ఏమంటే అదే ఆర్‌ఎస్‌ఎస్ స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 52 సంవత్సరాల పాటు జాతీయ జండాను ఎగురవేయటానికి నిరాకరించింది, బాల్యంలోనే జాతీయ భావాలతో పెరిగినట్లు సినిమాలో చూపిన మోడీ కూడా ఆర్‌ఎస్‌ఎస్‌లో భాగస్వామే.శ్రీనగర్ లాల్ చౌక్‌లో ఆర్మీ పహారాలో బిజెపి నేత మురళీ మనోహర జోషి జాతీయపతాకాన్ని ఎగురవేశారు. కానీ ఈ చిత్రంలో నరేంద్రమోడీ ఆ పని చేశారని చిత్రించటం కళ్ల ముందే చరిత్రను వక్రీకరించటం తప్ప మరొకటి కాదు. దేశ చరిత్రలో ఏ ప్రధానీ చేయని విధంగా గుళ్లు గోపురాలు తిరిగి, ధ్యానం పేరుతో ఫొటో ప్రదర్శనలు, అయోధ్యలో రామాలయ ప్రారంభం సందర్భంగా అన్నీ తానై చేసిన హడావుడి, బాలరాముడి చిత్రంతో నరేంద్ర మోడీ బొమ్మ పెట్టి వేసిన పోస్టర్లు, ఫ్లెక్సీ లు, వాటన్నింటికీ పరాకాష్టగా అసలు తనది జీవసంబంధ జన్మ కాదని చెప్పుకొనేంత వరకు వెళ్లింది. ఇప్పుడు తాను మానవుడనే అని, తప్పులు చేయటం సహజం అని చెప్పుకోవటం కూడా తన గురించి తాను గొప్పగా చెప్పుకోవటంలో భాగమే అన్నది స్పష్టం.మాట మార్చి తాను మానవమాత్రుడనని ఎందుకు చెప్పుకోవాల్సి వచ్చింది ? అయోధ్యలో బిజెపి ఓడిపోవటం, వారణాసిలో తన మెజారిటీ భారీగా పడిపోవటం, లోక్‌సభలో ఒక పార్టీగా బిజెపికి సంపూర్ణ మెజారిటీని తీసుకురావటంలో వైఫల్యం, గతంకంటే ఓట్లు కూడా తగ్గటం, దేశంలో ఆర్థిక పరిస్థితి దిగజారుడు, ఎటు చూసినా వైఫల్యాలే కనిపిస్తుండగా తాను దైవాంశ సంభూతుడనని, తన శక్తి గురించి చెప్పుకొనే అవకాశాలు ఆవిరయ్యాయి. వీటి గురించి ఎవరు ఎక్కడ ప్రశ్నిస్తారో అని గ్రహించి తాను కూడా మానవ మాత్రుడనేనని, వైఫల్యాలు సహజమేనని చెప్పుకొనేందుకు చూసినట్లు కనిపిస్తోంది.



## ఐఐటి–ఖరగ్‌పూర్ విద్యార్థి ఆత్మహత్య

**కోల్‌కతా :** కోల్‌కతాలోని ఐఐటి–ఖరగ్‌పూర్ విద్యార్థి ఆత్మహత్యకు చేసుకున్నాడు. మూడవ సంవత్సరం ఎలక్ట్రికల్ ఇంజినీర్ చదువుతున్న షోన్ మాలిక్ తన గదిలో వేలాడుతూ కనిపించినట్లు ఇన్‌స్టిట్యూట్ అధికారులు చెప్పారు. ఆదివారం మాలిక్ తల్లిదండ్రులు అతన్ని కలిసేందుకు హాస్టల్‌కు వెళ్లారు. వారు ఎంత పిలిచినప్పటికీ మాలిక్ స్పందించలేదు. దీంతో ఇన్‌స్టిట్యూట్ సిబ్బంది, మాలిక్ తల్లిదండ్రులు హాస్టల్ గది తలుపులను బలవంతంగా తెరిచినట్లు అధికారులు వెల్లడించారు. అంతకు ముందు రాత్రి మాలిక్ తన తల్లిదండ్రులకు ఫోన్ చేసి పరిస్థితులు సాధారణంగానే ఉన్నాయని చెప్పినట్లు అధికారులు తెలిపారు. మాలిక్ మరణంపై సంస్థ అంతర్గతంగా దర్యాప్తు చేస్తుందని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా నిరోధక చర్యలు తీసుకుంటుందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం పూర్తయిందని, ఆ సమయంలో వీడియోగ్రఫీ చేయించామన్నారు. విచారణ కొనసాగుతుందన్నారు. మాలిక్ ఆత్మహత్య ఘటన తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని, విద్యార్థులు, ఇన్‌స్టిట్యూట్ సిబ్బంది, ఫ్యాకల్టీ ప్రగాఢ సంతాపం తెలియజేసినట్లు ఐఐటి ఖరగ్‌పూర్ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈనెల 12వ తేదీన ఉదయం ఆజాద్ హాల్ నివాసంలో మాలిక్ ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపింది. ఘటన అనంతరం క్యాంపస్‌లో భద్రత, వైద్య బృందాలు అప్రమత్తమయ్యాయి. మాలిక్ మృరణం కారణమైన పరిస్థితులపై పోలీసులు క్షుణ్ణంగా దర్యాప్తు జరుపుతున్నారు. యావత్ ఇన్‌స్టిట్యూట్ అధికారులు పూర్తిగా సహకరిస్తుందని ఆ ప్రకటనలో వెల్లడించింది. మాలిక్ విద్యాపరంగా ప్రతిభావంతుడైన విద్యార్థి అని, అతని తెలివితేటలు, అంకితభావం అందరికీ తెలిసిందేనని పేర్కొంది.

## మరో చిన్నారికి హెచ్‌ఎంపివి పాజిటివ్..



భారత్‌లో 18కి చేరిన కేసులు

**న్యూఢిల్లీ :** భారత్‌లో హ్యూమన్ మెటాప్‌న్యూమో వైరస్ (హెచ్‌ఎంపివి) కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. తాజాగా మరో చిన్నారి ఈ వైరస్ బారిన పడింది. పుదుచ్చేరికి చెందిన చిన్నారికి హెచ్‌ఎంపివి వైరస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. ఆరోగ్య శాఖ అధికారి రవిచంద్రన్ తెలిపిన వివరాల ప్రకారం.. సదరు చిన్నారి జ్వరం, దగ్గు, జలుబుతో ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో చేరినట్లు తెలిపారు. ప్రస్తుతం చిన్నారి వైద్య చికిత్సకు సహకరిస్తోందని చెప్పారు. కాగా, తాజా కేసుతో పుదుచ్చేరిలో హెచ్‌ఎంపివి కేసులు రెండుకు చేరాయి. గతవారం మూడేండ్ల చిన్నారి ఈ వైరస్ బారిన పడిన విషయం తెలిసిందే. చికిత్స తర్వాత పూర్తిగా కోలుకొని డిశ్చార్జ్ అయ్యింది. తాజా కేసుతో కలిపి భారత్‌లో హెచ్‌ఎంపివి కేసులు 18కి చేరాయి.

## కాగ్ నివేదికపై అసెంబ్లీలో చర్చకు జాప్యం..

‘ఆప్’సర్కారుపై హైకోర్టు అసహనం

**న్యూఢిల్లీ :** మద్యం విధానంపై ‘కాగ్’ నివేదిక వ్యవహారంలో సక్రమంగా వ్యవహరించలేదంటూ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రభుత్వంపై ఢిల్లీ హైకోర్టు అసహనం వ్యక్తం చేసిది. అసెంబ్లీలో కాగ్ నివేదికపై చర్చించకుండా కావాలనే జాప్యం చేస్తున్నారని పేర్కొంది. ఇది పలు అనుమానాల తావిస్తోందని జస్టిస్ సచిన్ దత్తా సారథ్యంలోని ఏకసభ ధర్మాసనం వ్యాఖ్యానించింది. మద్యం విధానంపై కాగ్ నివేదికను అసెంబ్లీకి సమర్పించేలా ప్రత్యేక సమావేశానికి ఆదేశించాలంటూ బిజెపికి చెందిన ఏడుగురు ఎమ్మెల్యేలు హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై కోర్టు విచారణ జరిపింది. ‘నివేదిక విషయంలో మీ తీరు పలు అనుమానాలకు తావిస్తోంది. మీరు నివేదికను స్పీకర్‌కు పంపి, అసెంబ్లీలో చర్చించి ఉండాల్సింది. టైమ్‌లైన్‌ను బట్టి చూస్తే ప్రత్యేక సెషన్ జరపకుండా మీరు జాప్యం చేస్తున్నారనే విషయం అవగతమవుతోంది’ అని కోర్టు పేర్కొంది. దీనిపై.. ఎలక్షన్లు ముంచుకొస్తున్నందున ఎలా సెషన్ నిర్వహించాలని ఢిల్లీ ప్రభుత్వం తమ వాదనను కోర్టుకు వినిపించింది. కాగా, ఫిబ్రవరిలో అసెంబ్లీ గడువు ముగుస్తున్నందున సిటీ అడ్మినిస్ట్రేషన్‌పై కాగ్ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని ఢిల్లీ అసెంబ్లీ సెక్రటేరియట్ గత విచారణలో కోర్టుకు తెలిపింది. ప్రత్యేక అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేసి 14 కాగ్ నివేదికలను సభ ముందుంచాలని బిజెపి ఎమ్మెల్యేల పిటిషన్‌పై ఢిల్లీ ప్రభుత్వం, స్పీకర్, ఇందులో ప్రమేయం ఉన్న వారు స్పందించాలని కోర్టు ఆదేశించింది. దీనిపై ఢిల్లీ ప్రభుత్వం వివరణ ఇస్తూ, 14 నివేదకలను స్పీకర్‌ను పంపినట్టు తెలిపింది. బిజెపి ఎమ్మెల్యేల తరఫు న్యాయవాది విజేంద్ర గుప్తా మాట్లాడుతూ, స్పీకర్‌ను ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాల్సిందిగా కోర్టు ఆదేశించాలని కోరారు. ఇందుకు కోర్టు నిరాకరిస్తూ, ఇరువైపులు వాదనలు విన్న తర్వాతే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని, తక్షణ ఆదేశాలు ఇవ్వలేమని స్పష్టం చేసింది.

# ఇక.. కేంద్రంపై ‘ఉక్కుపిడికిలి’

పాటియాలా సమావేశంలో రైతు సంఘాల ‘ఐక్యపోరాటానికి’ తీర్మానం

హాజరైన ఎస్‌కెఎం, ఎస్‌కెఎం (నాన్ పొలిటికల్), కెఎంఎం రైతు సంఘాల ముఖ్యనేతలు

జనవరి 18న మరోమారు సమావేశం నిర్వహించడానికి ఆమోదం

రైతుసంఘాలన్నీ సంఘటిత పోరాటం చేయాలని ప్రజలు కోరుకుంటున్నారని విలేకరులకు వెల్లడి



**ఛండీగఢ్ :** కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి తమ డిమాండ్లను పరిష్కరించుకునేందుకు దీర్ఘకాలిక పోరాటం కొనసాగిస్తున్న రైతు సంఘాలు ఏకతాటిపైకి వచ్చాయి. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) నాయకులు తమ డిమాండ్లను ఆమోదించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేసేందుకు ఉమ్మడి ఆందోళన నిర్వహించాలని భావించారు. ఈ నేపథ్యంలో రైతు నాయకులు సోమవారం పంజాబ్‌హర్యానా రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో నిరసనకు నాయకత్వం వహిస్తున్న రెండు రైతు సంఘాలతో సమావేశమయ్యారు.పోరాటంలో విజయం సాధించడానికి ప్రజల మద్దతు కీలకం అని చెప్పారు. రైతు సంఘాల మధ్య ఐక్యతను చాటుతూ, పంటకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కు న్యాయపరమైన హామీతో పాటు తమ డిమాండ్ల కోసం ఐక్యపోరాటానికి ఒక బ్లూప్రింట్ రూపొందించాలని, అందుకు జనవరి 18న మరోమారు సమావేశం నిర్వహించాలని మూడు రైతు సంఘాలైన సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం), సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎంనాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా (కెఎంఎం) నేతలు నిర్ణయించారు. ఇప్పుడు రద్దు చేయబడిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా 2020 సంవత్సరంలో ఆందోళనకు నాయకత్వం వహించిన ఎస్‌కెఎం, శంభుఖనౌరీ సరిహద్దులో కొనసాగుతున్న పోరాటాలలో భాగం కాకుండా ఎస్‌కెఎం(నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా గతేడాది ఫిబ్రవరి 13న రైతులు ప్రదర్శనను ఢిల్లీకి నిర్వహిస్తుండగా అడ్డుకున్న భద్రతా బలగాలు వారి శంభుఖనౌరీ సరిహద్దు పాయింట్ వద్ద ప్రదర్శనను నిలిపివేశాయి. అయితే తొలుత రైతుసంఘాల సమావేశం జనవరి 15న నిర్వహించాలని నిర్ణయించినప్పటికీ రైతు నాయకుడు జగ్‌జీత్ సింగ్ డల్లేవాల్ ఆరోగ్యం పూర్తిగా క్షీణిస్తుండటంతో జనవరి 13కు రైతు సంఘాల ఐక్య సమావేశం తేదీని మార్చాయి. ఈ నేపథ్యంలో సోమవారం నాడు (జనవరి 13) పాటియాలాలోని పట్రాన్ వద్ద రెండు గంటలపాటు నిర్వహించిన సుదీర్ఘ సమావేశంలో సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు జోగిందర్ సింగ్ ఉగ్రహాన్, బల్బీర్‌సింగ్ రాజేవల్, దర్శన్ పాల్, రామిందర్ పాటియాలా, యుద్ధ్‌వీర్ సింగ్ పాల్గొన్నారు. ఎస్‌కెఎం (నాన్ పొలిటికల్), కెఎంఎం తరపు న సర్వాన్ సింగ్ పంధేర్, కాకాసింగ్ కోట్రా, అభిమన్యు కొహర్, సూర్జిత్‌సింగ్ ఫుల్, సుఖ్‌జిత్ సింగ్ హర్దోజాండే , గురీందర్‌సింగ్ భాంగు హాజరయ్యారు. సమావేశం అనంతరం విలేకరులను ఉద్దేశించి మూడు రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ సమావేశం సుహృద్భావ వాతావరణంలో జరిగిందని కిసాన్ మజ్దూర్ మోర్చా నాయకుడు పంధేర్ చెప్పారు. మేం మరోసారి జనవరి 18న సమావేశం అవుతాం. రైతుల డిమాండ్ల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న పోరాటంలో విజయం సాధించడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలి, డిమాండ్లను ప్రభుత్వంచే ఎలా ఆమోదింపజేయాలి తదితర అంశాలపై చర్చించనున్నామన్నారు. రైతు సంఘాలన్నీ ఐక్యంగా పోరాడాలని ప్రజలు కోరుతున్నారన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా నాయకుడు ఉగ్రహాన్ మాట్లాడుతూ ఎస్‌కెఎం, ఎస్‌కెఎం(నాన్ పొలిటికల్), కెఎంఎం నాయకులు ఒకరిపై మరొకరు వ్యతిరేక ప్రకటనలు ఇవ్వరాదని సమావేశం నిర్ణయించిందని తెలియజేశారు. మా శత్రువు ఎవరన్నది మాకు తెలుసు అని, సమస్యలు కామన్‌వి అయినప్పుడు మేమందరం కలిసికట్టుగా ఉమ్మడి యుద్ధంలో పోరాడాలి’ అని నిర్ణయానికి వచ్చాం.సమావేశం సానుకూల వాతావరణంలోజరిగిందని, రైతుసంఘాలన్నీ ఐక్య పోరాటం చేయాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. ఒంటరిగా పోరాటం చేస్తే విజయం సాధించలేమని తాము భావిస్తున్నామన్నారు. ఎప్పుడైతే మేం కలిసికట్టుగా ఉంటామో అప్పుడు మాత్రమే ప్రజల మద్దతు పొందుతామని తెలిపారు. ప్రజల సహకారం లేనిదే పోరాటం విజయం సాధించలేదని ఉగ్రహాన్ చెప్పారు. 2020 రైతుల ఆందోళన ప్రజల మద్దతుతో గెలిచిందని ఆయన నొక్కి చెప్పారు. కేంద్రంపై ఉమ్మడి పోరాటానికి రైతు సంఘాల ఐక్యతను పెంపొందించేందుకు ఎస్‌కెఎం, ఎస్‌కెఎం (నాన్ పొలిటికల్), కెఎంఎం నాయకులను సమావేశానికి ఆహ్వానించిన తర్వాత ఈ సమావేశం జరిగింది. సంయుక్త కిసాన్ మోర్చా (నాన్ పొలిటికల్) కన్వీనర్ అయిన జగ్‌జీత్‌సింగ్ డల్లేవాల్ నవంబరు 26నుండి ఖనౌరీ సరిహద్దు పాయింట్‌లో నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నారు. ఆయన దీర్ఘకాలికంగా నిరాహారదీక్ష కొనసాగిస్తున్నప్పటికీ వైద్యసహాయం పొందడానికి నిరాకరించారు. ఈ నేపథ్యంలో ఇటీవల డల్లేవాల్ ఆరోగ్యం పూర్తిగా క్షీణించడం పట్ల దేశవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతోంది. గత ఏడాది ఫిబ్రవరిలో ఎస్‌కెఎం, ఎస్‌కెఎం(నాన్ పొలిటికల్), కెఎంఎం మధ్య ఐక్యత కోసం చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. రైతు సంఘాల నేతలు తమ మధ్య ఐక్యత కోసం తొలుత డిసెంబరులో చర్చలు జరగడంతో డల్లేవాల్ నిరవధిక నిరాహారదీక్షకు కూర్చునేందుకు మార్గం సుగమమైంది. అదేసమయంలో ఎస్‌కెఎం (నాన్‌పొలిటికల్), కెఎంఎం, ఎస్‌కెఎం సభ్యులు వ్యవసాయ మార్కెటింగ్‌పై కేంద్రం రూపొందించిన ముసాయిదా పాలసీ ప్రతులను తగులబెట్టడంతో వారిమధ్య ఐక్యతకు దారి తీసింది.

## సరిహద్దు ఉద్రిక్తతలపై బంగ్లా రాయబారికి భారత్ సమన్లు



**న్యూఢిల్లీ :** ఢాకా న్యూఢిల్లీ మధ్య సరిహద్దు ఉద్రిక్తతలు పెరుగుతుండటంపై చర్చించేందుకు బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషనర్ నూరల్ ఇస్లాంకు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ సోమవారం నాడు సమన్లు పంపింది. దీంతో నూరల్ ఇస్లాం సౌత్ బ్లాక్ కార్యాలయానికి వెళ్లారు. సరిహద్దు ఉద్రిక్తతలపై బంగ్లాదేశ్‌లోని భారత హైకమిషనర్ ప్రణయ్ వర్మకు ఆ దేశ విదేశాంగ మంత్రిత్వ శాఖ అదివారం నాడు సమన్లు పంపిన నేపథ్యంలో తాజా పరిణామం చోటు చేసుకుంది. ప్రణయ్ వర్మ ఆదివారంనాడు సమన్లు అందుకోగానే బంగ్లా విదేశాంగ శాఖ కార్యాలయానికి వెళ్లి విదేశాంగ శాఖ కార్యదర్శి జషిమ్ ఉద్దీన్‌తో 45 నిమిషలు మాట్లాడారు. ద్వైపాక్షిక ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ, ఇండో బంగ్లా సరిహద్దులు వెంబడి 5 చోట్ల ఫెన్సింగ్ నిర్మాణానికి భారత్ ప్రయత్నిస్తోందని ఢాకా ఆరోపిస్తోంది. కాగా, దీనిపై ప్రణయ్ వర్మ మీడియాకు వివరణ ఇస్తూ, భద్రతా పరంగా సరిహద్దుల వెంబడి కంచె విషయంలో ఢాకా–న్యూఢిల్లీ మధ్య అవగాహన ఉందన్నారు. దీనిపై ఇరుదేశాల సరిహద్దు కాపలా సంస్థ బిఎస్‌ఎఫ్, బిజెపి (బోర్డర్ గార్డ్ బంగ్లాదేశ్) ఎప్పటికప్పుడు మాట్లాడుకుంటున్నాయని చెప్పారు. ఇందుకు సంబంధించిన అవగాహనల అమలు, సరిహద్దుల వెంబడి నేరాలపై పోరాటానికి పరస్పర సహకార విధానం పాటిస్తారని తాము ఆశిస్తున్నట్టు తెలిపారు.

## బంగ్లాదేశీయులు, రోహింగ్యాలతో స్థిరపడ్డ బిజెపి

సరిహద్దు భద్రత కేంద్ర ప్రభుత్వానిదే : ఆప్

**న్యూఢిల్లీ :** అక్రమ బంగ్లాదేశీ వలసదారుల ముఠాతో సంబంధాలున్నాయని వచ్చిన అభియోగాలపై ఆప్ ఎమ్మెల్యే మహిందర్ గోయల్‌కు నోటీసులు వచ్చాయి. ఈ నేపథ్యంలో రాజ్యసభ ఎంపి సంజయ్ సింగ్ స్పందించారు. దేశ వ్యాప్తంగా బంగ్లాదేశీయులు, రోహింగ్యాలతో బిజెపి స్థిరపడిందని వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితికి కేంద్ర హోంమత్రి అమిత్ షా బాధ్యత వహించాలని, అయితే సరిహద్దు భద్రత బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని ఆప్ సీనియర్ నేత పేర్కొన్నారు. గత పదిన్నర సంవత్సరాలుగా బిజెపికి చెందిన ప్రధాని, హోంమంత్రి, విదేశాంగమంత్రి దేశంలో బంగ్లాదేశీయులు, రోహింగ్యాలతో స్థిరపడ్డారన్నారు. కేవలం ఎన్నికల లబ్ధి కోసం వారు దేశాన్ని మోసం చేశారని సింగ్ విలేకరుల సమావేశంలో ఆరోపించారు. గత పదేళ్ళలో ఎంతమంది బంగ్లాదేశీయులు, రోహింగ్యాలు సరిహద్దు దాటి భారత్‌లోకి ప్రవేశించారని, వారిలో ఎంతమందిని తరలించారని సింగ్ ప్రశ్నించారు. పశ్చిమ బెంగాల్, అసోం, త్రిపుర వెంబడి ఉన్న సరిహద్దును వలసదారులు ఎలా దాటారని, బీహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ గుండా దేశంలోకి చొరబడి ఢిల్లీకి ఎలా చేరుకున్నారని నిలదీశారు. బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ఆచూకీని ప్రధాని ఎందుకు అడగడం లేదన్నారు. హసీనా బంగ్లాదేశీయులు, రోహింగ్యాలకు నాయకురాలుగా సింగ్ పేర్కొన్నారు. ఆమెను ఎక్కడ దాచారని ప్రశ్నించారు. బంగ్లాదేశ్‌లో ప్రభుత్వ వ్యతిరేక నిరసనల నేపథ్యంలో అధికారం కోల్పోయిన హసీన ఆ దేశం నుంచి భారత్‌కు పారిపోయిన వచ్చిన విషయం తెలిసిందే. కాగా, ఢిల్లీలోని అక్రమ బంగ్లాదేశీ వలసదారులకు ఆధార్, ఓటర్ ఐడికార్డులు సమకూర్చే ముఠాతో గోయల్‌కు సంబంధాలు ఉన్నాయని వచ్చిన ఆరోపణలపై ఆప్ సుప్రీం అరవింద్ కేజ్రీవాల్ ఎందుకు మౌనంగా ఉన్నారని బిజెపి ప్రశ్నించింది. బిజెపి నేత స్మృతి ఇరానీ మాట్లాడుతూ ఇద్దరు ఆప్ ఎమ్మెల్యేలకు చెందిన సంతకాలు, ముద్రలు దర్యాప్తు సంస్థ బయటపెట్టిందన్నారు.

## ఎల్‌ఎసి వద్ద పరిస్థితి సున్నితంగా ఉన్నా ...

# స్థిరంగా ఉంది

**న్యూఢిల్లీ :** చైనాతో సరిహద్దులు పంచుకున్న వాస్తవాధీ రేఖ (ఎల్‌ఎసి) వద్ద పరిస్థితి సున్నితంగా ఉన్నా స్థిరంగా ఉందని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది తెలిపారు. ఇరువైపులా పలు విడతలు చర్చలు సైతం జరిగినట్టు చెప్పారు. తూర్పు లడాఖ్‌లో డెప్సాంగ్, డెమ్‌చోక్ ప్రాంతాల్లో పెట్రోలింగ్ మొదలైందని అన్నారు. న్యూఢిల్లీ సోమవారం జరిగిన వార్షిక ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ, ఏప్రిల్ 20 నుంచి ఇరువైపు బలగాలు డెస్పాంగ్, డెమ్‌చోక్ ప్రాంతాల్లో పెట్రోలింగ్ జరుపుతున్నాయని, ఒకరి ప్రాంతాల వైపు మరొకరు వెళ్లడం ఆగిందని చెప్పారు. పెట్రోలింగ్ వెరిఫికేషన్‌కు సంబంధించి ఇరువైపుల అధికారుల మధ్య రెండు రౌండ్ల చర్చలు కూడా పూర్తయ్యాయని, ఉభయ వర్గాలు సంతృప్తి వ్యక్తం చేశాయని చెప్పారు. గ్రేజింగ్ గ్రౌండ్‌కు సంబంధించి పరస్పరం అంగీకారం ఉందని, బఫర్ జోన్ అనేదేమీ లేదని చెప్పారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకున్న సమయంలో చర్చల ప్రకారం కొన్ని ప్రాంతాలను ‘టెంపరరీ మారటోరియం’గా ప్రకటించారని అన్నారు. ఉమ్మడి ప్రాంతాలకు దూరంగా సంయమనం పాటించడం వల్ల ఘర్షణల స్థాయి పెరక్కుండా ఉండేందుకు వీలుంటుందని చెప్పారు. ప్రశాంత పరిస్థితిని నెలకొనేందుకు, పరస్పర విశ్వాసాన్ని పాదుకొల్పేందుకు ఇరుదేశాల మధ్య విస్తృత అవగాహన అవసరమని అన్నారు. ఏప్రిల్ 20 తర్వాత పరస్పర విశ్వాసానికి ఇరుదేశాలు కొత్త నిర్వచనం ఇచ్చాయని తెలిపారు. కలిసి కూర్చుని చర్చించుకోవడం ద్వారా పరస్పర విశాంత మరింత పెరుగుతుందన్నారు. తదుపరి జరిగే ప్రత్యేక ప్రతినిధుల సమావేశం కోసం తాము ఎదురుచూస్తున్నట్టు చెప్పారు.



**జమ్ముకశ్మీర్‌లో..**

జమ్ము కశ్మీర్‌లో పరిస్థితి పూర్తిగా నియంత్రణలో ఉందని ద్వివేది తెలిపారు. గత ఏడాది జమ్ముకశ్మీర్‌లో భారత బలగాలు మట్టుబెట్టిన ఉగ్రవాదుల్లో 60 శాతం మంది పాక్ నుంచే వచ్చారని చెప్పారు. ఇదే సమయంలో జమ్ముకశ్మీర్‌లో చురుకుగా ఉన్న ఉగ్రవాదుల్లో 80 శాతం మంది పాక్ నుంచే వచ్చారని తెలిపారు. 2024లో 15,000 మంది అదనపు బలగాలను మోహరించి ఉగ్రవాదులను మట్టుబెట్టినట్టు చెప్పారు.

**బంగ్లాదేశ్ పరిస్థితిపై...**

బంగ్లాదేశ్‌తో పరిస్థితిపై ద్వివేది మాట్లాడుతూ, భారత దేశం వ్యూహాత్మకంగా తమకు కీలకమని బంగ్లాదేశ్ చీఫ్ ఇటీవల మాట్లాడరని, భారత్ విషయం కూడా అంతేనని ద్వివేది చెప్పారు. ఇరుగుపొరుగు దేశాలైనందున కలిసి బతకాలని, ఒకరినొకరు అర్థం చేసుకోవాలని, శత్రుత్వం ఎవరికీ మంచిది కాదని అన్నారు. ప్రస్తుతానికైతే ఎటువైపు నుంచి ఇబ్బందులు లేవని, బంగ్లాదేశ్ చీఫ్‌తో సంప్రదింపులు జరుపుతూనే ఉన్నామని చెప్పారు. నవంబర్‌లో కూడా వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశామని, ఎన్‌డిసి కోసం మన ఆఫీసర్లు కూడా అక్కడకు వెళ్లారని చెప్పారు. సంయుక్త విన్యాసాల విషయం మాత్రం ప్రస్తుతానికి వాయిదా వేశామన్నారు. ఇప్పటికైతే ఇరుదేశాల మిలటరీ సంబంధాలు సజావుగా ఉన్నట్టు వెల్లడించారు.

## ‘ఎమర్జెన్సీ’లో జైళ్లకు వెళ్లిన వారికి నెలకు రూ.20 వేలు పెన్షన్

**భువనేశ్వర్:** ఎమర్జెన్సీ సమయంలో జైళ్లకు వెళ్లిన వారికి నెలకు రూ.20 వేలు పెన్షన్ అందజేస్తామని ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాంఝీ వెల్లడించారు. వారికి ఉచిత వైద్య సదుపాయాన్ని సైతం కల్పిస్తామని చెప్పారు. 2025, జనవరి 01వ తేదీ నుంచి వారికి ఈ సదుపాయాలు అందిస్తామని ఆయన వెల్లడించారు. ఈ మేరకు ఒడిశా హోం మంత్రిత్వ శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎమర్జెన్సీ సమయంలో మెయింటెన్స్ ఆఫ్ ఇంటర్నెల్ సెక్యూరిటీ, డిఫెన్స్ ఆఫ్ ఇండియాన్ రూల్, లేదా ఇంటర్నెల్ సెక్యూరిటీ ఆఫ్ ఇండియా రూల్స్ కింద అరెస్ట్ అయిన వారికి ఈ సదుపాయాలు అందజేయనున్నట్లు ఈ ఏడాది జనవరి 2వ తేదీన సిఎం మోహన్ చరణ్ మాంజీ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఎమర్జెన్సీ సమయంలో జైళ్లకు వెళ్లి.. నేటికి బ్రతికి ఉన్న వారికి పెన్షన్‌తో పాటు ఈ వైద్య సదుపాయాలు అందుతాయని వివరించారు. 1975, జూన్ 25వ తేదీన దేశ వ్యాప్తంగా నాటి ప్రధాని ఇందిగా గాంధీ ఎమర్జెన్సీ విధించారు. 1977, మార్చి 21వ తేదీ వరకు ఈ ఎమర్జెన్సీ కొనసాగింది. ఈ కాల వ్యవధిలో దేశ వ్యాప్తంగా లక్షలాది మందిని ఇందిరా ప్రభుత్వం అరెస్ట్ చేసింది. అనంతరం వారందరిని జైళ్ళకు తరలించింది. దాదాపు కొన్న నెలల పాటు సాగిన ఈ ఎమర్జెన్సీ వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ ఎమర్జెన్సీ కారణంగా.. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వంలోని పలువురు మంత్రులు సైతం జైళ్లకు వెళ్లిన సంగతి తెలిసిందే. అంతేకాదు.. ఆ సమయంలో వారిని అక్రమంగా నిర్భందించారంటూ ఇటీవల ఎమర్జెన్సీ నాటి రోజులను పలువురు కేంద్ర మంత్రులు గుర్తు చేసుకున్న విషయం విధితమే. మరోవైపు గతేడాది మే, జూన్ మాసాల్లో సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. వాటితో పాటు ఒడిశా, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో ఆ రాష్ట్ర ఓటరు.. బిజెపికి పట్టం కట్టాడు. దీంతో దశాబ్దాల పాటు సాగిన బిజు జనతాదళ్ పార్టీ పాలనకు ఫుల్ స్టాప్ పడింది. ఆ క్రమంలో మోహన్ చరణ్ మాంఝీ సారథ్యంలో బిజెపి ప్రభుత్వం కొలువు తీరింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సైతం మాంఝీ ప్రభుత్వం వరుసగా ఒక దాని తర్వాత ఒకటి అమలు చేసుకొంటూ వస్తోంది. ఎమర్జెన్సీ సమయంలో.. జైళ్లకు వెళ్లిన ఒక్కొక్కరికి రూ. 20 వేల నగదు ప్రతి నెల పెన్షన్‌గా అందజేయాలని ఒడిశాలోని బిజెపి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకొంది.

## కిషన్‌రెడ్డి నివాసంలో సంక్రాంతి వేడుకలు



**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నివాసంలో సోమవారం సాయంత్రం సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ వేడుకల్లో స్పీకర్ ఓం బిర్లా, కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసరాజు, సినీ నటుడు చిరంజీవి, ఎఐజి ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, పివి సింధు వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను మోదీ వీక్షించారు. గాయని సునీత పాటలతో అలరించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి వెంకటేశ్వరస్వామి ప్రతిమను కిషన్‌రెడ్డి అందజేశారు.

# భక్తజనసంద్రం త్రివేణి సంగమం

ఘనంగా ప్రారంభమైన మహాకుంభమేళా

తొలిరోజు 1.5 కోట్లకుపైగా భక్తులు పవిత్రస్నానాలు



**మహాకుంభనగర్ :** ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుకగా పేరొందిన మహా కుంభమేళా ఘనంగా ప్రారంభమైంది. గంగా, యమునా, సరస్వతీ నదులు కలిసే ప్రదేశమైన ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు భక్తులు పోటెత్తుతున్నారు. తొలి రోజు పుష్య పౌర్ణమి సందర్భంగా సోమవారం తెల్లవారుజాము నుంచే లక్షలాది మంది భక్తులు త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు ఆచరిస్తున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. 1.5 కోట్ల మందికిపైగా భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించారు. తొలిరోజే ఇంత పెద్ద సంఖ్యలో భక్తులు కుంభమేళాలో పాల్గొంటే మొత్తం 45 రోజుల్లో వచ్చే భక్తుల సంఖ్య అంచనాలకు మించి 45 కోట్లను దాటే అవకాశం ఉంది. సంక్రాతి నుంచి శివరాత్రి వరకు అంటే జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు 45 రోజులపాటు జరిగే ఈ కార్యక్రమానికి దేశ విదేశాల నుంచి కోట్ల మంది భక్తులు, పర్యాటకులు తరలి రానున్నారు. సుమారు 45 కోట్ల మంది భక్తులు పవిత్ర స్నానాలు చేయడానికి వస్తారని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అంచనా వేస్తున్నది. మరోవైపు ఈ కుంభమేళాకు యుపి ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాటు చేసింది. భారీగా పోలీసు, భద్రతా బలగాలను మోహరించడంతోపాటు అడుగడుగునా సిసి కెమెరాలను ఏర్పాటు చేసింది. డ్రోన్ కెమెరాలతో పరిస్థితులను పరిశీలిస్తున్నది. ఎఐ టెక్నాలజీని కూడా వినియోగిస్తున్నారు. దాదాపు 10 వేల ఎకరాల పరిధిలో ఆధ్యాత్మిక నగరాన్ని ఏర్పాటు చేశారు. ఏసమయంలోనైనా 50 లక్షల మంది నుంచి కోటి మంది ఉండగలిగేలా సౌకర్యాలు కల్పించారు. భక్తులకు సదుపాయాల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.7 వేల కోట్లు ఖర్చు చేస్తున్నది. ఎన్‌డిఆర్‌ఎఫ్ వాటర్ అంబులెన్స్‌లను ఏర్పాటు చేసింది. యాత్రికులకు ఇబ్బంది లేకుండా 1.6 లక్షల టెంట్లను, 1.5 లక్షల మరుగు దొడ్లను నిర్మించారు. భద్రత కోసం 55 పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేయడంతోపాటు 45 వేల మంది పోలీసులను మోహరించారు.

**ఆధ్యాత్మిక వారసత్వం కుంభమేళా: మోదీ**

కుంభమేళా ప్రారంభంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎక్స్ వేదికగా స్పందించారు. భారతీయ విలువలు, సంస్కృతిని గౌరవించే కోట్లాది మందికి ఇది చాలా ప్రత్యేకమైన రోజు. ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళా ప్రారంభమైంది. విశ్వాసం, భక్తి, సంప్రదాయాల సంగమంతో ఎంతోమందిని ఒకచోట చేర్చింది. మన దేశ ఆధ్యాత్మిక వారసత్వాన్ని ఈ వేడుక ప్రతిబింబిస్తుంది. పవిత్ర స్నానాలు ఆచరించి, భగవంతుడి ఆశీస్సులు తీసుకునేందుకు లెక్కలేనంతమంది రావడం ఎంతో సంతోషంగా ఉంది’ అని మోదీ రాసుకొచ్చారు. 10,000 ఎకరాల్లో కుంభమేళాకు ఏర్పాట్లు జరిగాయని, ఏ సమయంలోనైనా 50 లక్షల మంది నుంచి కోటి మంది ఉండగలిగేలా సౌకర్యాలను కల్పించామని సిఎం యోగి ఆదిత్యనాథ్ ఇప్పటికే వెల్లడించారు.

**800 కిలోమీటర్లకుపైగా ప్రయాణించి..**

ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభ్‌లో పాల్గొనేందుకు పంజాబ్ నుంచి 800 కిలోమీటర్లకుపైగా సైకిల్‌పై ప్రయాణిస్తూ రామ్ బాహుబలి దాస్ అలియాస్ 'బాహుబలి బాబా' వచ్చారు. బాహుబలి బాబా పంజాబ్ రాష్ట్రంలోని ఒక చిన్న గ్రామంలో జన్మించారు. ఆయన పండితుడిగా కొనసాగుతున్నారు. ఆ కుంభ మేళాలో పాల్గొనడం కోసం ఆయన సైకిల్‌పై ప్రయాణిస్తూ వచ్చారు. పంజాబ్ నుంచి ప్రయాగ్‌రాజ్‌కు వందల కిలోమీటర్లు ప్రయాణించి చేరుకున్నారు. అందుకే ఆయనను బాహుబలి బాబాగా పిలుస్తారని అంటున్నారు. సాధారణ వ్యక్తులకు ఇన్ని కిలోమీటర్ల సైకిల్ ప్రయాణం చాలా కష్టతరమైన ప్రయాణమని చెప్పవచ్చు.

**తరలి వస్తున్న విదేశీ భక్తులు**

మహా కుంభంలో పాల్గొనేందుకు భారతీయులే కాకుండా విదేశాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. రష్యా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా, ఇటలీ, జర్మనీ, అర్జెంటీనా సహా పలు దేశాలకు చెందిన భక్తులు ‘హర్ హర్ గంగా’ అంటూ త్రివేణి సంగమంలో నినాదాలు చేశారు. ప్రయాగ్‌రాజ్‌లో పవిత్ర స్నానాలు ఆచరించి విదేశీ భక్తులు పులకించిపోయారు. తొలి రోజే అమృత స్నానంలో పాల్గొనడం అద్భుత అనుభూతిని కలిగించిందని పలువురు విదేశీయులు అంటున్నారు. గడ్డకట్టే చల్లటి వాతావరణం ఉన్నా గంగా జలంలో పవిత్ర స్నానం తర్వాత హృదయం వెచ్చని అనుభూతితో నిండిపోయిందని, భారతీయ సంస్కృతిలోని గొప్పదనమే అదంటూ ఆధ్యాత్మిక ఆనందంలో తేలియాడుతున్నారు.

**మోక్షాన్ని వెతుక్కుంటూ వచ్చా.. బ్రెజిల్ భక్తుడు**

నీరు గడ్డకట్టుకుపోతున్నప్పటికీ ఈ విదేశీ భక్తుల బృందం త్రివేణి సంగమంలో స్నానమాచరించింది. మోక్షాన్ని వెతుక్కుంటూ తొలిసారిగా భారత్‌కు వచ్చిన బ్రెజిల్ భక్తుడు ఫ్రాన్సిస్కో.. తొలి అమృత్ స్నాన్‌లో పాల్గొనడం అద్భుతమైన అనుభూతి అని అన్నారు. తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ, ‘నేను మొదటిసారిగా భారతదేశానికి వచ్చాను. నేను యోగా సాధన చేసి మోక్షాన్ని వెతుకుతున్నాను. ఇక్కడ ఉండటం అద్భుతంగా అనిపిస్తుంది. భారతదేశం ప్రపంచానికి ఆధ్యాత్మిక హృదయం. నది నీరు చల్లగా ఉంటుంది, కానీ స్నానం చేసిన తర్వాత హృదయం వెచ్చదనంతో నిండి ఉంటుంది.



## కామ్రేడ్ ముస్కు మల్లారెడ్డి మరణం సిపిఐకి తీరని లోటు

**ప్రజాపక్షం/మోటకొండూర్:** కామ్రేడ్ ముస్కు మల్లారెడ్డి మరణం సిపిఐ పార్టీకి, అతని కుటుంబానికి తీరని లోటు అని మోటకొండూరు మండల సిపిఐ కార్యదర్శి గాదగాని మాణిక్యం అన్నారు. ఆయన మండలంలోని నాంచార్‌పేటలో కామ్రేడ్ ముస్కు మల్లారెడ్డి ఆకస్మికంగా మృతి చెందగా గ్రామ శాఖ కార్యదర్శి పైళ్ల రామిరెడ్డితో కలిసి ఆయన పార్థీవదేహానికి సిపిఐ జెండా కప్పి పూల దండలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాణిక్యం మాట్లాడుతూ ముస్కు మల్లారెడ్డి గత 18 సంవత్సరాల నుండి నాంచారి పేటలో హమాలి కార్మికులుగా పనిచేస్తూ ఏఐటీయూసీ అను బంధ సంఘంలో కొనసాగుతూ సిపిఐ పార్టీకి ఆకర్షితుడై పార్టీ సభ్యునిగా పని చేస్తూ కీలక సభ్యత్వం తీసుకున్నాడని, గత 15 సంవత్సరాల నుంచి కమ్యూనిస్టు పార్టీ ముఖ్య కార్యకర్తగా పనిచేస్తూ పేదల పక్షాన ఉండి ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండే నాయకుడని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి ముస్కు పెంటారెడ్డి, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు పసుల నరసింహ, మంచాల రాధమ్మ, బొడిగె సుదర్శన్, గ్రామ శాఖ కార్యదర్శి పైళ్ల రాంరెడ్డి, గంగాధరి రాజయ్య, ఎలిమినేటి రాజయ్య, బెల్లి లక్ష్మీనారాయణ, బెల్లి మల్లేష్, ఆదిరెడ్డి స్వామి, గంధమల్ల యాదయ్య, బండి జయమ్మ, ఎరుకలి రాములు, బెల్లి కిష్టయ్య, కుటుంబ సభ్యులు ముస్కు సిద్ధారెడ్డి, రాంరెడ్డి పాల్గొన్నారు.

## పాడిపంటలతో రైతులు తులతూగాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** సంక్రాంతి పండుగ రైతుల పండుగ అని పాడిపంటలతో రైతులు తులతూగాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సోమవారం ఆయన ఓ ప్రకటనలో సూర్యాపేట జిల్లా ప్రజలకు సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సంస్కృతి, సాంప్రదాయాలకు, స్నేహభావానికి పండుగలు ప్రతీక అన్నారు. పండుగ రోజున ప్రతి ఒక్కరు స్వీయ భద్రతకు ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. వాహనాల్లో ప్రయాణించే వారు హెల్మెంట్లు, సీటు బెల్టు తప్పనిసరిగ్గా పెట్టుకోవాలని సూచించారు. సంక్రాంతి ప్రతి ఒక్కరి కుటుంబంలో ఆనందం, సుఖసంతోషాలను నింపాలని ఆకాంక్షించారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/చివ్వెంల:** సూర్యాపేటఖమ్మం ప్రధాన రహదారిపై మండల పరిధిలోని అక్కలదేవిగూడెం శివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందారు. చివ్వెంల ఎస్ఐ వి మహేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం పట్టణానికి చెందిన ఉమ్మెంతుల కిరణ్ పద్మకర్ (29) హైద్రాబాద్ నుండి మోటార్ సైకిల్‌పై ఖమ్మంకు వెళ్తుండగా వెనుక నుండి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడిక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## భార్యల చేతిలో భర్త హతం

**ప్రజాపక్షం/చివ్వెంల:** కన్న కూతురునే గత కొంత కాలంగా లైంగికంగా వేధిస్తున్న ఓ కన్న తండ్రిని అతని ఇద్దరు భార్యలు హత్య చేసిన సంఘటన సోమవారం తెల్లవారుజామున మండలంలోని గుర్రంతండాలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తండాకు చెందిన రత్నావత్ సైదులు (40) కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. తన సొంత కూతురునే గత కొంత కాలంగా లైగికంగా వేధించడంతో భరించలేక ఈ విషయం తన తల్లులైన సుమలత, రమ్యలకు చెప్పి బోరున విలపించింది. దీంతో వారు అనేక మార్లు భర్తను తన పద్ధతి మార్చుకోవాలని చెప్పినప్పటికి మారకపోగా కూతురును మరింత వేధింపులకు గురి చేయడం మొదలు పెట్టాడు. దీంతో వారు విసుగు చెంది సోమవారం తెల్లవారుజామున ఇంట్లో నిద్రిస్తున్న సైదులు తలపై రోకలి బండతో మోది హత్య చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు జరిపారు. మృతుని చిన్నమ్మ కళావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

## ఆర్ఆర్‌యు పరికరాల చోరీ దొంగ అరెస్ట్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సెల్ టవర్ల నుంచి ఆర్ఆర్‌యు పరికరాలు చోరి చేసిన దొంగను పోలీసులు అరెస్ట్ చేసిన సంఘటన మండలంలోని వెంకటాద్రిపాలెంలో చోటు చేసుకుంది. రూరల్ సీఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం తెల్లవారుజామున మండలంలోని వెంకటాద్రి పాలెం గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ప్యాషన్ ప్రో మోటార్ సైకిల్‌పై వస్తున్న ధీరావత్ నవీన్ ధీరావత్ తండా నుంచి వస్తూ పోలీసులను చూసి తడబడుతూ పారిపోయేందుకు ప్రయత్నించగా అదుపులోకి తీసుకోని విచారించగా గత ఏడాది జూన్ నెలలో శ్రీనివాస్‌నగర్ గ్రామంలో ఎయిర్‌టెల్ రేడియో రిమోట్ యూనిట్ పరికరాలను దొంగలించి హైద్రాబాద్‌లో అమ్ముకునేందుకు వెళ్తూ పట్టుబడ్డాడని తెలిపారు. సుమారు రూ.2.5లక్షల విలువైన సామాగ్రి, దొంగతనాలకు వాడిన ప్యాషన్ ప్రో మోటార్ సైకిల్, కటింగ్ ప్లయర్‌ను స్వాదీనం చేసుకున్నామన్నారు. గతంలో నిందితుడిపై రూరల్ స్టేషన్‌లో 5కేసులు, ఇతర స్టేషన్‌లో 11 కేసులు ఉన్నాయన్నారు. నిందితుడు నవీన్‌కు స్థానిక జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరుచగా జ్యుడిషియల్ కస్టడీకి తరలిస్తూ ఆదేశాలిచ్చారని తెలిపారు. ఆయన వెంట ఎస్ఐలు లోకేష్, చల్లా వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ రాములునాయక్, కానిస్టేబుల్స్ సైదానాయక్, శంకర్, నాగరాజు, హోంగార్డు అనిల్ ఉన్నారు.

## ఉద్యోగ భద్రత కల్పించాలి



**ప్రజాపక్షం/చండూరు:** ఆర్టిజన్ కార్మికులకు పూర్తిస్థాయిలో ఉద్యోగ భద్రత లేనందున కన్వర్షన్ కొరకు టివిఏసి జెఏసి స్టేట్ కమిటి పిలుపు మేరకు ఈ నెల 20నుండి 24 వరకు రిలే నిరహార దీక్షలు ప్రతి సబ్ స్టేషన్ ముందు నిర్వహించడం జరుగుతుందని ఆర్టిజన్ కార్మికులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్టేట్ టివిసి జెఏసి జాయింట్ సెక్రటరి సలీం పాషా, నల్లగొండ జిల్లా కన్వీనర్ పెరిక శంకర్, లింగారెడ్డి, పరమేష్ ,సుఖేందర్‌రెడ్డి, హరిలాల్ తదితరులు పాలొన్నారు.

# దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత

### శ్రీగోదా రంగనాథ స్వామి వారి కల్యాణమహోత్సవంలో పాల్గొన్న మండలి చైర్మన్ గుత్తా, ఎంఎల్ఏ బాలునాయక్



**ప్రజాపక్షం/దేవరకొండ:** ప్రతి ఒక్కరు అధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని, దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ లు అన్నారు. సోమవారం భోగి పండుగ సందర్భంగా పట్టణ పరిధిలోని గరుడాద్రి నగర్ సంతోషిమాత వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి, శ్రీ గోదా రంగనాథ స్వామి వారి కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి అవసరమైన మౌలిక వసతుల కల్పన కోసం తాము ప్రత్యేక శ్రద్ధ చూపుతామని హామీ ఇచ్చారు. దేవాలయ ప్రాంగణం పునరుద్దరణకు ప్రభుత్వ సహాయం అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని, ఈ ప్రాంత ప్రజల శ్రేయస్సు కోసం, ఆలయంతో పాటు ప్రాంతీయ అభివృద్ధికి తోడ్పాటును అందించనున్నట్లు తెలిపారు. ఆలయానికి కావాల్సిన నిధులు మండల చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, నల్గొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్‌రెడ్డిలతో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రిని కలిసి నిధులు మంజూరు చేయించి ఆలయ నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేయనున్నట్లు ఎంఎల్ఏ బాలునాయక్ ఆలయ కమిటి సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్, దేవాలయ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, వెంకటయ్యగౌడ్, వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి దొడ్డి అశోక్, కోశాధికారి కృష్ణయ్య, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, మాజీ ఎంపిపిలు జానియాదవ్, గోవింద్, మాజీ జెడ్పిటిసి దేవేందర్‌రావు, బధ్య, కౌన్సిలర్లు దేవేందర్, భూదేవి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు హరికృష్ణ, రాంసింగ్, మల్లయ్య, భద్రయ్య, పురుషోత్తం, సుధాకర్, వెంకటేష్, శ్రవణ్, బాబురాం, పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.



## భోగి మంటల్లో మంచి ఉదయించాలి

### మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేట:** భోగి మంటల్లో చెడు ఆహుతి చేసి మంచిని ఉదయించేలా అందరూ అలవర్చుకోవాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం జిల్లా కేంద్రంలోని విద్యానగర్ చౌరస్తాలో బిఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భోగి మంటల వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ అందరు తమలో ఉన్న చెడు ఆలోచనలను భోగి మంటల్లో బూడిద చేసుకోవాలన్నారు. సరికొత్త ఆలోచనలతో ముందుకు సాగాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వానికి మార్పు మార్పు అనుకుంటూ పేర్లు మార్చడమే సరిపోయిందన్నారు. ఇప్పటికైన కాంగ్రెస్ పాలకులకు కనువిప్పు కలగాలన్నారు. కెసిఆర్ లాంటి అభివృద్ధి ఆలోచనలు కాంగ్రెస్ ప్రభుత్వానికి రావాలన్నారు. పాడిపంటలు సమృద్ధిగా పండి తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు సాగాలన్నారు. కెసిఆర్ పాలనలో గత పది సంవత్సరాలు రాష్ట్రం అన్ని రంగాల్లో ముందువరుసలో ఉందన్నారు. పాలకులు చెడు ఆలోచనలను భోగి మంటల్లో కాలిపోయి మంచి ఆలోచనలతో మార్పు రావాలన్నారు. ప్రజల కష్టాలు తొలగిపోయి ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంపి బడుగుల లింగయ్య యాదవ్, పట్టణ అధ్యక్షులు సవరాల సత్యనారాయణ, బిఆర్ఎస్ నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# పత్రికలు ప్రజలకు, ప్రభుత్వానికి వారధి



'ప్రజాపక్షం' నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించిన జాల నర్సింహారెడ్డి, పల్లా నర్సింహారెడ్డి

**ప్రజాపక్షం/చందంపేట:** చందంపేట మండల కేంద్రంలో సోమవారం ప్రజాపక్షం 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను పిఏసిఎస్ చైర్మన్ జాల నర్సింహారెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా జాల నర్సింహారెడ్డి మాట్లాడుతూ పత్రికలు ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ విలేకరులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ ప్రజాపక్షం పత్రికలో పనిచేస్తున్న విలేకరులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ ప్రజా సమస్యలను కళ్లకు కట్టినట్లుగా ప్రజాపక్షం దినపత్రికలో కథనాలను ప్రచురిస్తున్నారని సమాజంలో జరుగుతున్న అవినీతి అక్రమాలను చూపడంలో ప్రజాపక్షం దినపత్రిక ముందు వరుసలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, జేపిఆర్ ఇన్‌ఫ్రా ఎండి. జాల తిలక్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, తిరుపతయ్య, రమేష్, విలేకరులు విష్ణు, ఆంజనేయులు, చంద్రమౌళి, శంకర్, రాజు, సైదులు, సత్తయ్య పాల్గొన్నారు.



### నిజాలను నిర్భయంగా రాయాలి

**ప్రజాపక్షం/మోటకొండూర్:** ప్రజలకు ప్రభుత్వానికి వారధి పత్రికలేనని సూదగాని ఫౌండేషన్ చైర్మన్ సూదగాని హరిశంకర్ గౌడ్ అన్నారు. ఆయన సోమవారం మండలంలోని వర్టూర్‌లో ప్రజాపక్షం దినపత్రిక 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో గ్రామీణ విలేఖరులు సమాజం కోసం నిర్విరామ కృషి చేస్తున్నారని అన్నారు. నిజాలను నిర్భయంగా వార్తలు రాయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు సూదగాని రాందాసు గౌడ్, మాజీ సర్పంచ్ సూదగాని సత్తమ్మ, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నెమ్మాని సుబ్రహ్మణ్యం, యువ నాయకులు కాదూరి శ్రీనివాస్, పల్లె నరేష్, మురళీ, మదు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా చట్టాలు పకడ్బందీగా అమలు

### డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్ డిమాండ్




**ప్రజాపక్షం/భువనగిరిరూరల్:** అధికారంలో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల రక్షణ కోసం తీసుకువచ్చిన మహిళా చట్టాలను పగడ్బందీగా అమలు చేసి మహిళలపై జరుగుతున్న దాడులను ఆపాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం భువనగిరిలోని హనుమాన్‌వాడలో ఎస్ఎఫ్ఐ,డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీ బహుమతుల ప్రధానోత్సవ సభలో వారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల రక్షణ కోసం తీసుకువచ్చిన నిర్భయ, దిశా చట్టాలను పకడ్బందీగా అమలు అయ్యే విధంగా చూడాలన్నారు. హైదరాబాద్ ఎస్ఎఫ్ఐ గరల్స్ కమిటీ కో కన్వీనర్ కొలుపుల సహన మాట్లాడుతూ ప్రతి మహిళ, విద్యార్థులు రాజ్యాంగపరంగా మహిళలకు ఉన్న హక్కులను, చట్టాలను తెలుసుకోవాలన్నారు. ప్రజాసంఘాల పట్టణ నాయకులు బర్ల వెంకటేశం, డివైఎఫ్ఐ మాజీ జిల్లా కమిటీ సభ్యులు ఆరే విజయ్, నాయకులు అజయ్, నిర్వాహకులు కొలుపుల శ్రీనిజ, నిఖిలేశ్వర్, నాగేశ్వరీ, సింధూజ మహిళలు పాల్గొన్నారు.

## మెల్విన్ జోన్స్ ఆశయాలను సాధిస్తాం




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మెల్విన్‌జోన్స్ ఆశయాలను సాధిస్తామని లయన్స్‌క్లబ్ అధ్యక్ష,కార్యదర్శులు ఎనగడ్ల లింగయ్య, జూలకంటి మల్లారెడ్డిలు అన్నారు. సోమవారం మెల్విన్ జోన్స్ 146వ జయంతి సందర్భంగా స్థానిక రంగాచార్యులు, రంగనాయకమ్మ కంటి ఆసుపత్రిలోని ఆయన విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించి స్థానిక లేబర్ అడ్డా వద్ద కూలీలకు అల్పాహారం, దుస్తులు పంపిణి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ప్రపంచ వ్యాప్తంగా 200 దేశాల్లో 14 లక్షల సభ్యత్వాలను కలిగి ఉండగా మన దేశంలో 2లక్షల సభ్యత్వాలతో అనేక సేవా కార్యక్రమాలను చేపడుతుందన్నారు. పేదలకు అన్నదానం, ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణి, ఫర్నీచర్ అందించడంతోపాటు రక్తదాన శిబిరాలను నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో బిఎం.నాయుడు, ముక్కపాటి వెంకటేశ్వర్‌రావు, జె.రాజు, పాశం రవీందర్‌రెడ్డి, అనంతరెడ్డి, గుండా రామారావు, పాశం మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి సహకారంతో వార్డు అభివృద్ధికి కృషి

### మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సహకారం తో మరో ఆరు నెలలలో వార్డ్ లో ఉన్న మిగిలిన సమస్యలను పూర్తి చేయడం జరుగుతుందని నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీ లో 18 వ వార్డు కౌన్సిలర్ గడిగ హిమబిందు శ్రీనివాస్ ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తన సొంత నిధులు రెండు లక్ష రూపాయలతో ఏర్పాటు చేసిన శ్రీరామ్ నగర్ కాలనీ ఫేస్1 ముఖ ముఖద్వారాన్ని సోమవారం మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ ముఖ్యఅతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వార్డు కౌన్సిలర్ గడిగ హిమబిందు శ్రీనివాస్ ముఖ ద్వారానికి ఇరువైపులా సీసీ రోడ్లను ఏర్పాటు చేసి పచ్చని చెట్లతో అలంకరించడం అభినందనీయం అన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సహకారంతో వార్డులో అండర్ డ్రైనేజీ వర్క్ మొదలు పెట్టడం జరిగిందని మరో ఆరు నెలల లో వార్డ్ లో ఉన్న మిగిలిన సమస్యలను పూర్తి చేయడం జరుగుతుంది అని చెప్పడం జరిగిందన్నారు. అవార్డు కౌన్సిలర్ గడిగ హిమబిందు శ్రీనివాస్ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల క్రితం మున్సిపల్ కౌన్సిలర్ ఎన్నికల్లో శ్రీరామ్ నగర్ కాలనీ ఫేస్ 1 ముఖద్వారము ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చిన పిదప మాట తప్పకుండా పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. మంత్రి సహకారంతో ఈ వార్డు అభివృద్ధికి మరింత కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగొని రమేష్ , కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు గుమ్మల మోహన్ రెడ్డి , వార్డ్ అధ్యక్షులు వడ్డబోయిన రామ కృష్ణ, చింతపల్లి సుందర్, నాతి వెంకన్న, చిత్తలూరి శివ,బొబ్బలి ఆంజనేయులు, వంగూరి జోషఫ్, తంతనపల్లి కృష్ణ, రఘువేందర్ రాజు,ధనుష్, సందీప్, ప్రశాంత్, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఫ్యూడల్ పరిపాలన

### ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీత

**ప్రజాపక్షం/భువనగిరిరూరల్:** రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత క ఫ్యూడల్ వ్యవస్థ తిరిగి వస్తున్నదని ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీత విమర్శించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రెండు రోజుల క్రితం బిఆర్ఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంపై కాంగ్రెస్ గుండాల దాడి చూస్తుంటే శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందన్నారు. నియంత పోకడలతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భాష, వ్యవహార శైలి ప్రజలు ఈసిడించుకుంటున్నారని తెలిపారు. వాటిని కాంగ్రెస్ కార్యకర్తలు అనుకరిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు రైతు భరోసా తో పాటు కలు హామీలను ఇచ్చారని అవి నెరవేరకపోవడంతో ప్రతిపక్షంగా ప్రశ్నిస్తే పార్టీ కార్యాలయం మీద దాడి చేస్తారా అని నిలదీశారు రాష్ట్రంలో శాంతి భద్రతలు ఘాతం కలుగుతున్నాయని పోలీసుల ఇది జరుగుతున్నాయన్నారు. కార్యాలయం పై దాడిని ఖండిస్తూ శాంతి యుతంగా నిరసన తెలుపాలనుకుంటే రాచకొండ పరిధిలోని సుమారు 6000 మంది పోలీసుల చేత అరెస్టులు నిర్బంధాలను చేశారన్నారు. కాంగ్రెస్ గుండాల్లారా ఈ రాష్ట్రంలో 70 లక్షల మంది నికాసైన కారకర్తలు బిఆర్ఎస్ కు ఉన్నారని వారిని మేము ఉసిగొలిపితే కాంగ్రెస్ వాళ్ళు పొట్టు పొట్టు అవుతారని హెచ్చరిక జారీ చేశారు. కానీ అలాంటి పద్ధతులు మాకు మా కెసిఆర్ చెప్పలేదన్నారు. టిఆర్ఎస్ మీద దాడులు చేస్తే ఏ రాజకీయ నాయకుడు ఇండ్ల నుండి గడప దాటలేరని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, బిఆర్ఎస్ నాయకులు జనగాం పాండు, రచ్చ శ్రీనివాస్, పెంట నితీష్ పాల్గొన్నారు.







## పేపర్ బాయ్స్‌కి జర్కిన్లు పంపిణీ

**ప్రజాపక్షం/భువనగిరి:** సూర్యోదయంకు ముందే మేల్కొని పత్రికా రంగంలో తమ వంతుగా తమ బాధ్యతను నిర్వహించే పేపర్ బాయ్స్‌కు చలి నుండి రక్షణగా భువనగిరి వాసవి క్లబ్ ఆధ్వర్యంలో రైస్ మిల్ అసోసియేషన్‌లో జర్కిన్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ భువనగిరి క్లబ్ అధ్యక్షులుగా బిజ్జాల మహేష్ కుమార్ ఆధ్వర్యంలో ముఖ్యఅతిథిగా వి104ఏ డిస్టిక్ గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి , క్యాబినెట్ సెక్రటరీ బిక్కుమల్ల కృష్ణ క్యాబినెట్ ట్రెజరర్ వెంపటి శబరినాథ్, ప్రధాన కార్యదర్శి బచ్చు రమేష్, కోశాధికారి జంగాల హనుమంతరావు, డిస్ట్రిక్ట్ రీజినల్ చైర్మన్ పాలకుర్తి వేణుమాధవ్, రీజినల్ సెక్రటరీ కొడిత్యాల నవీన్ కుమార్, జోన్ చైర్మన్ ఆకుల రమేష్, మాజీ డిప్యూటీ గవర్నర్ మంచాల రిషికేష్, మాజీ అధ్యక్షులు చందా మహేందర్, పసుపునూరి మనోహర్, మంచికంటి రవికుమార్, చీకటిమల్ల రాములు, సోమ చంద్రగుప్త, మంచి కంటి వెంకటేశం, కూరెళ్ళ జనార్ధన్, జిల్లా వెంకటరమణ, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

## గ్రామీణ యువతకు ప్రోత్సాహం



**ప్రజాపక్షం/మాడుగులపల్లి:** గ్రామీణ క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సాహించాలని మాజీ వైస్ ఎంపిపి పాదూరు గోవర్ధన అన్నారు.సోమవారం డీవైఎఫ్ఐ,ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆగా మోత్కూర్ గ్రామంలో వాలీబాల్ పోటీలను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ క్రీడలను క్రీడాకారులను యువతను అన్ని విధాలా ప్రోత్సాహించాలని అన్నారు. వారికి అవసరమైన కిట్లు, క్రీడలకు సంబంధించి గ్రౌండ్ లు తయారు చేసి ఇవ్వాలన్నారు.ప్రతి సందర్భంగా సంక్రాంతి సందర్భంగా క్రీడలు నిర్వహిస్తూ యువతను ప్రోత్సాహిస్తున్న డీవైఎఫ్ఐ సంఘాన్ని అభినందించారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు రొండి శ్రీనివాస్,డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు పతాని శ్రీను,జిల్లా నాయకులు ఎలిజాల రమేష్,మండల నాయకులు బంటు రాజు,ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు సంపత్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ శ్రేణుల్లో సంక్రాంతి శోభ

### 'దామన్న' రాకతో సందడే సందడి

**ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి:** కాంగ్రెస్ శ్రేణుల్లో ఏనాడు లేనంత సంక్రాంతి శోభ సంతరించుకుంది. తమ ప్రియతమ నాయకుడైన మాజీ మంత్రి, సూర్యాపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ రాంరెడ్డి దామోదర్ రెడ్డి గత కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ హైద్రాబాద్‌లోనే ఉన్నారు. దీంతో కాంగ్రెస్ శ్రేణుల్లో కల తప్పింది. నిత్యం అందుబాటులో ఉండే తమ ప్రజా నాయకుడు అనారోగ్యంపాలు కావడంతో వారు జీర్ణించుకోలేకపోయారు. తమ నాయకుడు సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా సూర్యాపేటకు తిరిగి రావాలని దేవుళ్ళకు మొక్కుకున్నారు. వారి మొక్కులు ఫలించి దామోదర్ రెడ్డి తిరిగి సంపూర్ణ ఆరోగ్యంతో ఆదివారం జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. ఇన్ని రోజులు కార్యకర్తలకు దూరంగా ఉన్న ఆయన మూడు రోజుల పాటు తన నివాసంలో అందుబాటులో ఉండి సంక్రాంతి పండుగను ఇక్కడే జరుపుకోనున్నారు. తమ నేత వచ్చిన విషయం తెలుసుకున్న సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాలకు చెందిన అనుచరగణం, కాంగ్రెస్‌నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చి తమ నేతను కలుసుకొని సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. వారిని ఉత్సాహపరిచేలా దామోదర్ రెడ్డి సైతం జై కాంగ్రెస్.. జైజై కాంగ్రెస్.. సూర్యాపేట కాంగ్రెస్ జిందాబాద్ అంటూ నినాదాలు చేసి అందరిని ఉత్సాహపరిచారు. మూడు రోజుల పాటు జిల్లా కేంద్రంలోని ఆయన నివాసం వైట్ హౌజ్‌లో అందుబాటులో ఉంటామని ఆయన చెప్పారు.





## విజేతలకు బహుమతులు ప్రదానం

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేటలో కొమ్ము అభిలాష్ ఆధ్వర్యంలో సోమవారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు వివిధ రకాల రంగవల్లులు వేశారు. న్యాయనిర్ణేతలు ముగ్గులను పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ముఖ్య అతిథులుగా హాజరైన జైపాల్ రెడ్డి, సాదుల వెంకటేశ్వర్లు, అనిల్ చారి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సొన్నాయిటకం రమ్య, కవిత, వాణి, తిరుమల, స్వర్ణలత, పద్మ, శ్రీలత, శ్వేత, పావని, తదితరులు పాల్గొన్నారు.

**మంథనిలో..**



**ప్రజాపక్షం/మంథని:**సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మంథని మున్సిపల్ పరిధిలోని శ్రీరాంనగర్‌లో యూత్‌కాంగ్రెస్ నాయకుడు కెక్కర్ల మారుతిగౌడ్, రిమ్మలపూడి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు మున్సిపల్ చైర్ పర్సన్ పెంద్రి రమా సురేష్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్ బహుమతులు అందజేశారు. పోటీల్లో శ్రీజ, స్రవంతి ప్రథమ, దేవి, స్వరూప ద్వితీయ, వర్ష, లిపిక,కోహిత, జాహ్నవిల జట్లు తృతీయ స్థానంలో నిలువగా వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వొడ్నాల శ్రీనివాస్, నాయకులు పేరవేన లింగయ్యయాదవ్, పెంటరి రాజు, ఆకుల శ్రీనివాస్, జానీతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## కాకర్లపల్లిలో పెద్దమ్మతల్లి బోనాలు



**ప్రజాపక్షం/మంథని:**సంక్రాంతి పండుగ సందర్భంగా మంథని మండలం కాకర్లపల్లి గ్రామంలో యాదవ కులస్తుల ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లిబోనాలను ఘనంగా నిర్వహించారు. సోమవారం ఒగ్గు కళాకారుల డోలు చప్పుళ్లతో మహిళలు బోనం ఎత్తుకుని పెద్దమ్మతల్లి ఆలయం చేరుకుని అమ్మవారికి బోనం సమర్పించారు.మున్సిపల్ చైర్ పర్సన్ పెంద్రి రమా సురేష్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్ అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. మండల పార్టీ అధ్యక్షుడు ఐలి ప్రసాద్, నాయకులు పేరవేన లింగయ్య, ఆరెల్లి కిరణ్, కన్నెబోయిన కుమారస్వామి, ఓదెలు, రాజయ్య, గట్టయ్య, రాము, కిషన్, వెంకటేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## సతీష్ మృతిపై ఎఐటియుసి సంతాపం



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** సింగరేణి ఆర్జీ వన్ ఏరియాలోని జిడికె 11వ ఇంక్లైన్‌లో విధులు నిర్వహిస్తున్న గిన్నారపు సతీష్, వారి కుమారుడు సోమవారం తెల్లవారుజామున గోదావరిఖనిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఏఐటియుసి సంతాపం వ్యక్తం చేసింది. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ సతీష్ కుటుంబ సభ్యులు కోలుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, జి.ఎం.కమిటి మెంబర్ సిద్దమల్ల రాజు, పిట్ సెక్రటరీ నాయిని శంకర్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ గొడిశెల నరేశ్, నాయకులు చెప్యాల భాస్కర్, తాళ్ళపెల్లి శ్రీనివాస్, కీర్తి శేఖర్ పేర్కొన్నారు. సతీష్ మరణం వార్త విని గోదావరిఖని ప్రభుత్వ హాస్పిటల్ లో సతీష్, అతని కుమారుడు పార్థివ దేహాలను సందర్శించినివాళులర్పించారు. సతీష్ మరణం పట్ల వారి కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.

## 15 నుండి బేగంపేట ఉర్స్ ఉత్సవాలు

**ప్రజాపక్షం/రామగిరి :** రామగిరి మండలం బేగంపేట పిర్ పహాడీ బాబా ఉర్సు ఉత్సవాలు ఈనెల 15 నుండి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.బుధవారం సాయంత్రం గంధం కార్యక్రమం జరగనుందని, అనంతరం ఉర్స్ ఉత్సవం రెండు రోజులపాటు కొనసాగుతుందని తెలిపారు. దీంతో పీర్ పహాడ్ గుట్ట విద్యుత్ దీపాల అలంకారంతో తీర్చిదిద్దారు. ఈ ఉత్సవాలకు జిల్లా నుండే కాక చుట్టుపక్కల జిల్లాల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన నున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు.

## సిద్దిపేట ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట జిల్లా ప్రజలకు మాజీ మంత్రి హరీశ్‌రావు మకర సంక్రాంతి పర్వదినం శుభాకాంక్షలు తెలిపారు. హరీష్‌రావు మాట్లాడుతూ సకల సంపదలతో సంక్రాంతి పర్వదినాన్ని కుటుంబ సభ్యులతో కలసి ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలన్నారు. ఈ సంక్రాంతి ప్రతి ఒక్కరూ జీవితాల్లో నూతన కాంతిని తేవాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని, పసిడి పంటలతో పరిఢవిల్లాలన్నారు.

## ఎస్ఐ రాజుకు సన్మానం

**ప్రజాపక్షం / మల్లాపూర్ :** మల్లాపూర్ మండల ఎస్సైగా ఇటీవలే బదిలీపై వచ్చిన ఎస్ఐ కోసన రాజును మండల ఆర్ఎంపి, పిఎంపి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.మండల అధ్యక్షుడు లక్ష్మి నర్సయ్య, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, క్యాషియర్ నరేందర్, మాజీ మండల అధ్యక్షుడు మంద స్వామి, శంకర్, రాకేష్. రామకృష్ణ, రాజ గంగారాం తదితరులు ఉన్నారు.



# కౌశిక్‌వి పిచ్చి పనులు, ప్రేలాపనలు

### డిసిసి బిసి సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్




**ప్రజాపక్షం / కరీంనగర్ ప్రతినిధి :** కరీంనగర్ జిల్లా కలెక్టరేట్‌లో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అమలు గురించి ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌పై దుర్భాషాలు ఆడడం తెలిసిందే. సభను తప్పుదోవ పట్టించే విధంగా ప్రవర్తించిన తీరును ఖండిస్తూ సోమవారం కరీంనగర్ డిసిసి కార్యాలయంలో డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటి రెడ్డి పద్మాకర్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ బిసి సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్ విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌పై హుజురాబాద్ పాడి కౌశిక్ రెడ్డి ప్రవర్తించిన తీరును ఖండిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసిన కౌశిక్ రెడ్డి తనకు ఓటు వేయకపోతే భార్యా పిల్లలతో సహ శవయాత్ర నిర్వహిస్తామని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. మరోసారి ఇలాంటి పిచ్చి ప్రేలాపనలు,వ్యాఖ్యలుచేస్తే నాలుక కోస్తామని హెచ్చరించారు. పార్టీ చేరికల గురించి మాట్లాడుతున్న నువ్వు మీ పార్టీ అధినేత కేసీఆర్ గతంలో కాంగ్రెస్‌నుండి 12 మంది ఎమ్మెల్యేలను తీసుకున్నప్పుడు ఎందుకు వ్యతిరేకించలేదని ప్రశ్నించారు.జిల్లా కాంగ్రెస్ బిసి సెల్ చైర్మన్ పులి ఆంజనేయులుమాట్లాడుతూ కరీంనగర్ ఉమ్మడి జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశంలో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రవర్తించిన తీరు పట్ల జిల్లా ప్రజలందరూ సిగ్గుపడుతున్నారు. ప్రజారాజ్యం నుండి వైసిపి నుండి దొంగతనంగా కాంగ్రెస్‌లో చేరి కాంగ్రెస్ అండదండలతో 70వేల ఓట్లు సంపాదించుకుని ఆ పేరుతో రాత్రికి రాత్రే టిఆర్ఎస్‌కు అమ్ముడుపోయిన నీచ సంస్కృతి గల కౌశిక్‌రెడ్డికి కాంగ్రెస్ గురించి మాట్లాడేహక్కు లేదన్నారు. డిసిసి ఉపాధ్యక్షులు మల్యాల సుజిత్‌కుమార్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు పురం రాజేశం, జిల్లా కాంగ్రెస్ నాయకులు రామిడి తిరుపతి రెడ్డి, నూనె గోపాల్ రెడ్డి, వంగల విద్యాసాగర్, నాగుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇప్పటికైనా తీరు మార్చుకో..

### మాజీ ఎంఎల్ఏ ఆరెపల్లి మోహన్



**ప్రజాపక్షం / కరీంనగర్ ప్రతినిధి :** కరీంనగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అభివృద్ధిపై సమీక్ష సమావేశం జరుగుతున్న సమయంలో కౌశిక్‌రెడ్డి ప్రవర్తించిన తీరు, ప్రవర్తనను ఖండిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ అన్నారు. సోమవారంసమావేశంలో ఆయన మాట్లాడుతూఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతుండగా కౌశిక్ రెడ్డి చేసిన అఘాయిత్యాన్నిఖండిస్తున్నామన్నారు. కౌశిక్ రెడ్డి ఎమ్మెల్యే అయి ఉంటే తోటి శాసన సభ్యుడైన సంజయ్‌కుమార్‌ను అడ్డుకుని దాడి చేయడం బాధాకరమన్నారు. వీధి రౌడీలా ప్రవర్తిస్తున్న కౌశిక్ రెడ్డిని శాసన సభ్యుడి హక్కులకు భంగం కలిగించినందుకు శాసన సభ్యుడి పదవి నుండి బర్తరఫ్ చేయాలన్నారు. కౌశిక్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. నాయకులు అకారపు భాస్కర్ రెడ్డి, ఎం.డి. తాజ్, ఆకుల ప్రకాష్, కొరివి అరుణ్, వాసాల రవీందర్, లక్ష్మి నారాయణ, ఉప్పరి రవి, కరీం పాల్గొన్నారు.

# కౌశిక్‌రెడ్డిపై పెట్టిన కేసులు ఎత్తేయాలి




**ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** బిఆర్ఎస్ శాసనసభ సభ్యులు హుజురాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై దురుద్దేశ పూర్వకంగా మీడియాతో వక్రీకరించి, రాయించి తప్పుడు ఆరోపణలు చేస్తూ కేసు నమోదు చేశారని బిఆర్ఎస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య ఖండించారు. సోమవారం బిఆర్ఎస్ నాయకులతో కలిసి సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో సమావేశమయ్యారు. టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి మాట్లాడారు. భారత రాజ్యాంగం ప్రకారం శాసనసభకు ఎన్నికైన జగిత్యాల శాసనసభ్యులుసంజయ్ కుమార్ బిఆర్ఎస్ టికెట్‌తో కేసిఆర్ చేసిన సంక్షేమ అభివృద్ధి పనులను చూసి తనను గెలిపించాలని మాట్లాడి గెలిచిన సంజయ్‌కుమార్ అభివృద్ధి సమీక్ష సమావేశంలో రేవంత్‌రెడ్డి నాయకత్వం గురించి మాట్లాడుతుంటేఅడ్డుకుంటామని అన్నారు. ఏ రాజ్యాంగ స్ఫూర్తితో శాసన సభ్యునిగా ఎన్నికైన ఓ పార్టీ ఫిరాయించి కాంగ్రెస్ పార్టీ తొత్తుగా మారావన్నారు. శాసన సభ్యత్వానికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ టికెట్‌పై పోటీ చేసి గెలిచి అభివృద్ధి సమీక్ష సమావేశంలో మాట్లాడాలని అన్నారు. పార్టీ మారలేదని ప్రజలతో దొంగ మాటలు చెబుతున్నావని అన్నారు. ఎమ్మెల్యే పదవి టిఆర్ఎస్ పార్టీ పెట్టిన భిక్ష అన్నారు. బిఆర్ఎస్ నుండి గెలిచి అభివృద్ధి సమీక్ష సమావేశంలో మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. పాడి కౌశిక్‌రెడ్డిపై పెట్టిన కేసును ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజాపాలన అని బిఆర్ఎస్ పార్టీ నాయకులను, భయభ్రాంతులకు గురి చేస్తూ కక్షపూరిత పాలన చేస్తున్నారని విమర్శించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 2007లో వైఎస్ఆర్ ప్రభుత్వంలో ఒక చట్టం తీసుకొచ్చారని, 2017 వరకు ఉన్న అసైన్డ్ భూమి, సాదాబైనామా కలిగిన భూములను ఏమైనా ఉంటే రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని వెసులుబాటు కల్పించారని, ఆర్డీవో, ఎమ్మార్వో విఆర్వోలు ఎవరైనా ఆ చట్టం ఆధారంగానే పట్టాలు చేశారన్నారు. ఈ చట్టం ఆధారితంగా చేసుకున్న నాయకులను ఒక దొంగల్లాగా మర్డర్ చేసిన వారి కన్నా హీనంగా వ్యవహరిస్తూ బిఆర్ఎస్ నాయకులను అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఈ సమావేశంలో గూడూరి ప్రవీణ్, దార్నం లక్ష్మి నారాయణ, సత్తార్, గుండ్లపల్లి పూర్ణ చందర్, మ్యాన రవి, వెంగళ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాల్లో హుందాగా ఉండాలి




### కౌశిక్‌రెడ్డిపై హుజురాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

**ప్రజాపక్షం/హుజురాబాద్:** జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పట్ల బిఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ప్రవర్తించిన తీరు హేయమైన చర్య అని హుజురాబాద్ కాంగ్రెస్ శ్రేణులు అన్నారు. ఈ మేరకు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ వొడితెల ప్రణవ్ ఆదేశాల మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో అతనిపై ఫిర్యాదు చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగిన సమీక్ష సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేల పట్ల కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు, వాడిన పదజాలం సరిగా లేదని ప్రజా సమస్యల పట్ల నిర్వహిస్తున్న సభలో గందరగోళం సృష్టించి ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందకుండా చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్ట ప్రకారం అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తిరుపతి, మండల అధ్యక్షుడు కిరణ్, హనుమాన్ దేవస్థాన చైర్మన్ కొలిపాక శంకర్, మహిళా అధ్యక్షురాలు పుష్పలత, మండల అధ్యక్షురాలు లావణ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి, డైరెక్టర్ కిరణ్ రెడ్డి, సదానందం, తిరుపతి, బాబు, నరేష్, మైనారిటీ సెల్ టౌన్ అధ్యక్షుడు అప్సర్, సీనియర్ నాయకులు బాబు, నరేష్, కిరణ్ రెడ్డి, పోషయ్య, నరసింహా రెడ్డి,చాంద్‌పాషా,ఖలీద్,ఉప్పు శ్రీను, అలీం, మల్లిక,అనిల్,వినోద్,సాంబయ్య, ఐలయ్య, యూత్ నాయకులు రాజు ఉన్నారు.

# ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి



**ప్రజాపక్షం/రామగిరి :** ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి అని రామగిరి మండల ఎస్సై చంద్రకుమార్ అన్నారు. సోమవారంరామగిరి మండలం సెంటినరీ కాలనీలో రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటనరీ కాలనీ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షులు మొలుమూరి శ్రీనివాస్, డైరెక్టర్స్,మాజీ జెడ్పిటిసి గంట వెంకటరమణారెడ్డి విన్యూత కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. దీనిలో భాగంగా యమధర్మరాజు వేషధారణతో వాహన చోదకులు వాహనంపై వెళ్తున్నప్పుడు హెల్మెట్ ధరించనివారు తమ వెంటనే ప్రమాదం ఉందని తెలుపుతూ, ధరించిన వారికి పూలు ఇచ్చి అభినందించడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రామగిరి ఎస్సై చంద్రకుమార్ మాట్లాడుతూ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించినందుకు లయన్స్ క్లబ్ సభ్యులకు అభినందనలు తెలిపారు అలాగేప్రజలు రోడ్డు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, రోడ్డు భద్రతా చర్యలు పాటించకపోవడమే ఇలాంటి ప్రమాదాలకు ప్రధాన కారణం. రాంగ్ సైడ్ డ్రైవింగ్, రోడ్డు భద్రతా నియమాలు లేకపోవడం, చర్యలు, అతివేగం, మద్యం తాగి వాహనాలు నడపడం మొదలైన వాటి వల్ల రోడ్డు ప్రమాదాల గురించి మనం ఎప్పుడూ వార్తల్లో లేదా మా స్నేహితుల ద్వారా వింటూనే ఉంటాం. చాలావరకు ప్రమాదాలు హెల్మెట్ ధరించకపోవడం వలన జరుగుతున్నాయని కాబట్టి ప్రతి ఒక్కరు తమ కుటుంబం గురించి ఆలోచించి హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని ఒకవేళ ఇచ్చినట్లయితే ఏదైనా జరిగితే మైనర్లపై మరియు వాహన యజమానిపై కేసు నమోదు చేయడం జరుగుతుంది. ముఖ్యంగా మద్యం తాగి వాహనం నడపడం చాలా ప్రమాదకరం మీతో పాటు తోటి వారికి కూడా నష్టం చేకూరుస్తుంది. వాహనం నడిపేటప్పుడు అన్ని రకాల పత్రములను వెంట ఉంచుకోవాలని తెలిపారు. క్లబ్ డైరెక్టర్ డాక్టర్ శరణ్య మారుతి యాదవ్, కళాదర్ రెడ్డి వీరితో పాటు పోలీసు సిబ్బంది శ్రీనివాస్,చంద్రమౌళి, రాజ్ కుమార్,క్లబ్ సభ్యులు శ్రీనివాస చారి, సురేష్,సింగరేణి యువ బలగం సభ్యులు క్రాంతి, సంతోష్ ,శ్రీనివాస్ రెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

# లాక్కెళ్లడం అమానుషం

**ప్రజాపక్షం / కరీంనగర్ ప్రతినిధి :** కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా సమీక్షా సమావేశంలో పాల్గొన్న ముగ్గురు మంత్రులు వచ్చారని ఆహ్వానిస్తేనే తాము వెళ్లామని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. సోమవారం రోజున నగరం లో పార్టీ శ్రేణులతో కలిసి విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి ప్రజల సమస్యల్నీ తీసుకెళ్లాలనుకున్నామని అన్నారు. మా డిమాండ్స్‌ను ముందు పెట్టామని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు వచ్చినట్లు ఫోటోలు దిగినవారంతా భ్రమలో ఉన్నారు. క్లారిటి ఇవ్వాలని కోరామన్నారు. కానీ సమాధానం రాలేదని అన్నారు. కౌశిక్‌రెడ్డి, సంజయ్ కుమార్ వ్యవహారంలో కౌశిక్ ను పోలీసులు గుంజుకెళ్లడం విచారకరమని అన్నారు. తాను ఏనాడు అలాంటి ఘట్టాలను చూడలేదన్నారు. ముగ్గురు మంత్రులు అనుమతి ఇస్తేనే గుంజుకెళ్లారా అని ప్రశ్నించారు. అనుమతిస్తే మీరు సభ నడపడంలో విఫలమయినట్టేనని అన్నారు. మంత్రుల ఆదేశాలు లేకుండా పోలీసులు స్టేజ్ ఎక్కారంటే మీరు క్షమాపణ చెప్పాలన్నారు. సంజయ్ రెచ్చగొట్టడం వల్లే కౌశిక్ ఇరిటేట్ అయ్యాడు. కోపతాపాలు సర్వసాధారణం, కంట్రోల్ చేయాలన్నారు. ఒక ఎమ్మెల్యేను గుంజుకెళ్లడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఎంతమందిపై మీరు కేసులు పెడతారని ప్రశ్నించారు. పోలీసు కేసులు వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## గోదావరిఖనిలో రోడ్డు ప్రమాదం

### తండ్రి, కుమారుడి దుర్మరణం



**ప్రజాపక్షం/గోదావరిఖని :** సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కుటుంబసభ్యులతో కలిసి సంతోషంగా హైదరాబాద్ నుంచి గోదావరిఖనికి వస్తుండగా ఆదివారం అర్ధరాత్రి గోదావరిఖని పట్టణంలోని గాంధీనగర్ వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి కారు ఢీకొన్న ప్రమాదంలో స్థానిక అంబేద్కర్‌నగర్‌కు చెందిన సింగరేణి కార్మికుడు కె.సతీష్, అతడి 11 నెలల కుమారుడు కె.సాత్విక్ దుర్మరణం పాలయ్యారు. వీరితోపాటు కారులో సతీష్ భార్య, చెల్లెలు, బావ ఉన్నారు. కె.కీర్తి, ఎ.అనూష, ఎ.సతీష్‌లకు తీవ్ర గాయాలవ్వగా వారిని కరీంనగర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సతీష్ కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్‌లో ఓ ఫంక్షన్‌కు హాజరై తిరిగి ఇంటికి చేరుకుంటున్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకున్నది. మరికొద్ది క్షణాల్లో ఇంటికి చేరుకుంటామని అనుకుంటున్న సమయంలో ఒక్కసారిగా వారిని మృత్యువు కంబళించింది. ఇదిలా ఉండగా సింగరేణి సంస్థ రామగుండం రీజియన్ 11ఎ గనిలో సతీష్ జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్నాడు. గోదావరిఖని ఒకటో పట్టణ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



## ఆర్‌టిఏ సభ్యుడిగా కమటాల శ్రీనివాస్

**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** జగిత్యాల జిల్లా రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీఓ )సభ్యులుగా జగిత్యాల పట్టణానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు కమటాల శ్రీనివాస్ నియామకమయ్యారు.ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి వికాస్ రాజు ఉత్తర్వులు జరిచేయగా సోమవారం జగిత్యాల ఆర్టీఓ శ్రీనివాస్ సమక్షంలో కమటాల శ్రీనివాస్ బాధ్యతలు తీసుకున్నారు.శ్రీనివాస్ జగిత్యాల వర్తక సంఘం అధ్యక్షులుగా కొనసాగుతున్నారు.శ్రీనివాస్ నియామకానికి సహకరించిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డిలకు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.ఆర్టీఓ సభ్యులుగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ ను ,జగిత్యాల జిల్లా రవాణా శాఖాధికారి శ్రీనివాస్, జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి,జగిత్యాల పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఉటూరి నవీన్ కుమార్,సీనియర్ పాత్రికేయులు టీవీ సూర్యం,పెద్దిరెడ్డి రవీందర్ రెడ్డి, పల్లెర్ల రాజు, పెద్ది శ్రీనివాస్,బొడ్ల రాజు,తదితరులు అభినందించారు.

## చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/కొహెడ:**సంక్రాంతి పండుగకు నిషేదిత చైనా మాంజాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కొహెడ ఎస్సై అభిలాష్ అన్నారు. వర్తక వ్యాపారులు, పతంగి ఎగురావేయు వారు ఎవరైనా చైనా మాంజ దారంను అమ్మకూడదని, వాడకూడదని సాధారణ దారం మాత్రమే వాడలన్నారు.చైనా మాంజ దారంను అమ్మిన, వాడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.అనంతరం .కొహెడ ఎస్సై అభిలాష్ పోలీస్ సిబ్బందితో కలిసి పెద్ద సముద్రాల గ్రామంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా గ్రామ ప్రజలకు, యువకులకు ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు నిబంధనల గురించి అవగాహన కల్పించారు.త్రిబుల్ రైడింగ్ చేయవద్దని, మైనర్ డ్రైవింగ్ ప్రమాదకరమని, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక.. సంక్రాంతి



**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** మన సంస్కృతి,సంప్రదాయాల మేళవించే పండుగ సంక్రాంతి అని జగిత్యాల డివిజన్ ఆర్డీవో పి.మధుసూదన్ అన్నారు.తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో భోగి,సంక్రాంతి పండుగల సందర్భంగా గత వారం రోజులుగా ముగ్గుల పోటీలు,వేగపు నడక, చదరంగం,క్యారం పోటీలు ,వయోవృద్ధుల సంరక్షణ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కౌన్సెలింగ్ కేంద్రం ఆవరణలో పోటీల్లో గెలిచిన విజేతలకు ,విశిష్ట సీనియర్ సిటీజెన్లకు, మహిళలకు జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఆర్డీవో బహుమతులు అందజేసి సన్మానించారు. ఆర్డీవో మాట్లాడుతూ ఆత్మీయతలను,అనుబంధాలను పెంచ డానికి సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా సంక్రాంతి సంబరాలను నిర్వహించడం ఆదర్శనీయమన్నారు.సీనియర్ సిటీజేన్స్‌జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆధ్వర్యంలో జగిత్యాల ఆర్డీవో పి.మధుసూదన్,కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి,మెట్ పల్లి ఆర్డీవో శ్రీనివాస్ వయోవృద్ధుల కేసులనుపరిష్కరిస్తుండడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. సీనియర్ సిటీజేన్స్ రాష్ట్ర కార్యదర్శి,జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్, ఐ.సి. ఐ.సి.ఐ.బ్యాంక్ డిప్యూటీ మేనేజర్ శ్రావణి,పబ్లిక్ రిలేషన్స్ మేనేజర్ ఆలేఖ్య,సీనియర్ సిటీజేన్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, కోశాధికారి వెల్మల ప్రకాష్‌రావు, ఉపాధ్యక్షులు పి.సి. హన్మంతరెడ్డి, ఎం.డి.యాకూబ్,ఆర్గనైజింగ్ కార్యదర్శులు పి.ఆశోక్‌రావు, కే.సత్యనారాయణ,సంయుక్త కార్యదర్శులు దిండిగాల విఠల్, రాజ్ గోపాలచారి, బి.కరుణ, కోరుట్ల అధ్యక్షుడు పబ్బా శివానందం,కార్యదర్శి జి.రాజ్ మోహన్,మెట్‌పల్లి అధ్యక్షుడు వొజ్జల బుచ్చిరెడ్డి,కార్యదర్శి సొడాల కమలాకర్, కోశాధికారి వి.ప్రభాకర్ రావు,ఉపాధ్యక్షుడు ఎం.స్వామి, ధర్మపురిఅధ్యక్షుడుకండ్లే గంగాధర్,మల్యాలఅధ్యక్షుడు దేవారెడ్డి, మేడిపల్లి అధ్యక్షుడు గోవర్ధన్ రావు తదితరులున్నారు.

# కోనేరులోకి గోదావరి నదీ జలాలు



**ప్రజాపక్షం/ ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో వేసవికి ముందే బావులు, బోర్లలో నీటి నిల్వలు అడుగంటగా ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ చొరవతో సోమవారం బ్రహ్మపుష్కరిణి(కోనేరు)లోకి గోదావరి నదీ జలాలలను పంపింగ్ ప్రారంభించారు. పట్టణంలోని భూగర్భ జలాలు అడుగంటి రోజు రోజుకు నీటి సమస్య తీవ్రం అవుతున్న విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే అడ్లూరి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక నిధులు రెండు లక్షల నిధులు కేటాయించి అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌నుఆదేశించారు. సోమవారం మున్సిపల్ సిబ్బందితో గోదావరి నదిలో మోటార్లు బిగించి పైప్‌లైన్ ద్వారా కోనేరులోకి నీటిని మళ్లించారు. అదే విధంగా పట్టణ నడిబొడ్డున ఉన్న చింతామణి చెరువులో సైతం నదీ జలాలు నింపాలని ఎమ్మెల్యే అడ్లూరి ఆదేశించారు. నీటి సమస్య తీవ్రతను గుర్తించి గోదావరి నీటితో కోనేరు, చింతామణి చెరువులోకి నీటిని నింపించే చర్యలకు ఆదేశాలిచ్చిన ఎమ్మెల్యేకు స్థానికులు కృతజ్ఞతలు చెబుతూ హర్షం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తెమ్మ, వైస్ చైర్మన్ ఐ. రామయ్య, నాయకులు ఎస్. దినేష్, వేముల రాజేష్, జక్కు రవీందర్, చీపిరిశెట్టి రాజేష్, అప్పం తిరుపతి, కౌన్సిలర్లు పురాణపు కిరణ్మయి సాంబమూర్తి, తరాళ్ల కార్తీక్, సుధాకర్, మున్సిపాలిటి శానిటరీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

# సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగ

### ఆర్ట్స్ కాలేజ్ మైదానంలో మేయర్, చిన్నారులతో కలిసి పతంగులు ఎగురవేసిన ఎమ్మెల్యే..

**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** సంక్రాంతి పండుగ ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, భోగి భాగ్యాలు, సంక్రాంతి సంబరాలు, కనుమ కృప కటాక్షాలు అందరికీ ఉండాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని నీలిమ రాజేందర్ రెడ్డి అన్నారు. సోమవారం రోజున "నాయిని విశాల్ ట్రస్ట్ "ఆధ్వర్యంలో హనుమకొండ ఆర్ట్స్ అండ్ సిన్స్ కాలేజ్ మైదానంలో ఏర్పాటు చేసిన పతంగుల పండుగ కార్యక్రమానికి కుటుంబ సమేతంగా నగర మేయర్ గుందు సుధారాణి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణతో కలిసి ముఖ్య అతిథులుగా హాజరైనారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజా ప్రతినిధులతో,చిన్నారులతో కలిసి సరదాగా పతంగులను ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ పతంగుల మాదిరిగానే మనిషి తన మనసును స్వేచ్ఛాయుత వాతావరణంలో గడిపేందుకు వీలుగా నడుచుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి స్వేచ్ఛాయుతమైన వాతావరణంలో అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ పథకాల అమలు జరుగుతున్నదని తెలిపారు.తెలుగు సంప్రదాయాల్లో సంక్రాంతి పండుగ ఎంతో ప్రత్యేకమైనదని సనాతన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగ సంక్రాంతి అని పేర్కొన్నారు. భోగి,సంక్రాంతి,కనుమ మూడు రోజులు ఎంతో ఆనందంగా జరుపుకునే పండుగలో ప్రజలందరికీ భోగ భాగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. పతంగుల పండుగలో చిన్నారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని,తల్లితండ్రుల పర్యవేక్షణ తప్పనిసరి అని గుర్తు చేశారు.ప్రతియేటా నాయిని విశాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా పతంగులను పంపిణీచేసి,విచ్చేసినా వీక్షకులకు, పిల్లలు సదుపాయాలు కల్పించారు. స్టేడియం ఆవరణలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు,నాయకులు, డివిజన్ అధ్యక్షులు,కార్యకర్తలు,తదితరులుపాల్గొన్నారు.



## ప్రజల సమస్యలపై పోరాడే పత్రిక 'ప్రజాపక్షం': ఎస్ఐ టివిఆర్ సూరి




**ప్రజాపక్షం/మంగపేట:** ప్రజా సమస్యలపై పోరాడే పత్రిక ప్రజాపక్షం అని మంగపేట ఎస్ఐ టివిఆర్ సూరి అన్నారు. మంగపేట మండల పోలీస్‌స్టేషన్ ఆవరణలో స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ టివిఆర్ సూరి ప్రజాపక్షం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సూరి మాట్లాడుతూ సమాజంలో అక్రమాలపై స్పందిస్తూ అవినీతిని వెలికి తీస్తూ విజయాలపై దూసుకెళ్తున్న పత్రిక ప్రజాపక్షం అని, పత్రిక విలువలను పాటిస్తూ ప్రజా సమస్యలపై మంచిచెడులను ప్రజలకు వివరిస్తూ ప్రతి అక్షరం ప్రజల కోసం అని అక్షరాల సారథిగా నిలుస్తూ ఈ పోటీ ప్రపంచంలో తక్కువ కాలంలో ఎదిగి పెద్ద పత్రికలకు ధీటుగా ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలిచి సమాజంలో అక్రమాలపై, అవినీతిపై పోరాటం చేస్తూ ప్రజల గుండెల్లో వెలుగు నింపి అక్షర విజయాలను సాధిస్తున్న ఏకైక పత్రిక ప్రజాపక్షం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాపక్షం పాత్రికేయులు తాళ్లూరి మధుకర్, పాత్రికేయులు నూతి వెంకటేశ్వర్లు, సామల సాంబశివ రావు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపి ప్రియాంకగాంధీని కలిసిన యశస్వి, ఝాన్సిరెడ్డి



**ప్రజాపక్షం/పాలకుర్తి:** కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకురాలు, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి, వయనాడ్ ఎంపి ప్రియాంకగాంధిని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఝాన్సిరెడ్డిలు సోమవారం ఢిల్లీలోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రియాంక గాంధీ వయనాడ్‌లో భారీ మెజార్టీతో ఎంపిగా ఎన్నికైనందుకు అభినందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పాలకుర్తి నియోజకవర్గానికి వచ్చారని, మరోసారి పాలకుర్తి నియోజకవర్గాన్ని సందర్శించాలని కోరామని తెలిపారు.

## సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన ఎంపి రవిచంద్ర



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** సంక్రాంతి పండుగ సందర్భంగా బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తెలుగు ప్రజలందరికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భోగి, మకర సంక్రాంతి,కనుమ పండుగల సందర్భంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వాసులు, దేశంలోని వివిధ రాష్ట్రాలు,విదేశాలలో స్థిరపడిన, నివసిస్తున్న తెలుగు వారందరికి ఎంపి రవిచంద్ర హృదయపూర్వక శుభాకాంక్షలు చెప్పారు. పతంగులు ఎగరేసే సందర్భాలలో ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా అవసరమైన ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఒక ప్రకటనలో ఎంపి యువతకు హితవు పలికారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి సంక్రాంతి సంబురాలను ప్రశాంతంగా జరుపుకోవలసిందిగా ఎంపి వద్దిరాజు తెలుగు వారందరిని కోరారు.

## కాళేశ్వరం ఆలయంలో హైకోర్టు జడ్జి ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్య క్షేత్రమైన కాళేశ్వరం ఆలయంలో సోమవారం తెలంగాణ హైకోర్టు జడ్జి రాధారాణి దంపతులు కాళేశ్వర ముక్తేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన రాజగోపురం వద్ద వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి స్వాగతం పలికారు. అనంతరం జడ్జి దంపతులు స్వామి వారికి అభిషేకం,అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఆలయ పర్యవేక్షకులు బుర్రి శ్రీనివాస్ వారిని శేష వస్త్రలతో సత్కరించగా, ఆలయ అర్చకులు వారికి ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట మహాదేవపూర్ సిఐ రామచందర్ రావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య



**ప్రజాపక్షం/నెక్కొండ:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో సోమవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని రైలు ఢీకొని సుమారు 45 –50 సంవత్సరాల వయసు గల ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి వివరాలు తెలియవని ఎలాంటి ఆధారాలు మృతుడి వద్ద లభించలేదని మృతదేహాన్ని ఎంజీఎం తరలించామని ఎవరికైనా సమాచారం తెలిసినచో, ఒజి సుదర్శన్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ లేదా 97017 47014, రైల్వే సిఐ 8712658585 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సుదర్శన్ తెలిపారు.

## యువతకు స్ఫూర్తి స్వామి వివేకానంద

### ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** యువకు స్ఫూర్తి ప్రధాత స్వామి వివేకానంద అని ఆ మహనీయుని అడుగు జా డల్లో యువత నడవాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అన్నారు. స్వామి వివేకానంద 162వ జయంతి సందర్భంగా నగరంలోని పాపయ్యపేట చమన్‌లో స్వా మివివేకానంద అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు రాజకీ య పా ర్టీల నాయకులు, అసోసియేసన్ సభ్యులు పాల్గొని స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సారయ్య మాట్లాడు తూ.. స్వామి వివేకానంద యువతకు ఇచ్చిన సందేశాన్ని ప్రతీ ఒక్కరూ పా టించాలన్నారు. ఆయన అడుగు జాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్వామివివేకానంద విగ్రహ దాత దివంగత రాయబారపు వెంకటేశ్వర్లు కుమారులు రాయభారపు వినోద్, ఆనంద్, దయానంద్, సుదర్శన్, పూర్ణచందర్ సో దరులు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ మాజీ మేయర్ గుండా ప్రకాష్‌రావు, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రత్నం సతీష్ షా, కుడా మాజీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్, బీజేపీ రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, శ్రీరాం శివాజీ, మాడిశెట్టి రమేశ్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కొడిమాల శ్రీనివాసరావు, ట్రాఫిక్ సిఐ రామకృష్ణ, స్వామి వివేకానంద అసోసియేషన్ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పాడి పరిశ్రమ అభివృద్ధికి పాటుపడాలి

### ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



**ప్రజాపక్షం/ నర్సంపేట :** పాడి పరిశ్రమ అభివృద్ధికి పాటుపడాలని, గ్రామాల్లో అంతరించిపోతున్న సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాలని, గ్రామాల్లో పాడి పరిశ్రమలను అభివృద్ధి చేసుకోవాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. నర్సంపేట పట్టణంలో శాంతి సేన రైతు సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పశువుల అందాల పోటీల కార్యక్రమానికి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై గేదెలను, పాడి ఆవులను, అనేక జాతులకు చెందిన పశువులను కుక్కలను, కోళ్లను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పాడి పరిశ్రమ, కూరగాయల పెంపకం అంతరించిపోతుందని గ్రామాల్లో ఆర్థిక అభివృద్ధి కోసం పాడి పరిశ్రమ, కోళ్ల పెంపకం, చేపల పెంపకం వంటి ఉపాధి అవకాశాలను కల్పించుకోవాలని, చేలలో, చెలకల్లో కూరగాయల మొక్కలను పెంచుకొని కుటుంబాలకు కొంత సహకారంగా ఉండాలని ప్రతి వస్తువు కొనుక్కునే విధంగా కాకుండా పాలు, గుడ్లు, కూరగాయలు, కోళ్లు, వంటి వాటిని ఇళ్లలోనే సమకూర్చుకోవడం ద్వారా కుటుంబాలపై ఆర్థిక భారం పడదన్నారు. అంతరించిపోతున్న సంస్కృతిని శాంతి సేన రైతు పరపతి సంఘం నిర్వహిస్తున్న కార్యక్రమాలు భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు పెండెం రామానంద్, మున్సిపాలిటి ఫ్లోర్ లీడర్, వేముల సాంబయ్య, ఎలకంటి విజయ్‌కుమార్, శాంతి సేన రైగు సంఘం నాయకుల చిలువేరు కుమారస్వామి, వెంకటేశ్వర్లు, ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు అగ్రికల్చర్ ఎ డి ఎ,తదితరులు పాల్గొన్నారు.

## అందరి జీవితాల్లో భోగభాగ్యాలు

### సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే జిఎస్ఆర్



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** తెలుగువారి సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగ అని, ఈ పండుగ అందరి కుటుంబాలల్లో భోగ భాగ్యాలు నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గ ప్రజలతో పాటు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ భోగి, సంక్రాంతి, కను మ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రజా ప్రభుత్వం నాలుగు సంక్షేమ పథకాల అమలుకు సంక్రాంతిపండుగ నాంది పలుకుతోందన్నారు. సంక్రాంతి కానుకగా రైతు భరోసాతో పాటు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల పంపిణీకి ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతున్నదని తెలిపారు. ఈ మూడు హామీలను ఈనెల 26 నుంచి అమలు చేస్తామని ఇప్పటికే సిఎం ప్రకటించారు. నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఉత్తమ నియోజకవర్గంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

## అంగరంగ వైభవంగా గోదాదేవి కల్యాణ మహోత్సవం



**ప్రజాపక్షం/కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం రామాలయంలో సోమవారం గోదారంగనాథుల కల్యాణ మహోత్సవం వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. ఆలయ ప్రాంగణంలోని కళ్యాణ మంటపంలో ఆసీనులను గావించిన కళ్యాణ ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకుల బృంద వేద మంత్రోచ్చారణాల మధ్య వైష్ణవ సంప్రదాయంలో గోదారంగనాథుల కల్యాణ ఘట్టం కన్నుల పండువగా జరిపించారు. వివిధ ప్రాంతాల నుండి తరలి వచ్చిన భక్తులు,స్థానికులు స్వామి వారి కళ్యాణమహోత్సవంలో పాల్గొని భక్తి శ్రద్ధలతో తిలకించారు. ధనుర్మాసంలో శ్రీరంగనాథుని రోజుకో పాశురం (కీర్త) చొప్పున కీర్తించి పూజలు ఆచరించిన గోదాదేవిని శ్రీరంగనాథుడు అనుగ్రహించి భోగి రోజున కల్యాణమాడినట్లు ఇతివృత్తం అనంతరం భక్తులకు ఆలయ అర్చకులు చక్కర పొంగలి, పులిహోర ప్రసాదాలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు బుర్రి శ్రీనివాస్, ఆలయ మాజీ చైర్మన్ పోత వెంకట స్వామి, మాజీ సర్పంచులు కామిడి రాం రెడ్డి, మేంగని మాధవి అశోక్, వెన్నపురెడ్డి వసంత మోహన్ రెడ్డి, స్థానికులు, భక్తులు, పాల్గొన్నారు.

## సంక్రాంతికి ఊరికి వెళ్తున్నారా.. జాగ్రత్త



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** హనుమకొండ ఎసిపి దేవేందర్ రెడ్డి ఆదేశాల మేరకు సంక్రాంతి పండుగకు ఇంటికి వెళ్లేవారు కచ్చితంగా కొన్ని జాగ్రత్తలు పాటించాలని, ఊరికి వెళ్లేవారు కచ్చితంగా ఇంటికి తాళాలతో పాటు ఇంట్లో ఉండే విలువైన బంగారు వస్తువులు బ్యాంకు లాకర్లో గాని లేదా తమతో పట్టుకు వెళ్లాలని కేయూ పోలీసులు సూచించారు. అలాగే ప్రయాణాలు చేసేటప్పుడు ఇంటి చుట్టుపక్కల తెలిసిన బంధువుల గాని తెలిసిన వ్యక్తులకు ముందుగా సమాచారం ఇవ్వాలని, ఇంటి ఆవరణలో కచ్చితంగా సి సి కెమెరాలు అమర్చుకోవాలని, ఇలా చేసుకోవడం వల్ల దొంగతనాలు జరగకుండా ఉంటాయని తెలిపారు. అజాగ్రత్త వల్ల దొంగతనాలు చేసే వారికి మనమే అవకాశం కల్పించినట్టు జరుగుతుంది కావున పోలీస్‌స్టేషన్లకు తగిన సమాచారం ఇవ్వడంతో పాటు పోలీస్ సిబ్బందిని అలర్ట్ చేయడం పాంప్లెంట్‌లు అంటించడం కాలనీ వలసలకు సమాచారం ఇవ్వడం జరిగిందని కేయూ సబ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో ప్రతి కాలనీకి సమాచారంను అందజేయడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎసిపి దేవేందర్ రెడ్డి, కెయు సిఐ రవికుమార్, ఎస్ఐ రవీందర్, కానిస్టేబుల్‌లు పాల్గొనడం జరిగిందని తెలిపారు.

## అంబరాన్నంటిన భోగి సంబురాలు



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** భోగి పండుగ సంబురాలు వాడవాడలా అంబరాన్నంటాయి. పలు కాలనీలు, కూడళ్ళలో భోగి మంటలు వేసి కొబ్బరికాయలు కొట్టి దాని చుట్టూ తిరుగుతూ భోగి పాటలు, జానపద గేయాలు పాడుతూ నృత్యాలు చేస్తూ భోగి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఒకరికొకరు భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వారివారి కుటుంబ సభ్యులు కూడా పండుగ సందర్భంగా మూడు రోజులపాటు ఉండేలా పండుగ వేడుకల్లో పాల్గొన్నారు. సంక్రాంతి పండుగ పురస్కరింపకుని సిపిఐ ఆధ్వర్యంలో ముగ్గులపోటీ నిర్వహించి సిపిఐ జిల్లా కార్యదర్శి విజయసారథి ఆధ్వర్యంలో బహుమతి ప్రధానోత్సవం చేశారు. అలాగే 13వ వార్డులో కాటా భాస్కర్ ఆధ్వర్యంలో మంగళవారం ముగ్గులపోటీలు నిర్వహిస్తున్నారు. మహబూబాబాద్ సెవెన్ హిల్స్ ప్రాంగణంలో వేకువజామునే భోగి మంటలు వేసి చిన్న పెద్దలు అందరూ కలిసి సాంప్రదాయ దుస్తులు ధరించి భోగి సంబురాల్లో పాల్గొన్నారు. మహబూబాబాద్ కాళోజి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భోగిమంటలు వేసి చిన్ననాటి ఆటల పోటీలైన బొంగరం, గోళీలు ,పరుగుపందెం, టైర్లు దొల్లించడం, తాడు లాగడం(తగ్గాఫర్) పోటీలు నిర్వహించి భోగి వేడుకలు జరుపుకున్నారు. . రాంపురం గ్రామంలో అమరజీవి ఎల్లంకి లక్ష్మి నారాయణ జ్ఞాపకార్థం సంక్రాంతి పండుగ పురస్కరించుకుని సిపిఐ, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ముగ్గులపోటీ నిర్వహించారు. ఈ పోటీలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, గార్ల ఇన్స్‌పెక్టర్ రియాజ్, గార్ల వైస్ ఎంపిపి కట్టెబోయిన శ్రీనివాస్, సిపిఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, న్యాయ నిర్ణేతలుగా వజ్రం నాగేశ్వరావు, ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు నాదెండ్ల పద్మ, బొల్ల ఉమ, వెంకట నర్సమ్మ పాల్గొన్నారు.

**గూడూరు:**గూడూరు మండలంలో ప్రజలు భోగి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం, వాసవిక్లబ్ ఆధ్వర్యంలో సోమవారం తెల్లవారుజామున గూడూరు మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలోనూ, మండలంలోని 12గ్రామ పంచాయతీల కూడళ్ళలో భోగి మంటలు వేసి పండుగను ఘనంగా జరుపుకున్నారు. గూడూరు మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఆర్యవైశ్యం సంఘం వాసవిక్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా భోగి మంటలతో వేడుకలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ నాయకులు మాట్లాడుతూ భోగి పండుగ సందర్భంగా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## మల్లికార్జున స్వామిని దర్శించుకున్న ప్రజా ప్రతినిధులు



**ప్రజాపక్షం/ఐనవోలు :** వర్ధన్నపేట నియోజకవర్గం ఐనవోలు మండల కేంద్రంలోని ప్రముఖ శైవక్షేత్రం శ్రీ మల్లికార్జున స్వామి వారి బ్రహ్మోత్సవాలు, భోగి పర్వదినం సందర్భంగా సోమవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు,వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు, రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్(టెస్కాబ్) చైర్మన్ మార్నేని రవీందర్ రావు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ వరదరాజేశ్వరరావు, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, కాంగ్రెస్ ముఖ్య నేతలతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. అంతకుముందు అతిథులకు ఆలయ కమిటీ సభ్యులు, ఈవో, పూజారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం చైర్మన్ రవీందర్ రావు ప్రజా ప్రతినిధులకు కండువాకప్పి సన్మానించి డిసిసిబి, టిజి క్యాబ్ బ్యాంక్ డైరీలు, క్యాలెండర్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు,మాజీ ప్రజా ప్రతినిధులు,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతు వ్యతిరేక నల్లచట్టాల ప్రతులు 'భోగి మంట'ల్లో దగ్ధం



**ప్రజాపక్షం/ నర్సంపేట:** గత నాలుగు సంవత్సరాల క్రితం కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన రైతు వ్యతిరేక నల్ల చట్టాలను రద్దు చేయాలని దేశ రాజధాని అయినటువంటి ఢిల్లీ కేంద్రంగా చేసుకున్న ఉద్యమంలో దాదాపు 700 మంది రైతుల ఆత్మ బలిదానాల సాక్షిగా నరేంద్ర మోడీ ప్రభుత్వం నల్ల చట్టాలను రద్దు చేస్తామని ప్రకటించిన అది నేటి వరకు కార్యరూపం దాల్చలేదని వెంటనే నల్ల చట్టాలను రద్దు చేస్తూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరల చట్టాన్ని రూపొందించాలని ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్, అఖిల భారత రైతు సంఘం ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు గట్టి కృష్ణ డిమాండ్ చేశారు. నర్సంపేట పట్టణంలోని అంబేద్కర్ సెంటర్లో అఖిల భారత రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకోని భోగిమంటలో రైతు వ్యతిరేక నల్ల చట్టాల ప్రతులను సోమవారం దగ్ధం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారులకు వచ్చినటువంటి బిజెపి మోడీ ప్రభుత్వం ఆనాడు రైతులకు ఇచ్చినటువంటి హామీలను పూర్తిగా విస్మరించిందని, తిరిగి దేశ రాజధాని సరిహద్దు ప్రాంతాలలో రైతాంగం ఉద్యమిస్తూ రైతు ఉద్యమ నేత జగ్జీత్ సింగ్ దల్లే వాలే గత 46 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నప్పటికీ, ఆ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నప్పటికీ ప్రధానమంత్రి, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి, హోంశాఖ మంత్రులు ఎవరు రైతన్న ఉద్యమం పట్ల స్పందించకపోవడం తీవ్రమైన బాధాకరమన్నారు. దేశానికి అన్నం పెడుతున్న రైతు నేడు నల్ల చట్టాల వలన ఆత్మహత్యల పాలవుతున్నారని, తక్షణమే రైతుల ప్రయోజనాలకు నష్టం కలిగిస్తున్నటువంటి కార్పొరేట్ శక్తులకు మేలు చేస్తున్నటువంటి రైతు చట్టాలను తక్షణమే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం పిఓడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి పూలక్క, అఖిల భారత రైతు సంఘం నాయకులు రమేష్, ఆకుతోట రాజు, ఎడ్ల రాజేశ్వర్, ఎర్రబెల్లి నర్సయ్య, కలకోట కుమార్, ఐఎఫ్‌టియు నాయకులు ఏసబోయిన ఐలన్న, ప్రదీప్, పిఓడబ్ల్యు నాయకులు విజయ, వీరలక్ష్మి , సులోచన, సావిత్రి, సుజాత, నిర్మల, లింగమ్మ, ప్రగతిశీల యువజన సంఘం జిల్లా నాయకులు బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్ ప్రావీణ్య



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ జిల్లా కలెక్టర్ పి . ప్రావీణ్య జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరు సంక్రాంతి పండుగను సుఖసంతోషాలతో, ఆనందోత్సావాలతో జరుపుకోవాలని కలెక్టర్ తెలిపారు. సంక్రాంతి పండుగ ప్రజలందరికి భోగభాగ్యాలు అందించాలని నూతన సంవత్సరంలో జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆనందోత్సావాలతో వెల్లివిరియాలని ఆకాంక్షిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

## పంట చేలల్లో సంక్రాంతి పండుగ..

### హనుమకొండ జిల్లా ఆరెపల్లి గ్రామంలో రైతుల ఆందోళన



**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** సంక్రాంతి పండుగను రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు కుటుంబ సభ్యులు అందరితో కలిసి అత్యంత భక్తిశ్రద్ధలతో, సంతోషంగా గడుపుకుంటున్నారు. ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారంతా స్వగ్రామాలకు రావడంతో గ్రామాలు కల కలలాడుతున్నాయి. పిండి వంటలు చేస్తూ మహిళలు, బంధు మిత్రుల అతిథ్యంలో పెద్దలు, పతంగులు ఎగరేస్తూ చిన్నారులు.. ఇలా అందరూ సంతోషంగా ఉండగా.. హనుమకొండ జిల్లాలోని ఆరేపల్లి గ్రామ రైతులు మాత్రం.. పండుగను తమ పంట పొలాల్లో జరుపుకుంటున్నారు. ఆరేపల్లి గ్రామ శివారు ఎన్ఎస్ఆర్ హాస్పిటల్ వద్ద ఇన్నర్ రింగ్ రోడ్డుకు కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ మాస్టర్ ప్లాన్ ప్రకటించింది. దానిని ప్రభుత్వం గతంలో ఖరారు చేసింది. అయితే అక్కడ అధికార పార్టీతో పాటు గత ప్రభుత్వంలో కీలక నేతగా వ్యవహరించిన ప్రతిపక్ష పార్టీకి చెందిన నేతకు సంబంధించిన భూములు ఉన్నాయి. నేతలకు చెందిన వ్యాపార, విద్యా సంస్థలు, నిర్మాణంలో ఉన్న విల్లా ప్రాజెక్టులు ఉన్నాయి. ప్రభుత్వం ముందుగా ప్రకటించిన మాస్టర్ ప్లాన్ లో వారు భూములు కోల్పోతున్నందున.. ఏకంగా మాస్టర్ ప్లాన్ నే మార్చేశారు. దీంతో అనేక మంది రైతులు జీవనాధారంగా ఉన్న తమ భూములను కోల్పోతున్నారు. ఆశాస్త్రీయంగా రూపొందించిన కొత్త మాస్టర్ ప్లాన్ తో.. ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నా.. అధికారులు మాత్రం నేతల ఒత్తిళ్లతో.. కొత్త మాస్టర్ ప్లాన్ వైపే మొగ్గు చెబుతున్నారు. ముందుగా ప్రకటించిన మాస్టర్ ప్లాన్ కాకుండా కొత్తది అమలు చేస్తే.. తాము భూములు కోల్పోతున్నామంటూ స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారంతా కలిసి గత రెండు నెలలుగా అధికారుల ముందు తమ గోడు వెళ్ళగక్కుతున్నారు. జిల్లా కలెక్టర్,ఆర్‌డిఒ , స్థానిక ఎంఎల్‌ఏ, జిల్లా ఇన్చార్జి మంత్రి లను కలిసిన అధికారులు స్పందించడం లేదని, నేతలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ తీరుపై నిరసనలో భాగంగా.. భూములు కోల్పోతున్న రైతులంతా సోమవారం సంక్రాంతి పండుగను తమ పంట పొలాలలో జరుపుకున్నారు.

కుటుంబ సభ్యులందరితో కలిసి అక్కడే పిండి వంటలు చేసుకుంటూ తమ నిరసన వ్యక్తం చేశారు. ఇంటికి వచ్చిన బం ధువులను సైతం పొలానికి తీసుకు వచ్చి వారితో అక్కడే గడుపుతున్నారు. జీవన ఆధారంగా ఉన్న తమ భూములను లాక్కుంటే.. తమ కుటుంబాలు రోడ్డు పాలు అవుతాయని, పిల్లల చదువులు నిలిచిపోతాయని తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇన్నర్ రింగ్ రోడ్డు కోసం ప్రభుత్వం ముందుగా ప్రకటించిన మాస్టర్ ప్లాన్ ని అమలు చేయాలని, కొత్త మాస్టర్ ప్లాన్ ను వెంటనే రద్దు చేయాలని ఆరేపల్లి రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

# యువతరంగం

## ఫోకస్



# ఇది 'పరీక్షా' సమయం!

ఒకొక్కటిగా వార్షిక పరీక్షల తేదీలు వెలువడుతున్నాయి. ప్రైమరీ క్లాసుల నుంచి పోస్టు గ్రాడ్యుయేషన్ వరకూ అందరిలోనూ టెన్షనే. విద్యార్థులందరికీ ఇది నిజమైన 'పరీక్షా సమయం'. పిల్లల భవిష్యత్తు ఏమైపోతుందోనన్న భయం తల్లిదండ్రులది. ప్రైవేటు పాఠశాలు, కళాశాలల యాజమాన్యాల పోటీ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఒకవైపు పరీక్షల భయం... మరోవైపు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఒత్తిడి కలగలిసి విద్యార్థులను ఉక్కిరిబిక్కిరి చేయడం సహజం. సాధారంంగానే, పరీక్ష అంటేనే ఒక రకమైన ఒత్తిడి పెరుగుతుంది. మంచి ఫలితాలు సాధించాలనే ఆశావహ మానసిక ఒత్తిడి లేదా పాజిటివ్ స్ట్రెస్ ఉన్న యువత పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను పొందుతారు. పరీక్షలకు తయారు అవుతున్న విద్యార్థులు అతిగా ఆలోచిస్తూ, ఏమవుతుందో అనే అనవసర ఆందోళనలు, తీవ్రమైన నెగెటివ్ ఒత్తిడులు పరీక్షల్లో ఫలితాలను తారుమారు చేస్తాయని తెలుసుకోవాలి. విద్యార్థులపై తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, సహచర విద్యార్థుల ప్రభావం కూడా పరీక్షల ఒత్తిడిని పెంచుతుందని గమనించాలి. పరీక్షల్లో తాహత్తుకు మించి అత్యుత్తమ ఫలితాలు సాధించాలని లక్ష్యం పెట్టుకున్న యువతలో 'పరీక్షల ఆందోళన' తారస్థాయికి చేరి ఫలితాలను మరింత ప్రతికూలంగా ప్రభావితం చేస్తాయి. గత పరీక్షల్లో పొందిన మార్కులు లేదా ర్యాంకుల కన్న కొంతైనా మెరుగైన ఫలితాలను సాధించాలనే ఆచరణయోగ్య లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. మన శక్తి సామర్థ్యాలకు మించి మార్కులు లేదా ర్యాంకులు రావాలని ఆశపడడం వల్ల మన చదువులపై ప్రతికూల ప్రభావాలు పడడంతో పాటు గతం కన్న తక్కువ స్థాయిలో ఫలితాలు వస్తాయి.

పరీక్షలంటే అనవసర ఆందోళనలు మన శారీరక, భావోద్వేగ ప్రతికూలతలకు దారి తీస్తాయి. ముఖ్యంగా తల్లి తండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలపై అతిగా ఆశలు పెట్టుకోవడం, సహచరుల ఫలితాలను చూసి ఆత్మన్యూనతకు గురి కావడం సాధారణంగా జరుగుతుంది. ప్రతికూల ఒత్తిడి పెరిగిన యువతలో ఏకాగ్రత సడలడం, ఆందోళనలు పెరిగి ఎక్కువ సమయం చదవకపోవడం జరుగుతుంది. పరీక్షలంటే భయం పెరిగిన యువతలో శారీరకంగా అతిగా చెమటలు పట్టడం, వాంతులు, జీర్ణ సంబంధ సమస్యలు, గుండె వేగం పెరగడం, శ్వాస మందగించడం, తల నొప్పి, కోపం పెరగడం, అధిక బీపీ, ప్రతికూల ఆలోచనలు వెంటాడడం, భయ దాడి (పానిక్ అటాక్) లాంటి అవలక్షణాలు కనుపిస్తాయి. భావోద్వేగ ఆందోళన వల్ల అభద్రతా భావం, తన శక్తి మీద నమ్మకం తగ్గడం, నిస్సహాయ స్థితి, ఏదో తెలియని లోపం వెంటాడడం, ప్రతికూల స్వయం భావనలు, అనవసర ఆలోచనలు వెంటాడడం, నిరాశ నిస్పృహాలు మేలుకొనడం లాంటి మానసిక ప్రతికూల లక్షణాలు బయట పడతాయి. వీటికి తోడుగా ఏకాగ్రతకు భంగం కలగడం, చంచలత్వం, వాయిదా వేసే ప్రవృత్తి పెరగడం, ఇతర సహచరులతో అనవసరంగా పోల్చుకోవడం, నిద్ర లేమి సమస్యలు ఉత్పన్నం కావడం సాధారణంగా కనిపిస్తుంది.

రాబోయే పరీక్షలకు ముందుగానే ప్రణాళికలు తయారు చేసుకొని చదవడం ప్రారంభించాలి. పరీక్షా ఫలితాల పట్ల అనవసర ఆలోచనలు మన ఏకాగ్రతను మింగేస్తాయి. సబ్జెక్టుల వారీగా ప్రణాళికలు రాసుకొని ప్రాధాన్యతాక్రమంలో చదవడం మంచిది. చదివిన పాఠాలు ఎంత వరకు గుర్తు ఉన్నాయో తెలుసు కావడానికి స్వయం పరీక్షలు రాయాలి. చదువుతున్న సమయంలో గంట లేదా రెండు గంటకు ఒకసారి స్వల్ప విరామం తీసుకోవడం, దీర్ఘ శ్వాసలు తీసుకోవడం ఏకాగ్రతను మెరుగు పరుస్తాయి. గత పరీక్షలో పొందిన మార్కుల కన్న ఎక్కువ రావాలనే లక్ష్యాలు మంచి ఫలితాలను ఇస్తాయి. నిన్నటి కన్న నేడు మెరుగైతే మనం ప్రగతి బాటన నడిచినట్లే అని నమ్మాలి. మన మీద మనకు నమ్మకం ఉండాలి. మనం చదివే చదువుపై అనవసర ప్రతికూల ఆలోచనలకు స్వస్తి పలకాలి. నా శక్తివంచన మేరకు చదువుతున్నాను, నేను మంచి ఫలితాలను సాధింగలను, నేను అనుకున్న ఫలితాలు పొందకపోయినా రానున్న పరీక్షల్లో మెరుగు పరుచుకోగలను లాంటి ఆత్మవిశ్వాసాన్ని పెంచే ఆశావహ ఆలోచనలు మన ప్రతిభను పెంచుతాయి. దినచర్యను నిర్ణయించుకొని, మధ్య మధ్య పాలు లేదా టీ లాంటివని తాగుతూ మానసిక ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయాలి. చదవడాన్ని వాయిదా వేయవద్దు. మధ్య మధ్య ధ్యానం చేయడం అలవాటు చేసుకోవాలి. చదువుతున్న పాఠంలోని ముఖ్య అంశాలను అండర్‌లైన్ చేసుకోవడం మంచిది. గ్రాఫ్‌లు, లెక్కలు, దయాగ్రామ్స్, సూత్రాలు, సమీకరణాలు లాంటి అంశాలను చదివే సందర్భంలో రాసుకుంటూ చదవడం మంచిది. ఒక సారి రాస్తే పది సార్లు చదివినట్లే అని తెలుసుకోవాలి. కఠినమైన అందాలంటూ పక్కన పెట్టడం మంచిది కాదు. ప్రతి రోజు కొన్ని నిమిషాలు శారీరక వ్యాయామానికి కేటాయించండి. అవసరమని భావించినపుడు మీకు ఇష్టమైన టీచర్ లేదా సలహాదారుతో మాట్లాడండి. చక్కెరలు అధికంగా ఉన్న ఆహారానికి దూరంగా ఉండండి.

## పరీక్ష రోజు, తర్వాత తీసుకోవలసిన జాగ్రత్తలు



పరీక్ష రోజున కనీసం 15 నుంచి 30 నిమిషాల ముందు పరీక్ష కేంద్రానికి చేరే విధంగా ప్రణాళిక వేసుకోవాలి. పరీక్షకు వెళ్లే ముందు అతిగా తినడం మంచిది కాదు. ప్రోటీన్లు అధికంగా ఉన్న నట్స్, గింజలు, చేపలు లాంటి ఆహారం పరిమితంగా తీసుకొండి. అవసరమనించినపుడు కొద్దిపాటి నీరు తాగండి.పరీక్షకు ముందు రోజు సమయానికి నిద్రపోవాలి. సమయానికి చేరలేమేమో అనే ఆందోళనలు మన ఏకాగ్రతకు భంగం కలిగిస్తాయి. పరీక్ష హాలుకు తీసుకుపోవలసిన హాల్ టికెట్, పెన్నులు, పెన్సిల్‌లు, ఇతర సామాగ్రిని ముందుగానే సిద్ధం చేసుకోవాలి. ఒక్క నిమిషం ఆసలస్యం అయినా పరీక్ష హాల్‌లోకి అనుమతించరని గుర్తుంచుకోవాలి. పరీక్ష హాల్‌లో ఒత్తిడి పెరిగినట్లు అనిపిస్తే ఒకటి రెండు నిమిషాలు కళ్లు మూసుకొని, నిశ్శబ్దం పాటించి, దీర్ఘ శ్వాసలు కొన్ని తీసుకొని వదలడం చేసిన తర్వాత మళ్లీ రాయడం మొదలు పెట్టండి. పరీక్షలో సమాధానాలు రాస్తున్నపుడు సమయపాలన పాటించండి. చివరి నిమిషాల్లో ఆందోళనలు పెరిగే పనులు చేయవద్దు. పరీక్షల్లో రాసేటప్పుడు ఇతర సహచరుల వైపు చూడవద్దు. మార్కులను బట్టి ఏ ప్రశ్నకు ఎంత సమయం కేటాయించాలో నిర్ణయించుకొండి. కనీసం 10 15 నిమిషాల ముందు రాయడం పూర్తి చేసి, ఏం రాసామో, ఎలా రాసామో పేపర్‌ను తిరగేసి పరిశీలించండి. ఒకటి రెండు చిన్న ప్రశ్నలకు సమాధానాలు సరిగ్గా రాయకపోయినా దాని గురించి అనవసర ఆందోళన చెందితే రాబోయేపరీక్షలపై దాని ప్రతికూల ప్రభావం పడుతుందని మరువరాదు.

నీపై నీకు నియంత్రణ ఉండే విధంగా చూసుకోవాలి. పరీక్ష పూర్తి అయిన తర్వాత ఎలా రాసామో అంచనా వేయవచ్చుగాని, అతిగా దాని గూర్చి ఆలోచించవద్దు.

## తల్లిదండ్రుల పాత్ర కీలకం

పరీక్షల పట్ల ఆశావహ ఆలోచనలు మెరుగైన ఫలితాలను అందిస్తాయని, నేను మంచిగా రాయగలను, ఉత్తమ ఫలితాలను సాధించగలనూ అనే ఆలోచనలు మన ప్రతిభకు ఊతం ఇస్తాయి. శక్తివంచన మేరకు కృషి చేయడం, పరీక్షలను చక్కగా రాయడం, ఫలితాల పట్ల ముందే అతిగా ఆశలు పెట్టుకోవడం మానండి. ఆత్మవిశ్వాసం పెంచే విధంగా మన మీద మనకు నమ్మకం కలిగి ఉండాలి. తల్లితండ్రులు పిల్లలను అనవసర ఆందోళనలకు గురి చేయవద్దు. శక్తికి మించిన భారాన్ని మోపవద్దు. సమతుల ఆహారం ఇవ్వండి. ఇతర పిల్లలతో పోల్చడం మానేయండి. ప్రేరణాత్మక వాతావరణం కల్పించండి. మార్కులు అతిగా రావాలని ఇబ్బంది పెట్టకండి. ఉత్తమ పుస్తకాలు, చదివే వాతావరణం, కుటుంబ ప్రశాంతత, ఏకాగ్రత పెంచే సౌకర్యాల కల్పన చేయడం మరువరాదు. మన పిల్లల శక్తిసామర్థ్యాలను తెలుసుకొని వారికి మార్గనిర్దేశనం చేయడండి. పరీక్షలు అంటే బ్రహ్మ విద్య కాదని, నీ జ్ఞాపక శక్తికి ఒక పరీక్ష అని, దానితోనే జీవితం ముడిపడి ఉందనే భావనలను చెరిపేస్తూ, జీవితాంతం ఒకదాని తర్వాత మరొక పరీక్ష ఉంటుందని తెలుసుకోవాలి. పరీక్షలే జీవితం కాదని, జీవితంలో పరీక్షలు ఒక చిన్న భాగమని పిల్లలకు ధైర్యం నూరి పోద్దాం, వారి ఎదుగుదలకు మన అవసర చేయూతను అందిద్దాం.



## మార్గదర్శకుడు టెర్రీ ఫాక్స్



కెనడా అథ్లెట్ టెర్రీ ఫాక్స్‌ను యువతరానికి మార్గదర్శకుడిగా చెప్పుకోవాలి. అథ్లెటిక్స్‌లోని విభిన్న విభాగాల్లో అసాధారణ ప్రతిభ కనబరచిన టెర్రీని దురదృష్టం వెంటాడింది. బోన్ కేన్సర్ కారణంగా వైద్యులు అతని కుడి కాలు తీసేశారు. అప్పటికి టెర్రీ వయసు కేవలం 18 సంవత్సరాలు. జీవితంలో కోలుకోలేని దెబ్బతగిలినప్పటికీ, అతను బాధపడలేదు. భయపడలేదు. తన మాదిరిగానే జీవన్మరణ సమస్యను ఎదుర్కొంటున్న కేన్సర్ బాధితులకు సాయం చేయడానికి నిధులు సేకరించాలని నిర్ణయించాడు. అట్లాంటిక్ మహాసముద్రం నుంచి నీటిని తీసుకొని, దానిని కెనడాలోని వేరు వేరు ప్రాంతాల మీదుగా తీసుకెళ్లి పసిఫిక్ మహాసముద్రంలో కలపాలన్నది అతని ఆలోచన. నడవడమే కష్టంగా మారిన అతనికి, వేలాది కిలోమీటర్లు పరిగెత్తడం అసాధ్యమని వైద్యులు స్పష్టం చేశారు. అయితే, ఎట్టి పరిస్థితుల్లోనూ అనుకున్న పనిని పూర్తి చేయాలన్న పట్టుదలతో టెర్రీ రాత్రి సమయాల్లో ప్రాక్టీస్ కొనసాగించాడు. 1కెనడా తూర్పు తీరం నుంచి పరుగును ప్రారంభించాడు. రోజుకు 42 కిలోమీటర్ల చొప్పున 143 రోజులు అవిశ్రాంతంగా పరిగెత్తి 5,373 కిలోమీటర్ల దూరాన్ని పూర్తి చేశాడు. అయితే, అప్పటికీ కేన్సర్ అతని ఊపిరితిత్తులకు వ్యాపించడంతో, బలవంతంగా పరుగును నిలిపివేయాల్సి వచ్చింది. వైద్య సేవలు పొందుతూ, 1981లో తన 23వ ఏట టెర్రీ చనిపోయాడు. కేన్సర్ తన ప్రాణాలను కబళిస్తున్నదని తెలిసినప్పటికీ, పూర్తిగా కదలలేని స్థితికి చేరే వరకూ అవిశ్రాంతంగా లక్ష్యం దిశగా పరిగెత్తిన టెర్రీ సిసలైన యూత్ ఐకాన్.

## యూత్ ఐకాన్స్

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపచేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..



ఆంటారియో (కెనడా)లోని థండర్ బే వద్ద టెర్రీ ఫాక్స్ విగ్రహం.. లక్షలాది మంది యువతీయువకులకు స్ఫూర్తిదాయకం..

---

## సమాజానికి ఉపాధ్యాయులే.. మార్గనిర్దేశకులు

### ఎస్‌టియు క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** సమాజానికి ఉపాధ్యాయులే మార్గనిర్దేశకలని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం క్యాంప్ కార్యలయంలో స్టేట్ టీచర్స్ యూనియన్ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటిబాలలను రేపటి నవభారత నిర్మాతలుగా తయారు చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డిని ఎస్‌టియు జిల్లా కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.భూమన్న యాదవ్, జె.లక్ష్మ ణ్, నాయకులు జుట్టు గజేందర్, గంగాధర్, ఇర్ఫాన్‌శేఖ్, యం.శ్రీనివాస్, బి.వెంకటేశ్వర్‌రావు, లక్ష్మి నారాయణ,ఖాలిద్ అహ్మద్, దిగంబర్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల గొంతుకగా 'ప్రజాపక్షం'కు అత్యంత ప్రజాదరణ

### క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే బాలునాయక్



**ప్రజాపక్షం/దేవరకొండ :** ప్రజా సమస్యలను ఎలుగెత్తి చాటుతూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం 'ప్రజాపక్షం' దినపత్రిక పనిచేస్తూ ప్రజాదరణ పొందుతుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 'ప్రజాపక్షం' తెలుగు జాతీయ దినపత్రిక 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే బాలునాయక్ ముఖ్య అతిధిగా హాజరై ఆవిష్కరించారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తున్న ('ప్రజాపక్షం' అతి తక్కువ సమయంలోనే ప్రజాదరణ పొంది ప్రజల మన్ననలు పొందుతూ తనదైన స్థానాన్ని సంపాదించుకున్నదన్నారు. ప్రజల చైతన్యం కోసం ప్రజాపక్షం పత్రిక పనిచేస్తుందని, ప్రజలు మరింతగా ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, జిల్లా సమితి సభ్యులు బుచ్చిరెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు రాంసింగ్, నియోజకవర్గ అధ్యక్షులు హరికృష్ణ, బాబురాం, ప్రజా పక్షం నియోజకవర్గ ఇంచార్జీ దర్శనం విష్ణు, చందంపేట రిపోర్టర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల్లో సృజనాత్మకతకు చిహ్నాలు రంగవల్లులు

### సిపిఐ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్





**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** మహిళల్లో సృజనాత్మకతకు చిహ్నాలు రంగవల్లులని సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. సిపిఐ శత జయంతి ఉత్సవాల సందర్భంగా 25వ వార్డు కారల్ మార్క్స్ కాలనీలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు క్యాతరాజు సతీష్ ఆధ్వర్యంలో సోమవారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో 250 మంది మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాజ్‌కుమార్ విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడుతూ ఆరు సంవత్సరాల నుంచి 25వ వార్డులో సంక్రాంతి ముగ్గుల పోటీలు ఏర్పాటు చేయడం అభి నందనీయమన్నారు. ముగ్గుల పోటీల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని తమలోని ప్రతిభను ముగ్గుల ద్వారా బయటపెట్టారన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ముఖ్యంగా క్రీడల్లో, చదువుల్లో, రాజకీయాల్లో తమ ప్రతిభను చాటాలన్నారు. మహిళల్లో ఉన్న నైపుణ్యాన్ని చాటి చెప్పేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమం నిర్వహించినందుకు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు క్యాథరాజు, సతీష్ కు, సిపిఐ 25వ శాఖకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి సొత్తుకు ప్రవీణ్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చంద్రమౌళి, వేముల శ్రీకాంత్, జోసెఫ్, మాజీ కౌన్సిలర్ రేగుల రాకేష్, డిహెచ్పిఎస్ జాతీయ సమితి సభ్యులు పొన్నగంటి లావణ్య, సిపిఐ 25వ వార్డ్ సహాయ కార్యదర్శి యాకూబ్ పాషా, తిరుపతి, పల్లెల రజిత, నాగచందనతో పాటు కాలనీ వాసులు తిరుపతి రెడ్డి, పల్లెర్ల రాజు, శ్రీధర్, స్వామి, మహేష్, నిరంజన్, తిరుమల చారి పాల్గొన్నారు.

### మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలి

**మహబూబాబాద్ :** సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథి రెడ్డి అన్నారు. మహబూబాబాద్ 27వ వార్డులో భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో మహిళలే కీలకమన్నారు. ఈ రోజుల్లో చదువుల్లోనూ మహిళలే అగ్రస్థానంలో ఉన్నారని కొనియాడారు. సంప్రదాయాలను గౌరవించడంలో మహిళలు ముందుండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మహిళల్లో నైపుణ్యాన్ని వెలికి తీయడానికి బతుకమ్మ సంబురాలు, సంక్రాంతి ముగ్గుల పోటీలు దోహదపడతాయన్నారు. మహిళలను ప్రోత్సహించేందుకు ఇటువంటి కార్యక్రమాలు సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గెలుపొందిన విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా నూకల గీతారెడ్డి, రాజకుమారి వ్యవహరించారు. కార్యక్రమంలో పెరుగు కుమార్ రేషపల్లినవీన్,మామిండ్ల సాంబలక్ష్మి, వెలుగు శ్రావణ్, చీదిరాల జ్ఞానేశ్వర్, ఆబోతు అశోక్,జలగం ప్రవీణ్, మద్దినేని నర్సయమ్మ, జూలకంటి వేణు, శ్రీనాథ్, హర్షవర్ధన్, శ్యాం ప్రసాద్ యాదవ్, రమేష్, మంద శంకర్ తదితరులు పాల్గొన్నరు.

**కాజీపేట :** హనుమకొండ జిల్లాలోని కాజీపేట మండలం 63వ డివిజన్‌లో ఆరుట్ల రామచంద్రారెడ్డి కాలనీ ఏఆర్ ఆర్ కాలనీ లో భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐ డబ్ల్యు) ఆధ్వర్యంలో ఘనంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. సిపిఐ శాఖ కార్యదర్శి, ఎన్ఎఫ్ఐ డబ్ల్యు మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు రాసమల్ల దీన ఆధ్వర్యంలో సంక్రాంత్రి పండుగ సందర్భంగా జరిగిన ఈ ముగ్గుల పోటీల కార్యక్రమానికి సిపిఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాలలో ముందుండాలని అన్నారు. మహిళలకు సమాన అవకాశాలు కల్పించినపుడే మహిళలు అన్ని రంగాలలో ముందు ఉంటారని, ఇటీవల క్రీడలలో పోటీతోత్వంలో ముందుకు వస్తున్నారని అన్నారు. దేశంలో చట్టసభలలో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని, చదువుల్లో విద్యార్థులు ముందుకు దూసుకుపోవాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అన్నారు. కార్యక్రమంలో సిపిఐ కాజీపేట మండల కార్యదర్శి మునిగాల బిక్షపతి, సహాయ కార్యదర్శి మాలోత్ శంకర్, బిఓసి బిల్డింగ్ నిర్మాణ కన్స్ట్రక్షన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాసమల్ల కుమార్, బండ్లోజు రాజమణి పాల్గొన్నారు. ఈ ముగ్గుల పోటీల్లో 15 మంది పాల్గొనగా వారికి ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు.

**నర్సంపేట :** దేశంలో కష్టజీవుల రాజ్యం కోసం ఏర్పడిన సిపిఐ పార్టీ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా, సంక్రాంతి పండుగ పురస్కరించుకుని నర్సంపేట మాధన్నపేట రోడ్డులోని సిపిఐ కాలనీలో జాతీయ మహిళా సమాఖ్య, ఏఐవైఎఫ్, బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు.ఈ ముగ్గుల పోటీలు కవిత అధ్యక్షతన నిర్వహించగా ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పంజాల రమేష్ హాజరై ప్రసంగించారు. సమైక్య జీవన సౌందర్యంలో భాగంగానే జనవరి మాసంలో వచ్చే సంక్రాంతి పండుగ ప్రకృతి ఆరాధన, ముగ్గులు, గొబ్బెమ్మలతో, అల్లుళ్ల కూతుళ్లతో ప్రతీ గ్రామీణ కుటుంబంలో సంతోషాలు వెల్లివిరుస్తుందన్నారు. ఆధునిక సమాజంలో పండుగలు జరుపుకొంటున్నా, నేడు ఆ నిండుదనం కొరవడుతుందన్నారు. రైతు కూలీలు ఘనంగా జరుపుకొనే ఈ సంక్రాంతి పండుగ రోజు ముగ్గుల పోటీలు జరగడానికి సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు, అనంతరం మొదటి బహుమతి ఐత శ్రీకళ , రెండవ బహుమతి గడ్డం సంతోష, మూడవ బహుమతి శ్రీలతలకు షీల్డ్ లు, నగదు బహుకరించారు. ముగ్గుల పోటీలో పాల్గొన్న వారందరికీ బహుమతులను అందజేశారు.






కార్యక్రమంలో నాయకులు అక్కపెల్లి రమేష్, జిల్లా మహిళా కార్యదర్శి చంద్రకళ, చింతకింది కుమారస్వామి, గోవర్ధనాచారి, మునుశ్వర్, యాదయ్య, వెంకన్న, సందీప్ తదితరులు పాల్గొన్నారు






## అందరి జీవితాల్లో సంక్రాంతి సుఖశాంతులు నింపాలి : కూనంనేని



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఈ సంక్రాంతి పర్వదినం అందరి జీవితాల్లో సుఖశాంతులు నింపాలని కొత్తగూడెం ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆకాంక్షిస్తూ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు ఆరోగ్యం, ఐశ్వర్యం, ఆనందం నిండిన జీవితందక్కాలని, పండుగను కుటుంబ సభ్యులు, స్నేహితులు కలిసికట్టుగా సంతోషాన్ని పంచుకోవాలన్నారు. రైతులు, కార్మిక సంక్షేమం, విద్య, వైద్యం అభివృద్ధి వంటి అంశాల్లో నియోజకవర్గం ముందడుగు వేయడంలో నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. పండుగ వేళ ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## భోగి వేడుకల్లో మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/కూసుమంచి :** మండల కేంద్రంలో సోమవారం పాలేరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భోగిమంటలు నిర్వహించారు. భోగి వేడుకల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆయన సతీమణి పొంగులేటి మాధురిలకు గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసు కీర్తనలు, లబండా సంప్రదాయ నృత్యం, డప్పు చప్పులతో స్వాగతం పలికారు. వేడుకలకు ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి తో పాటు భారీగా పాలేరు, ఖమ్మం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి పండుగ సకల శుభాలు కలగచేయాలని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి ఆకాంక్షించారు.

## బౌద్ధ క్షేత్రం వద్ద కనీస సౌకర్యాలు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** దక్షిణ భారతదేశంలో కెల్లా అతిపెద్ద బౌద్ధ క్షేత్రం వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని బౌద్ధ భిక్షువు బంతేజి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బౌద్ధ క్షేత్రం వద్ద బుద్ధ పౌర్ణమి సందర్భంగా బుద్ధ ప్రవచనాలను తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బౌద్ధ క్షేత్రం వద్ద కనిస సౌకర్యాలు త్రాగు నీరు, మరుగుదొడ్లు సౌకర్యలను కల్పించాలి అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం బౌద్ధ క్షేత్రం పై ప్రత్యేక నిధులు తో అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఎస్ ఐ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పెద్దపాక వెంకట్, బిఎస్ ఐ మండలం నాయకులు పగిడికత్తుల ఈదయ్య, బొడ్డు బాబురావు, వెంకన్న, నవీన్, వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రజాపక్షం' క్యాలెండర్ ఆవిష్కరణ




**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** లక్ష్మీదేవిపల్లి పోలీస్‌స్టేషన్ నందు సోమవారం ప్రజాపక్షం 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎస్సై రమణారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను చైతన్యవంతం చేస్తూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా 'ప్రజాపక్షం' దినపత్రిక పనిచేస్తుందన్నారు. నేటి సమాజంలో జరుగుతున్న అవినీతిని, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న పత్రిక సేవలు వెలకట్టలేనిదన్నారు. కార్యక్రమంలో ప్రజాపక్షం రిపోర్టర్ చంద్రగిరి ప్రసాదరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కోడి పందేల స్థావరాలపై దాడులు

**ప్రజాపక్షం/ఖమ్మం :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మండలం మెట్లగూడెం వద్ద జరుగుతున్న కోడి పందేలపై పోలీసులు దాడి చేశారు. పెద్ద మొత్తంలో నగదు, సెల్‌ఫోన్లు, కోళ్లను స్వాధీనం చేసుకుని ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం కోడి పందేల నిర్వహణపై ఆంక్షలు విధించిన నేపథ్యంలో కోడి పందేలు నిర్వహించే వారిపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. దాడిలో రూ.60 వేల నగదు, 18కోళ్లు, ఎనిమిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

## మహిళల్లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకే ముగ్గుల పోటీలు

ఎస్‌టియు నాయకులు గడల భాస్కర్‌రావు



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిదిలోని తనికెళ్లలో సిపిఐ గ్రామశాఖ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే సంక్రాంతి ముగ్గుల పోటీల్లో భాగంగా ఈసంవత్సరం కూడా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. సిపిఐ కార్యాలయం ఎదుటు, బిసి కాలనీ రామాలయం దగ్గర సెంటర్‌లలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. సిపిఐ కార్యాలయం ఎదుటు నిర్వహించిన ముగ్గుల పోటీల్లో 90 మంది మహిళలు పాల్గొనగా రామాలయం దగ్గర ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల్లో 30 మంది మహిళలు పాల్గొన్నారు. మొత్తం 120 మంది మహిళలు సోమవారం ముగ్గులపోటీల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎస్‌టియు ఉపాధ్యాయసంఘం నాయకులు గడల భాస్కర్‌రావు మాట్లాడుతూ మహిళల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు ముగ్గులు పోటీలు దోహదపడతాయన్నారు. సిపిఐ కార్యాలయం వద్ద నిర్వహించిన పోటీలకు న్యాయనిర్ణేతలుగా పెదమళ్ల సత్యనారాయణ, మేకల శ్రీనివాసరావు, పెదమళ్ల విద్యాసాగర్ రామాలయం దగ్గర నిర్వహించిన పోటీలలో న్యాయనిర్ణేతలుగా లేడిబోయిన కళావతి, పేరసాని సుధాశివకుమారి వ్యవహరించారు. కార్యక్రమలో సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు, పివిరావు, కవిడ వీరభద్రం, ఉపాధ్యాయసంఘం నాయకులు లేడిబోయిన గోపాల్‌రావు, యాసా సత్యం, పిన్నం పుల్లయ్య, కొర్లపాటి సీతారామయ్య, పసుమర్తి సత్యనారాయణ, బాసా నాగరాజు, బాణోత్ రామారావు, పొట్లపల్లి నరేష్, భూక్యా భాస్కర్ పాల్గొన్నారు.

# పారదర్శకంగా అర్హులకు సంక్షేమపథకాలు

లబ్ధిదారుల వివరాలతో ఫ్లెక్సీల ఏర్పాటు

సమీక్షా సమావేశంలో

ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రులు




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పారదర్శకంగా అర్హులకు ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా లబ్ధి చేకూర్చాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. సోమవారం ఖమ్మం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్లు కార్యక్రమాల అమలుపై ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, జిల్లా ఇంచార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్రమంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు ముజమ్మిల్ ఖాన్, జితిష్ వి పాటిల్ తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి మాట్లాడుతూ ప్రజాప్రభుత్వం వచ్చిన తర్వాత అనేక చారిత్రాత్మక పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ప్రతి పథకంపై సంపూర్ణంగా చర్చించి మార్గదర్శకాలు జారీ చేస్తున్నామన్నారు. రైతు భరోసాకు సంబంధించి వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు రూ. 12వేలు ఆర్థిక సాయం అందించడం జరుగుతుందన్నారు. ఉపాధి హామీ జాబ్ కార్డు ఉండి, భూమి లేని వ్యవసాయ కుటుంబాలు 20 రోజులు ఉపాధి హామీ పని చేసినట్లయితే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలవుతుందన్నారు. ప్రతి పథకానికి సంబంధించి గ్రామసభ పెట్టి లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలన్నారు. ఇందిరమ్మ కమిటీల సభ్యులను భాగస్వామ్యం చేయాలన్నారు. ఎంతమంది రైతులకు ఎంత రుణమాఫీ జరిగింది, ఎంత మందికి రైతు భరోసా వస్తుంది, బోనస్ వచ్చిన రైతుల వివరాలు తెలియజేస్తూ గ్రామాల్లో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని ఉపముఖ్యమంత్రి తెలిపారు. ఖమ్మంజిల్లా ఇంచార్జి, రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడు తూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పలు గ్యారెంటీ పథకాలను అమలు చేశామన్నారు. పేద ప్రజలకు అత్యంత చేరువయ్యే రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్ కార్డుల జారీ కార్యక్రమాలను జనవరి 26 నుంచి అమలు చేయబోతున్నామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు చేరడం ఎంత ముఖ్యమో అనర్హులకు అందకుండా చూడటం కూడా కీలకమన్నారు. భూసేకరణ జరిగిన భూములు, రాళ్లు, రప్పలు ఉన్న భూములు కాకుండా వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా అందుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రేషన్‌కార్డులు అందలేదని అర్హులందరికీ ప్రస్తుతం రేషన్ కార్డులు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడలేనివిధంగా తెలంగాణలో భారీగా నిధు లు ఖర్చుచేస్తూ ప్రజలకు సంక్షేమ పథకాలన ప్రజాప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. ఈ అంశాన్ని ప్రజల దృష్టికి అధికారులు, ప్రజాప్రతినిధులు తీసుకెళ్లాలన్నారు. నూతన రేషన్ కార్డుల జారీ, కార్డులలో నూత న సభ్యుల నమోదు వివరాలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 3,500 ఇండ్ల చొప్పున 4.50 లక్షల ఇండ్లు మొదటి విడతలో పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ అధికారులు అప్రమత్తంగా ఉంటూ వ్యవసాయ యోగ్యం కాని భూములకు ఎక్కడ పెట్టుబడి సాయం చేరవద్దని తెలిపారు. ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి అర్హునికి సాయం అందేలా చూడాలన్నారు. లేఅవుట్, నాలా, భూసేకరణ, పరిశ్రమల, మైనింగ్ భూముల సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ గ్రామ శాటిలైట్ మ్యాప్ వాడుతూ పారదర్శకంగా అర్హుల ఎంపిక ఉండాలన్నారు. వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు పంట వేసినా వేయకపోయినా రైతు భరోసా అందుతుందన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా క్రింద భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబానికి రూ. 12వేల ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ సందర్భంగా నాలుగు పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందని దీనికి సంబంధించిన విధి విధానాలను క్యాబినెట్ ఆమోదించిందన్నారు. ప్రభుత్వ ఆలోచనలను అధికారులు పక్కాగా అమలు చేయాలని, ఎక్కడ ఎటువంటి తప్పు జరగడానికి వీలు లేదని తెలిపారు. నాలుగు కార్యక్రమాలకు సంబంధించి గ్రామసభలు నిర్వహించి అర్హుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలన్నారు. సమావేశంలో ఎంపిలు రామసహాయం రఘురాంరెడ్డి, బలరాం నాయక్, అదనపు కలెక్టర్ డా.పి. శ్రీజ, ఐటిడిఎ పిఒ బి.రాహుల్, ఖమ్మం సిపి సునీల్ దత్, కొత్తగూడెం ఎస్‌పి రోహిత్ రాజ్, మేయర్ పునుకొల్లు నీరజ, ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## సొంతింటి కల నెరవేరుస్తాం






మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ప్రజాపక్షం/కూసుమంచి :** రాష్ట్రంలో ప్రతి పేదవారి సొంతింటి కలను ఇందిరమ్మ ప్రభుత్వం నెరవేరుస్తుందని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పోగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం కూసుమంచి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో రాష్ట్రంలోనే మొట్టమొదటిగా నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌస్ ఇంటిని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామ్‌రెడ్డి, ఖమ్మం అడిషనల్ కలెక్టర్ శ్రీజతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈనెల 26 నుంచి ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించనుందని, 72 గజాల్లో 400 ఎస్ఎఫ్ టి లో ఇందిరమ్మ నమూనా ఇంటిని రూ.5లక్షల వ్యయంతో రాజకీయ పార్టీలు, కులాలు మతాలకతీతంగా రాష్ట్రంలో పేదవాడు అయితే చాలని, పేదవారి సొంతింటి కలను ఇందిరమ్మ ప్రభుత్వం నెరవేరుస్తుందని స్పష్టం చేశారు. మొదటి విడతగా నాలుగున్నర లక్షల ఇల్లు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గాల్లో 3500 గ్రీన్ ఛానల్ ద్వారా ఇల్లు కట్టుకునేందుకు గత నెల డిసెంబర్ 13న భూమి పూజ చేసినట్లు రాబోయే 4 యేండ్లలో 20 లక్షల ఇండ్ల నిర్మాణాలు చేపట్టి చిత్తశుద్ధితో ఎన్ని ఇబ్బందులు వచ్చిన ప్రణాళికలు చేపడతామని అన్నారు. పది సంవత్సరాలు పాలించిన గత పాలకులు ఆనాడు పిలిచిన టెండర్లు 1,52 వేల ఇల్లు, పూర్తి చేసింది ఒక లక్ష లోపే నిర్మించారని, ఇంకా పిట్టా గోడలతో మిగిలిన సుమారు 55,60 వేల ఇండ్లు ఉన్నయని వాటిని కూడా పూర్తి చేసి పేదవారికి ఇస్తామన్నారు. ఇంటి స్థలం ఉన్న పేదవారికి రూ 5 లక్షల రూపాయలు నాలుగు విడతలుగా పునాది దశలో రూ.1లక్ష రూపాయలు కిటికీ లెవల్లో రూ.1,25000 వేలు, స్లాబ్ వేయడంతో రూ 1,75,000 వేలు మిగిలిన లక్ష రూపాయలు ఇంట్లోకు ప్రవేశించగానే ఇస్తామన్నారు. దళారులు ఎవర్ని ప్రోత్సహించేదిలేదని, దళారీల పాత్ర ఉండదని మీ గ్రామాల్లోని ఇందిరమ్మ కమిటీ సమక్షంలో ఎంపిక జరుగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీవో, హౌసింగ్ శాఖ, వివిధ శాఖ అధికారులు, పొంగులేటి వ్యక్తిగత సహాయకుడు తుంబూరు దయాకర్‌రెడ్డి, జిల్లా నాయకురాలు మద్దినేని స్వర్ణకుమారి, బానోత్ శ్రీనివాస్ నాయక్, రామసహాయం వెంకట్‌రెడ్డి, జూకూరు గోపాల్‌రావు, మాదాసు ఉపేందర్ రావు, చాట్ల పరుశురాం, మహమ్మద్ ఆఫీస్ ఉద్దీన్, జొన్నలగడ్డ రవి, బొల్లంపల్లి సుధాకర్‌రెడ్డి, నియోజకవర్గ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తా

డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క

**ప్రజాపక్షం/మధిర :** మధిర నియోజకవర్గాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తానని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. సోమవారం మధిర మండలంలో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. మధిర మండల పరిధిలోని వంగవీడు గ్రామంలో ఎంజిఎన్‌ఆర్‌జిఎస్ కింద రూ.18లక్షలతో చేపడుతున్న అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా సిరిపురం గ్రామంలో ఎంజిఆర్‌జిఎస్ నిధులు రూ.18లక్షలతో నిర్మించనున్న సిసిరోడ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం సిరిపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ. 5కోట్లు నిధులు మంజూరు చేసిన సందర్భంగా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో భట్టికి పుష్ప గుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధిర నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట వేసినట్లు తెలిపారు. మధిరను తెలంగాణలో రోల్ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని అన్నారు. ముందుగా డిప్యూటీసిఎం భట్టికి ఆయా గ్రామాల ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పూలమాలలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం మధిరలో ప్రముఖ వైద్యులు, రిటైర్డ్ డిఎంహెచ్ఓ డాక్టర్ కొండలరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎకేఆర్ మల్టీసూపర్ స్పెషాలిటీ హాస్పటల్‌ను, హాస్పటల్ లోని మదర్‌థెరిసా విగ్రహాన్ని డిప్యూటీ సిఎం భట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు హాస్పటల్ ఏర్పాటు చేయటం పట్ల నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, వివిధశాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




## ఖమ్మం ఎఎంసి చైర్మన్‌గా హన్మంతరావు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా ఖమ్మం నియోజక వర్గం వి.వెంకటాయపాలెం గ్రామానికి చెందిన యరగొర్ల హన్మంతరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోనే రెండవ అతిపెద్ద మార్కెట్ అయిన ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవి బిసి జనరల్‌కు రిజర్వు అయింది. యరగొర్ల హన్మంతరావును ఛైర్మన్‌గా తల్లాడ రమేష్‌ను వైస్ ఛైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. బానోత్ రమేష్, రెంట్యాల ప్రసాద్, వడ్లమూడి శైలజ, యనిగండ్ల బాబురావు, షేక్ లతీఫ్, తమ్మిని నాగేశ్వరరావు, అంగడాల నర్సింహారావు, చెరుకూరి సీతారాములు, అంగోత్ చిట్టిబాబు, బానోత్ బీమా నాయక్, మొర్రిమేకల నాగేశ్వరరావు, బోజడ్ల సత్యనారాయణను సభ్యులుగా నియమించగా వి. వెంకటాయపాలెం సహకార సంఘ అధ్యక్షులు ఖమ్మం మార్కెటింగ్ అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి, ఖమ్మం కార్పోరేషన్ ఛైర్మెన్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మెన్లుగా కొనసాగనున్నారు. హన్మంతరావు ఆది నుంచి తుమ్మల నాగేశ్వరరావు అనుచరుడిగా ఉన్నారు. టిడిపి, బిఆర్ఎస్, కాంగ్రెస్ ఇలా ఏ పార్టీలో ఉన్నా తుమ్మల నాగేశ్వరరావు అనుచరుడిగానే కొనసాగారు. గత ఎన్నికల్లో వెంకటాయపాలెం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. అంతకు ముందు హన్మంతరావు సతీమణి పద్మ రఘునాథపాలెం మండలం వైస్ ఎంపిపిగా పనిచేశారు.

## పతంగులతో జరభద్రం



పెద్దలు, పిల్లలను గమనించాలి

మాంజాలతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

**ప్రజాపక్షం/భద్రాచలం :** సంక్రాంతి అనగానే పంతంగుల పండుగని పిల్లలు సంబుర పడుతుంటారు. సంక్రాతి సందర్భంగా ప్రభుత్వం పాఠశాలలకు సెలవులను సైతం ప్రకటించింది. దీంతో పిల్లలు ఆనందానికి అవదులు ఉండవు. అమ్మమ్మ ఇళ్లు, బంధువులతో సంబురాలు ఇలా ఎన్నో సంతోషకరమైన సంఘటనలు అద్భుతంగా ఉంటాయి. కానీ పతంగుల వ్యవహారం మాత్రం పిల్లలకు రానురాను శాపంగా మారుతోంది. గతంలో ఖాళీ ప్రదేశాలు, విశాలమైన మైధానాలు ఉండేవి. కానీ ఇప్పుడు ఎటు చూసినా నిలువెత్తు భవంతులు, విద్యుత్ దీగలను ఆకునుని ఉండే సందర్భాలు కోకొల్లలు. అన్యంపుణ్యం ఎగురని పిల్లలు గాలిపటాలు ఇళ్లపైకి ఎక్కి ఎగురవేస్తూ ప్రమాదాల భారిన పడే అవకాశం ఉంది. ఇళ్లలో ఉండే పెద్దలు తమ పిల్లలపై ఓ కన్నేసి ఉంచాలి. ఇళ్లపైకి ఎక్కి పతంగులు ఎగురేసే సమయంలో వారి ప్రమాదానికి గురయ్యే సందర్భాలు ఉన్నాయా లేదా అని గమనించాలి. లేదంటే ఆరుబయట ప్రదేశాల్లో ఎగురవేసుకోవాలని సూచించాలి. పతంకులు ఎగురవేసే క్రమంలో పిల్లల దృష్టంతా ఆకాశంలో ఎగురుతున్న పతంగిపైనే ఉంటుందని, ప్రమాదం జరుగే అవకాశం ఉందని కూడా గ్రహించలేని పరిస్థితి ఉంటుంది. ఈ మధ్య కాలంలో ఎంతో మంది పిల్లలు బవంతులపై నుండి గాలిపటాలు ఎగురవేస్తూ జారిపడి పోయిన మృత్యువాత పడ్డారు. మరో ప్రక్క సమీపంలోనే విద్యుత్ తీగలు ఉండటంతో ఆ హై పవర్ తీగలకు తగిలి చనిపోతున్నారు. ఇలాంటి సంఘటన వల్ల ఇళ్లలో విషాద ఛాయలు అలుముకుంటున్నాయి. తాజాగా ఇదే సంఘటనలో హైదరాబాద్‌లో చోటు చేసుకుంది. మరో ప్రక్క చైనా మాంజాలతో పెద్ద చిక్కువచ్చి పడింది. ఆ మాంజాలను విషపూరిత సీసంతో తయారు చేస్తుంటారు. దాని వల్ల ఎగురవేసే దారం (మాంజా) గట్టిగా ఉండి తెగకుండా ఉంటుంది. కాగా పిల్లలు వీధుల్లో మాంజాల సహాయంతో పతంగులు ఎగురువేస్తున్నారు. అటుగా ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారికి ఆ మాంజలు మెడకు తగిలి బలంగా లోతుకు కోసుకుపోతున్నాయి. గత వారం రోజుల క్రితం ఇదే సంఘటన కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయం ముందు జరిగింది. భార్యభర్తలు వాహనంపై వెలుతుండగా మాంజా మెడకు తగలడంతో తీవ్రగాయాల పాలయ్యారు. హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్య సేవల కోసం హైదరాబాద్ తరలించారు. ఈ సంఘటనలో జిల్లాలో మాంజాలను పోలీసులు నిషేదించారు. పంతంగులతో సంబురం బాగానే ఉన్నా ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్న తరుణంలో పిల్లలపై పెద్దలు దృష్టి సారించాలి. ప్రమాదానికి ఆస్కారం లేని ప్రదేశాల్లో పంతగులు ఎగురువేసుకునే ఏర్పాట్లు

# జోరుగా కోడి పందేలు..సరిహద్దుల్లో కోడికత్తుల కొట్లాట

ఆంధ్రాకు తరలిన పందెం రాయుళ్లు

కోడి ఉంటే ఆపిన తెలంగాణ పోలీస్



**ప్రజాపక్షం/ఖమ్మం :** కోడి కత్తుల కొట్లాట జోరుగా సాగింది. తెలంగాణ సరిహద్దు ఆంధ్రప్రదేశ్‌లో కోడి పందేల జోరు ఏమాత్రం తగ్గలేదు. అక్కడి ప్రభుత్వం కోడి పందేలకు సంబంధించి ఆంక్షలు లేకపోవడంతో యధేచ్ఛగా పందేలు కొనసాగాయి. అక్కడి ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలు పందేలను ఏర్పాటు చేయడం గమనార్హం. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి మూడు రోజుల పాటు జరిగే పందేలకు సర్వం సిద్ధం చేశారు. తెలంగాణలో కోడి పందేలపై ఆంక్షలు ఉండడంతో పందెరాయుళ్లు పందేలను చూసేందుకు ఆంధ్రా సరిహద్దులకు పరుగులు పెట్టారు. పెద్ద సంఖ్యలో వాహనాలతో ఆంధ్రా సరిహద్దు, ఉమ్మడి కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాలకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్లగొండ, కరీంనగర్, హైదరాబాద్ నుంచి కూడా కోడి పందెలకు తరలి పోయారు. సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన కోడి పందెల వద్ద ఎక్కువగా ఆంధ్రా, తెలంగాణకు సంబంధించిన వారు కనిపిస్తున్నారు. కోడి పదేల పేరుతో కోట్ల రూపాయలు చేతులు మారాయి. పందెం కేంద్రాల వద్ద మట్కా, పేకాట, ఇతరత్రా జూదాలకు కొదవ లేకుండాపోయింది. కొన్ని పందెం బరుల వద్ద కోడి పందేలు చూసే వారి కంటే జూదాల వద్దనే ఎక్కువగా ప్రజలు కనిపించారు. సరిహద్దుల నుంచి కోళ్లతో తరలి వెళ్లే వారిని తెలంగాణ పోలీసులు నిలిపివేశారు. కోడి ఉంటే కేసులు నమోదు చేశారు. పెనుబల్లి, సత్తుపల్లి, కల్లూరు మండలాల నుంచి వెళ్లే ఆంధ్రా సరిహద్దుల వద్ద తెలంగాణ పోలీసులు పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు. పందెం కోళ్లు లేకుండా వెళ్లేవారిపై ఎటువంటి ఆంక్షలు పెట్టలేదు. కోడి పందేలతో పాటు పై పందేలకు సంబంధించి పెద్ద మొత్తంలో నగదు చేతులు మారింది. గతంలో ఎక్కడో చాటుమాటున నిర్వహించే కోడి పందేలు ఇప్పుడు ఆంధ్రాలో యధేచ్ఛగా సాగుతున్నాయి. కోడి పందేల కోసం ఇండోర్ స్టేడియంలను తయారు చేస్తున్నారు. కంటైనర్లతో కోడి పందేలకు తరలి వచ్చే వివిఐపిల కోసం ఏసిలతో కూడిన గెస్ట్ రూములను ఏర్పాటు చేశారు. పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లో ఏర్పాటు చేసే పందెలు అతి ఖరీదైనవిగా చెప్పుకుంటున్నారు. తెలంగాణ పోలీసుల ఆంక్షల కారణంగా తెలంగాణలో ఉన్న పందెం రాయుళ్లు వారం రోజుల నుంచి తెలంగాణ సరిహద్దు ఆంధ్రా జిల్లాలో తిష్ట వేశారు. మొత్తంగా సంక్రాంతికి జరిగే సాంప్రదాయ కోడి పందేలతో వనాలు జన సందడితో ఉండగా ఆంధ్రా సరిహద్దుకు వెళ్లే తెలంగాణ రహదారులు వాహనాలతో కిక్కిరిశాయి.





## సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పడుతున్న సంక్రాంతి



**ప్రజాపక్షం/గజ్వేల్:** సంస్కృతి సాంప్రదాయాలకు సంక్రాంతి సంబురాలు అద్దం పడుతున్నట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం గజ్వేల్ పట్టణంలో కైట్ ఫెస్టివల్ ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సంక్రాంతి పర్వదినాలలో చిన్న పెద్ద తేడా లేకుండా గాలిపటాలు ఎగురవేయడం ప్రత్యేకతగా నిలుస్తున్నట్లు స్పష్టం చేశారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలో సంక్రాంతి పండుగకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ సంతోషాల మధ్య గడుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. అయితే మూడు రోజులపాటు కనుమ, భోగి, మకర పండగలు నిర్వహించుకుంటూ ఉండగా కుటుంబ సభ్యులతో కలిసి ఆటపాటలతో సందడి చేసుకోనున్నట్లు చెప్పారు. గోదావరి జిల్లాల్లో కోడిపందాలకు పెట్టింది పేరని, అయితే ఆర్థికంగా నష్టపోతుండడంతో తెలంగాణ ప్రాంతంలో ప్రభుత్వం నిషేధించినట్లు పేర్కొన్నారు. అయితే అత్యంత ప్రమాదమైన చైనా మాంజ వినియోగించి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మడుపు భూం రెడ్డి, ఆయా మండలాల పార్టీ బాధ్యులు శ్రీనివాస్ రెడ్డి, సందీప్ రెడ్డి, శ్రీనివాస్, కిష్టా గౌడ్, రవీందర్ రెడ్డి, గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, కో ఆప్షన్ సభ్యులు గంగిశెట్టి రాజు, పాల్గొన్నారు.

## బాన్సువాడ అభివృద్ధి కోసం నిధులు సాధించిన ఘనత పోచారందే...



**ప్రజాపక్షం/బాన్సువాడ:** బాన్సువాడ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు గత ప్రభుత్వంలోమాజీ స్పీకర్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కష్టపడి నిధులు తీసుకురావడంలో ఆయన కృషి ఎంతో ఉందని కాంగ్రెస్ నాయకులు అంజిరెడ్డి, కాలేక్ అన్నారు. సోమవారం బాన్సువాడ పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆదివారం ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను వారు ఖండించారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ఏ బహిరంగ సభలోనైనా గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతోనే బాన్సువాడ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని బాహాటంగా చెప్పారని, నియోజకవర్గ ప్రజల సంక్షేమంతో పాటు మరింత అభివృద్ధి చేయడానికి కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందన్నారు. గత 47 సంవత్సరాలుగా రాజకీయంలో ఉన్న పోచారం శ్రీనివాస్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసమే పార్టీలు మారారు తప్ప ఎక్కడ స్వార్థ రాజకీయం కోసం కాదనే సంగతి ఎమ్మెల్సీ కవిత గుర్తుంచుకోవాలన్నారు.

## పండగ పూట నీటి కష్టాలు



**ప్రజాపక్షం/పాపన్నపేట:** సంక్రాంతి పండుగ రోజు కడివిడి నీటి కోసం మహిళలు కన్నీటి కష్టాలు పడుతున్నారు. మండల కేంద్రమైన పాపన్నపేటలోని దుర్గమ్మ గైన్, కాలనీ లోని సింగిల్ ఫేజ్ మోటార్ లు చెడిపోయి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్న అధికారులు పట్టించుకోవడంలేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. పాత పోస్ట్ ఆఫీస్ వద్ద, శ్రీరామ్ వాళ్ళ ఇంటి వద్ద సింగిల్ ఫేస్ మోటర్లు చెడిపోయి నాలుగు నెలలు అవుతున్నా రిపేర్ చేయించకపోవడంతో, పక్కనే ఉన్న కాలనీలో నీ బురుజు వద్ద సింగిల్స్ మోటార్ ప్రజల తాకిడి ఎక్కువైంది. దీంతో కాస్త అది కూడా చెడిపోయి వారం రోజులు గడుస్తుంది. వీరభద్ర కిరాణం ముందున్న సింగిల్ ఫేస్ మోటార్ లో పూర్తిగా నీటిమట్టం తగ్గిపోయి నీళ్లు రాకపోవడంతో కాలనీ వాసులకు మరింత నీటి గోస మొదలైంది. అంతేకాకుండా మిషన్ భగీరథ నీళ్లు ఏ రోజు వస్తాయో, ఎప్పుడు బంద్ అవుతాయో అధికారులకే తెలియని పరిస్థితి దాపురించింది. సోమవారం పాపన్నపేటలో మిషన్ భగీరథ నీళ్ల రాక, సింగిల్ ఫేస్ మోటార్లు పూర్తిగా చెడి పోవడంతో పండగ పూటనాన ఇబ్బందులు పడ్డారు. ఈ విషయంపై పంచాయతీ సెక్రటరీ నహీం కు వివరణ కోరగా పంచాయతీలో నిధులు లేకపోవడం వల్ల నాలుగు నెలల నుండి మరమ్మతులు చేయించిన వారికి బకాయిలు చెల్లించలేము. రిపేర్ చేయించడానికి డబ్బులు లేకపోవడంతో చేయించలేకపోతున్నాం.కాలనీలోనిప్రజలు, నాయకులే ముందుకు వచ్చి మరమ్మత్తులకు డబ్బులు వెచ్చించి రిపేర్ చేసుకోవాలన్నారు.

## రోడ్డు భద్రతపై అవగాహన




**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.ఈ ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టడంతో బైక్‌పై నుంచి పడిన వ్యక్తిని వాహనం 10 మీటర్లు లాక్కుపోవటంతో అతడు రెండు ముక్కలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని చిట్టాపూర్‌లో సోమవారం మధ్యాహ్నం జరిగింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పోస్ట్ ఆఫీస్‌లో ఆధార్ సెంటర్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి..

**ప్రజాపక్షం/ఖానాపూర్:** ఖానాపూర్ పట్టణంలో పోస్ట్ ఆఫీస్ కార్యాలయం యందు ఆధార్ సెంటర్ ప్రారంభించినట్టు నిర్మల్ డివిజన్ తపాల శాఖ అధికారి సందీప్ తెలిపారు.తాను మాట్లాడుతూ ప్రజాసేవ అవసరాలకు ఆధార్ సెంటర్ ను ఖానాపూర్ పోస్ట్ ఆఫీస్ కార్యాలయంలో ప్రారంభించామని,ఆధార్ కార్డు లేని వారు,మొబైల్ నెంబర్,వ్యక్తిగత అడ్రస్,ఫింగర్ ప్రింట్స్ వంటి పొరపాట్లు ఉన్నవారు సరి చేసుకోవడానికి,కొత్త వాటిని పొందడానికి ఇక్కడ ఆధార్ సెంటర్ ని ప్రారంభించమని,అలాగే తపాల కార్యాలయంలో డబ్బులు పొదుపు చేసుకోవడానికి,వృద్ధులకు సీనియర్ సిటిజన్,మహిళలకు ప్రత్యేకంగా మహిళ సంయోజన వంటి పథకాలని,అలాగే చిన్నపిల్లలకు సుకన్య యోజన వంటి పథకాలు తపాలా శాఖ ప్రవేశ పెట్టడం జరిగిందని అదేవిధంగా తపాలా శాఖలో ప్రవేశపెట్టినటువంటి ఎటువంటి పథకాలైన తెలియాలంటే దగ్గర్లోని తపాలా కార్యాలయం సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సబ్ పోస్ట్ మాస్టర్ నవీన్,పోస్టల్ అసిస్టెంట్ శ్రీకాంత్,పోస్ట్ మాన్ రంజిత్,సిబ్బంది నరసయ్య,నాగరాజు,సద్దాం,రణదీర్ తదితరులు పాల్గొన్నారు.

# పోరాటవీరుల స్ఫూర్తితో జిల్లా అభివృద్ధి

మంత్రి సీతక్క





**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:** పోరాట వీరుల స్ఫూర్తితో జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేపట్టడం జరుగుతుందని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) తెలిపారు. సోమవారం జిల్లా లో చేపట్టిన పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎంఎల్‌సి దండే విట్టల్, ఎంఎల్ఎలు కోవలక్ష్మి, వెద్మ బొజ్జు, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్ తో కలిసి భూమి పూజ చేశారు. రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామంలో వెంకటేశ్వర స్వామి ఆలయ దారిలో రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న స్వాగత తోరణం నిర్మాణానికి శంకుస్థాపన, ఆసిఫాబాద్ పట్టణం జనకాపూర్ లో రూ. 1.35 కోట్లతో బాల సదన్ భవన నిర్మాణానికి భూమిపూజ, జన్కాపూర్ లో రూ.19 లక్షలతో నిర్మించిన ఆదర్శ అంగన్వాడీ భవనం ప్రారంభించారు. వాంకిడి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను జూనియర్ కాలేజ్‌గా అప్ గ్రేడ్ చేశారు. రోడ్డు భద్రత మసోత్సవంలో భాగంగా హెల్మెట్ పంపిణీ చేసి ర్యాలీ ప్రారంభించారు. అనంతరం కెరమేరి మండలంలో జోడే ఘాట్ లో రూ. 4. 96 కోట్లతో పర్యాటక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కోట పరందోలి గ్రామంలోని జంగుబాయి పుణ్య క్షేత్రం వద్ద సంప్రదాయ పద్ధతిలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల వెనుక జల్ జంగిల్ జమీన్ కోసం పోరాటం చేసిన భీమ్ ప్రాణ త్యాగాలు ఉన్నాయన్నారు. చరిత్రను తిరిగి రాసిన జోడేఘాట్ ప్రాంతాన్ని చారిత్రాత్మకమైన టూరిజం ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. భీమ్ వర్ధంతి, జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ ప్రాంత ఆదివాసీల డిమాండ్ మేరకు అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వాలు ముందుకు వెళుతున్నాయన్నారు. తెలంగాణ పోరాటం కూడా భీమ్ స్ఫూర్తితోనే ముందుకు వెళ్లడం జరిగిందని, ఆదివాసీలను విద్యలో ముందుకు తీసుకెళ్లడం కోసం చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ట్రైబల్ అడ్వైజరి కమిటీ సమావేశం ఏర్పాటు చేసుకొని ఆదివాసీల అభివృద్ధికి సంక్షేమానికి తీసుకోవాల్సిన అంశాలపై చర్చించి ప్రణాళికను తయారు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఆదివాసీలకు దుప్పట్లు పంపించేశారు. రోడ్డు భద్రత మహోత్సవంలో భాగంగా ఆసిఫాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ వాహనదారులు మద్యం సేవించి నడపడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని రోడ్డు ప్రమాదాల నివారణకు వ్యక్తిగత భద్రత అవసరమని బార్లకు వెళ్లి వేలాది రూపాయలు ఖర్చు పెట్టడం కంటే హెల్మెట్ ధరించి వాహనం నడపాలని సూచించారు. ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు వాహనదారులు భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ ఆత్రం సక్కు, డిసిసి జిల్లా అధ్యక్షుడు విశ్వ ప్రసాద్, కుమ్రం భీమ్ మనవడు సోనేరావు, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆత్రం సుగుణ, నియోజకవర్గ ఇంచార్జ్ అజ్మీర శ్యాం నాయక్, సంబంధిత శాఖల అధికారులు, ఆదివాసి సంఘం నాయకులు పాల్గొన్నారు.

**ఆదివాసీ సంప్రదాయ చీర కటులో సీతక్క, ఎంఎల్ఎ కోవ లక్ష్మి**

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా కేరమెరి మండలం లోని జంగు బాయి జాతరకు హాజరైన రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆదివాసీ గిరిజన సంప్రదాయ చీర కట్టుతో ఆకట్టుకున్నారు. ఎప్పుడూ చీరకట్టు లో కనిపించే సీతక్క సోమవారం జంగూ బాయి ఆలయం వద్ద ఆదివాసీల గ్రీన్ కలర్ చీర కట్టుకుని సంప్రదాయం మరోసారి చాటారు. ఆసిఫాబాద్ ఎంఎల్ఎ కోవ లక్ష్మి కుడా మంత్రి తో అదే విధంగా చీర కట్టుకుని సంప్రదాయం గుర్తు చేశారు.

## ప్రజలకు కలెక్టర్ సంక్రాంతి శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** సంక్రాంతి పండగను పురస్కరించుకుని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భోగభాగ్యాలనిచ్చే భోగి, సరదాలు పంచే సంక్రాంతి వేడుక ప్రజలందరికి ఆనందం పంచాలని ఆకాంక్షించారు. నూతన సంవత్సరం అన్ని శుభాలే సమకూరాలని అనుకున్న పనులన్ని నెరవేరాలని యేదాది పొడుగునా ఇంటింటా సిరుల కాంతులు విలసిల్లాలని అభిలాషించారు.

## రోడ్డు విస్తరణ, భూగర్భ మురికి కాలువ ప్రణాళికపై సిఎం అభినందన

ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు



**ప్రజాపక్షం/మంచిర్యాలటౌన్:** మంచిర్యాల పట్టణంలోని వ్యాపార ప్రాంతాలలో రోడ్డు విస్తరణ, భూరగ్భ మురికి కాలువ నిర్మాణ ప్రణాళికను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అభినందించారని మంచిర్యాల శాసనసభ్యుడు కొక్కిరాల ప్రేంసాగర్‌రావు తెలిపారు. సోమవారం రోడ్డు వెడల్పులో భాగంగా కూల్చివేతలను ఎమ్మెల్యే మార్కెట్ ఏరియాలో తిరుగుతు పర్యవేక్షించారు. అంతకు ముందు గోదావరి తీరంలో నిర్మిస్తున్న మహాప్రస్థానం నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేస్తు నాణ్యతను పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా మార్కెట్ రోడ్, మెయిన్‌రోడ్డు, శ్రీనివాస్ టాకీసు రోడ్డు, వాటర్ ట్యాంక్ రోడ్డులలో భూగర్భ మురికి కాలువలు, ఫుట్‌పాత్ నిర్మాణం జరుపుతున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి మాసంలో నిర్మాణాలు చేపట్టి జూన్ వర్షాకాలం లోపు ఈ నిర్మాణాలు పూర్తి చేసి సుందరీకరణ పనులు చేస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. భూగర్భ మురికి కాలువలు, కేబుల్ వ్యవస్థ గురించి విన్న ముఖ్యమంత్రి రాష్ట్రంలో పలు మున్సిపాలిటీలలో ఇదే ప్రణాళిక అమలు చేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారని ఎమ్మెల్యే విలేకరులకు తెలిపారు. అభివృద్ధికి సహకరించాలని ఎవరు ఆటంకం కల్పించవద్దని కోరారు. మంచిర్యాల నియోజకవర్గ ప్రజలకు ఆయన ఈ స ందర్భంగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కర్షకులకు ఎంతో ఇష్టమైన పండుగఅని కుటుంబసభ్యులు సందడి, పిండి వంటలు, కొత్త బియ్యంతో భోజనం ఇలా సంతోషంగా పండుగ జరుపుకోవాలని అన్నారు. ఎమ్మెల్యే వెంట అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పేదల కుటుంబాల్లో వెలుగులు నింపడమే లక్ష్యం

ఎంఎల్ఎ గడ్డం వినోద్



**ప్రజాపక్షం/నెన్నెల:** సర్వేంద్రియాల్లో కంటి చూపు కీలకమని అందుకు కళ్ళని జాగ్రత్తగా చూసుకోవాలని బెల్లంపల్లి ఎంఎల్ఎ గడ్డం వినోద్ అన్నారు. మండలం లోని గంగారం గ్రామంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు జాడి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి అద్దాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉచిత కంటి అద్దాలను ఎంఎల్ఎ సతీమణి రమ, స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు. అనంతరం ఎంఎల్ఎ వినోద్ మాట్లాడుతూ గత నెలలో తన కుమార్తె వర్షా పేదల కుటుంబాల్లో వెలుగులు నింపాలనే సంకల్పంతో బెల్లంపల్లి నియోజకవర్గ కేంద్రంలో మెగా కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని, శిబిరంలో అవసరమైన వారికి కంటి అద్దాల కోసం వైద్యుల సిఫారసు చేయడం జరిగిందన్నారు. వారందరికీ కంటి అద్దాలు పంపిణీ చేయడం ఆనందంగా ఉందని, శిబిరం వల్ల ఎంతో మంది పెదలకు మేలు జరిగిందని, అలాగే ఇకముందు కూడా సేవ కార్యక్రమాలు నిర్వహించి పేద ప్రజల కుటుంబాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామన్నారు. రాజ్ కుమార్ గ్రామ అభివృద్ధి కోసం చేస్తున్న శ్రమను అభినందనీయం అని, గ్రామంలో ఏ సమస్య ఉన్న తమ దృష్టి కి తీసుకు రావాలని, అభివృద్ధి లక్ష్యమే తమ ధ్యేయమని హామీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గట్టు మల్లేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్ము రాజన్న, డిసిసి సభ్యులు గట్టు భానేశ్, కటికల మల్లిక, మల్లగౌడ్, మాజీ సర్పంచ్ సుధా, నెన్నెల మాజీ సర్పంచ్ తోట సుజాత శ్రీను, జనగామ తిరుపతి,, రాజన్న, మల్లేష్, ప్రశాంత్ రాజేందర్, అంకులు, పాల్గొన్నారు.

## చైనా మాంజా అత్యంత ప్రమాదకరం

గజ్వేల్ రేంజ్ అటవీ అధికారి వినాయక్

**ప్రజాపక్షం/గజ్వేల్:** సంక్రాంతి సంబరాల్లో గాలిపటాలు ఎగరవేయడం ప్రత్యేకతగా నిలుస్తుండగా, తెలిసి తెలియని కారణంగా చైనా మాంజా వినియోగంతో వన్యప్రాణులు, యువత, చిన్నారులు మృత్యువాత పడుతున్నట్లు గజ్వేల్ రేంజ్ అటవీ అధికారి వినాయక్, సెక్షన్ అధికారి పవన్ కుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వం చైనా మాంజాను నిషేధించడంతో గజ్వేల్ పట్టణం తోపాటు నియోజకవర్గ పరిధిలోని దుకాణాల్లో చైనా మాంజా విక్రయం అరికట్టేందుకు ఆకస్మిక దాడులు చేపట్టి పలు దుకాణాల్లోని చైనా మాంజాను స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసులు నమోదు చేసినట్లు స్పష్టం చేశారు. సంక్రాంతి పర్వదినాల్లో పతంగులు ఎగరవేయడం ప్రతి ఒక్కరికి ఇష్టం, అయితే గాజుపొడి, సింథటిక్, నైలాన్ తదితర పదార్థాలతో తయారుచేసే పదునైన చైనా మాంజా పక్షులు, మానవులు, పర్యావరణానికి చేటు చేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. చైనాలో తయారుచేసి అక్రమంగా దేశంలోకి పంపించి విక్రయిస్తున్న మాంజా ప్రమాదకరమని తెలిసినప్పటికీ కొందరు గుట్టు చాటుగా విక్రయిస్తూ ప్రాణాలు పోవడానికి కారణంగా నిలుస్తున్నట్లు పేర్కొన్నారు. చైనా మాంజాతో జరిగే అనర్థాలు, దుష్ప్రపరిణామాలు, పొంచి ఉన్న ముప్పు, ప్రమాదంపై అవగాహన కల్పించడమే తమ లక్ష్యమని, ఇందుకోసం యువత ముందుకు వచ్చి ప్రజల్లో చైతన్యం చేయాలని స్పష్టం చేశారు. నిషేధిత చైనా మాంజా ప్రాణ సంకటంగా మారిందని, దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. చైనా మాంజా వినియోగాన్ని నిషేధించడంతో అక్రమంగా విక్రయిస్తే చట్ట ప్రకారం జైలు శిక్ష, జరిమానా తప్పదని హెచ్చరించారు. సంక్రాంతి పండగ దినాల్లో తమదేపై చేయి కావాలనే లక్ష్యంతో చైనా మాంజాతో గాలిపటాలు ఎగరవేస్తూ ప్రమాదాలకు కారణం అవుతుండగా, పద్ధతి మార్చుకోని పక్షంలో చర్యలు తప్పవని వివరించారు.



## ప్రశాంతమైన జీవనమే ఆధ్యాత్మిక మార్గం

ఎమ్మెల్యే అనిల్ జాదవ్



**ప్రజాపక్షం/తలమడుగు:** ప్రస్తుత జీవనం లో మనిషికి అన్ని ఉన్న లేనిది మానసి ప్రశాంతతా అది కేవలం ఆధ్యాత్మిక మార్గం ద్వారానే సాధ్యపడుతుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం పల్సిబి తండా గ్రామంలో నిర్వహించిన సంత్ సద్గురు నారాయణ్ బాబా వార్షికోత్సవ కార్యక్రమం లో బోథ్ ఎమ్మెల్యే పాల్గొన్నారు. సంస్థన్ వార్షికోత్సవ సందర్భంగా తెలంగాణ మహారాష్ట్ర నుండి పెద్ద ఎత్తున భక్తులు రావడం జరిగింది. బోథ్ ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మనిషి అన్ని సౌకర్యాలు ఉన్న ఇంకా తెలియని వెలితి గా ఉందని దానికి మానసిక ప్రశాంతత లేకపోవడమే ప్రధాన కారణం అది కేవలం ఆధ్యాత్మిక భావప ద్వారానే మనకు సొంతం అవుతుందని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గం ఇంచార్జి ఆడే గజేందర్ మాట్లాడుతూ సత్సంగం వల్ల మనలో ఉన్న చెడు వెళ్ళిపోయి మానసిక, శారీరకం ఉన్నతంగా జీవించే అవకాశం మనకు ఉందని రాబోయే రోజుల్లో గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదానికి అవసరం అయినా సహాయ సహకారం అందిస్తానని ఇలా గొప్ప ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహిస్తున్న నిర్వాహకులకు ధన్యవాదలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, ముడుపు కేదారేశ్వర్ రెడ్డి, పిడుగు అభిరామ్ రెడ్డి, బలంరాజాదవ్, తోట వెంకటేష్, మెరుగు రంజిత్ రెడ్డి, సంస్థన్ అధ్యక్షుడు జాదవ్ కిషన్ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## నీటి సమస్య పరిష్కరించాలని నిరసన

**ప్రజాపక్షం/కోటగిరి:** కోటగిరి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం టాక్లీ గ్రామ ప్రజలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ గ్రామంలో మూడు నెలల నుంచి తాగునీటి సమస్య ఉందన్నారు. ఈ సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. దీంతో తాము నిరసన చేయాల్సి వచ్చిందని, వెంటనే ఉన్నతాధికారులు స్పందించి తమ గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని టాక్లీ గ్రామ ప్రజలు కోరారు.

## ఎల్లమ్మ ఆలయ హుండీ చోరీ చేసిన దొంగలు అరెస్ట్

**ప్రజాపక్షం/కొల్చారం:** మండల కేంద్రం కొల్చారం లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ హుండీని శుక్రవారం రాత్రి చోరీ చేసిన దొంగలను చాకచక్యంగా 24 గంటల్లోనే పోలీసులు దొంగలను పట్టుకున్నారు. సోమవారం ఎస్ఐ మహమ్మద్ గౌస్ తెలిపిన వివరాల ప్రకారం మెదక్ జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణంలోని గాంధీ నగర్ కు చెందిన దూదేకుల అప్సర్, మెదక్ పట్టణంలోని కుమ్మరి గడ్డకు చెందిన గోవిందు గారి ప్రవీణ్ లను ఫింగర్ ప్రింట్ ఆధారంగా చాకచక్యంతో పట్టుకొని స్టేషన్ కు తరలించారు. వారిని విచారించగా ఉండిని చోరీ చేసి మరియు బంగార ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు ఒప్పుకొనగా కేసు నమోదు చేసి మెదక్ కోర్టుకు రిమాండ్ పంపుతున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా హుండీలోని నగదు పది వేలు, ముక్కుపుడకను రికవరీ చేసుకున్నట్లు పేర్కొన్నారు. దొంగలను పట్టుకొనుటకు శ్రమించిన శేఖర్,మహేష్, డానియల్ లను ఎస్సై అభినందించారు. మండల పరిధిలోని ఆలయాల వద్ద సీసీ కెమెరాలు కచ్చితంగా అమర్చుకోవాలని ఆయన సూచించారు.



## ప్రభుత్వ గురుకులాల్లో పిల్లలకు మంచి భవిష్యత్తు

ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్




**ప్రజాపక్షం/ఖానాపూర్:** తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు నిర్మాణమవుతుందని, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ గురుకులాలను తీర్చిదిద్దుతున్నామని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం ఉట్నూరు మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో నచ్చన్ ఎల్లాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శకుంతల తో కలిసి కామన్ ఎంట్రన్స్ టెస్ట్ 2025 కు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని నిరుపేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలోని అన్ని గురుకులాలలో డైట్ చార్జీలను పెంచడంతోపాటు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నామని తెలిపారు. సంఘిక, గిరిజన, బిసి గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశాలకు, ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో 6 నుండి 9వ తరగతి వరకు, సాంఘిక సంక్షేమ చాలా గౌలిదొడ్డి,అలుగునూరులో 9తరగతి సిఓఈ, అదేవిధంగా ఎస్ ఓఈ ఖమ్మం, పరిగి, 8వ తరగతిలో, రుక్మాపూర్ సైనిక్ స్కూల్, మల్కాజ్ గిరి ఫైన్ ఆర్ట్ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశాలకు గాను దరఖాస్తులు స్వీకరించబడుతున్నాయని తెలిపారు. అర్హులైన విద్యార్థిని, విద్యార్థులు (http://tgcet.cgg.gov.in) ద్వారా ఆన్లైన్ లో అప్లై చేసుకోవాలన్నారు. చివరి తేదీ ఫిబ్రవరి 1అని అప్లై చేసుకునే విద్యార్థినీ, విద్యార్థులు మీ సేవ కేంద్రాలకు, ఆన్లైన్ సెంటర్లకు తమ వెంట కుల ధ్రువీకరణ పత్రం,ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం ఫోటో తప్పకుండ తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ పాఠశాల సిబ్బంది, కాంగ్రెస్ నాయకుడు భూక్యా భిక్కు నాయక్ పాల్గొన్నారు.

## వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా: కలెక్టర్



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తూ భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఆర్థిక చేయూత నందించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేయనుందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు సోమవారం ఒక ప్రకటనలో తె లిపారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 26 నుంచి ప్రతిష్టాత్మక పథకాన్ని ప్రభుత్వం అమలు లోకి తెస్తోందన్నారు. అర్హులైన కుటుంబాలకు రెండు విడతలలో 6 వేల చొప్పున ప్రతి సంవత్సరం రూ.12000 నేరుగా వారి ఖాతాలలో జమ చేయటం జరుగుతుందని తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో నమోదై ఉండి 202324 ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 రోజులు పని చేసిన భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంపబాలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి అర్హులని కలెక్టర్ స్పష్టం చేశారు. భూభారతి (ధరణి) పోర్టల్ ఆధారంగా భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలను నిర్ధారించటం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని భూమి లేని అర్హత కలిగిన వ్యవసాయ కూలీ కుటుంబాలన్నింటికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరేలా జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటుదని కలెక్టర్ వివరించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకనుగుణంగా అర్హత కలిగిన కుటుంబాలను గుర్తించేలా సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. ప్రతి గ్రామపంచాయతీలో ఈనెల 21 నుండి 24 వరకు నిర్వహించే గ్రామసభలలో లబ్ధిదారుల ముసాయిదా జాబితాను చదివి వినిపించిన మీదట తుది జాబితాను ఆమోదించటం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఒక వేళ గ్రామసభలో ఏవైనా అభ్యంతరాలు వచ్చినట్లయితే సంబంధిత ఎంపీడీఓ వాటిని పరిశీలించి నిర్ణీత గడువులోపు పరిష్కరిస్తారన్నారు.

# క్రీడ

## టీమిండియా టెస్ట్ కెప్టెన్‌గా యశస్వి జైస్వాల్..?



భవిష్యత్తులో టీమిండియా టెస్ట్ కెప్టెన్‌గా యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ బాధ్యతలు తీసుకుంటాడా? అంటే సోషల్ మీడియా వేదికగా అవుననే సమాధానం వినిపిస్తోంది. ఆస్ట్రేలియా పర్యటనలో టీమిండియా దారుణంగా విఫలవడంతో జట్టును పూర్తిగా ప్రక్షాళన చేయాలనే డిమాండ వ్యక్తమవుతోంది. ముఖ్యంగా సీనియర్ క్రికెటర్లకు వీడ్కోలు పలికి యువ ఆటగాళ్లకు అవకాశాలు ఇవ్వాలని అభిమానులు, మాజీ క్రికెటర్లు సూచిస్తున్నారు. కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా రిటైర్మెంట్ ప్రకటిస్తారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రోహిత్ శర్మ అయితే ఆసీస్ పర్యటనలోనే రిటైర్మెంట్ ప్రకటిస్తాడని కూడా ప్రచారం జరిగింది. కానీ ఆ వార్తలను అతను ఖండించాడు. అయితే ఆసీస్ పర్యటనపై బీసీసీఐ నిర్వహించిన సమీక్ష సమావేశానికి రోహిత్ శర్మ హాజరయ్యాడు.

### మరికొంత కాలం కెప్టెన్‌గా రోహిత్ శర్మనే..

మరికొంత కాలం టెస్ట్‌ల్లో కెప్టెన్‌గా కొనసాగుతానని, ఆలోపు కొత్త కెప్టెన్ ఎంపికపై కసరత్తు చేయాలని సూచించినట్లు వార్తలు వచ్చాయి. టీమిండియాకు మరో 6 నెలల పాటు టెస్ట్ సిరీస్‌లు లేవు. ఫిబ్రవరిలో ఛాంపియన్స్ ట్రోఫీ జరగనుండగా.. అనంతరం ఐపీఎల్ ప్రారంభం కానుంది. జూన్‌లో టీమిండియా ఐదు టెస్ట్‌ల సిరీస్ కోసం ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లనుంది.
ఈ సిరీస్‌లో రోహిత్ శర్మనే కెప్టెన్‌గా కొనసాగుతాడనిపిస్తోంది. రోహిత్ వారసుడిగా బుమ్రాకు సారథ్య బాధ్యతలు కట్టబెట్టడంపై ఏకాభిప్రాయం కుదరట్లేదని తెలుస్తోంది. బుమ్రా తరుచూ ఫిట్‌నెస్ సమస్యలతో బాధపడుతుండటంతో అతని కెరీర్ ఎంత కాలం పొడిగించుకోగలడన్నది ప్రశ్నార్థకంగా మారింది.

### రేసులో యశస్వి జైస్వాల్..

ఈ క్రమంలోనే భవిష్యత్తు సారథి ఎవరా? అనేది కూడా ఈ సమావేశంలో బీసీసీఐ చర్చించినట్లు తెలుస్తోంది. బుమ్రాకు కెప్టెన్సీ ఇస్తే వర్క్ లోడ్ ఎక్కువవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే సెలెక్షన్ కమిటీ రిషభ్ పంత్ పేరును ఫ్యూచర్ కెప్టెన్‌గా ప్రతిపాదించిందని సమాచారం.
అయితే గంభీర్ అనూహ్యంగా యశస్వి జైస్వాల్ పేరు ప్రతిపాదించాడట. ఇప్పటి వరకు అయితే ఈ విషయంలో ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. గంభీర్ సూచనలను సెలెక్షన్ కమిటీ పట్టించుకుంటుందా? లేదా? అనేది కాలమే నిర్ణయించాలి. యశస్వి జైస్వాల్ ఓపెనర్‌గా టెస్ట్‌ల్లో అదరగొడుతున్నాడు.

## హైదరాబాద్‌లోనే ‘ప్లే ఆఫ్’ మ్యాచ్‌లు!



హైదరాబాద్ క్రికెట్ అభిమానులకు గుడ్ న్యూస్. ఐపీఎల్ 2025 సీజన్‌లోని రెండు ప్లే ఆఫ్స్ మ్యాచ్‌లు ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ స్టేడియం వేదికగా జరగనున్నాయి. క్వాలిఫయర్ 1తో పాటు ఎలిమినేటర్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ఐపీఎల్ 2025కి మార్చి 21న తెరలేవనుంది. ఈ టోర్నీ ఆరంభం మ్యాచ్, మే 25న జరిగే ఫైనల్ మ్యాచ్‌లు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరగనున్నాయి. ఐపీఎల్ 2024 సీజన్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ విజేతగా నిలిచిన విషయం తెలిసిందే. డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో ఆ జట్టు హోమ్ గ్రౌండ్ అయిన కోల్‌కతాకు ఫస్ట్, ఫైనల్ మ్యాచ్‌ల ఆతిథ్యం దక్కింది. గతేడాది రన్నరప్ అయిన సన్‌రైజర్స్ హైదరాబాద్ హోమ్ గ్రౌండ్‌కు రెండు ప్లే ఆఫ్ మ్యాచ్‌లు కేటాయించారు. ఐపీఎల్ పూర్తి షెడ్యూల్‌ను ఈ నెలలోనే విడుదలయ్యే అవకాశం ఉంది. గత సీజన్ మాదిరే ఐపీఎల్ 2025 సీజన్‌లోనూ 74 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఐపిఎల్ 2025 సీజన్ నుంచి ఐసీసీ ప్రవర్తన నియమావళిని అమలు చేయనున్నారు. ఈ విషయాన్ని ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ ఒకరు తెలిపాడు. 'ఇక నుంచి ఐపిఎల్‌లో ఐసిసి ప్రవర్తన నియమావళిని అమలు చేస్తాం. ఇప్పటి వరకు ఐపీఎల్ తన సొంత ప్రవర్తన నియమావళి ప్రకారం నడుచుకుంది.'అని మీడియాకు తెలిపాడు.

### నాలుగు వేదికల్లో డబ్ల్యూపిఎల్..

మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపిఎల్) 2025 సీజన్ కోసం బిసిసిఐ నాలుగు వేదికలు ఖరారు చేసింది. ముంబై, బెంగళూరు, బరోడా, లక్నోలో డబ్ల్యూపిఎల్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఫిబ్రవరి 7 నుంచి ఈ టోర్నీ జరగనుంది.

## జకోవిచ్‌ను వణికించిన తెలుగు కుర్రాడు

### పోరాడి ఓడిన బసవారెడ్డి

నోవాక్ జకోవిచ్ – నిశేష్ బసవారెడ్డి మధ్య తొలి రౌండ్ రసవత్తరంగా సాగింది. తెలుగు మూలాలున్న 19 ఏళ్ల కుర్రాడు నిశేష్ తన ఆటతీరుతో అందరినీ ఆకట్టుకున్నాడు. కానీ ఈ రౌండ్‌లో గట్టిగా పోరాడినప్పటికీ చివరికి ఓడిపోయాడు. దీంతో జకోవిచ్ తొలి రౌండ్‌లో 4–6 6–3 6–4 6–2 విజయం సాధించి రెండో రౌండ్‌కు అర్హత సాధించాడు.

### తొలి రౌండ్‌లో తెలుగు కుర్రాడి జోరు

తొలి సెట్‌లో నిశేష్ దూకుడు ప్రదర్శించాడు. పెద్దగా అనుభవం లేనప్పటికీ, ఈ తెలుగు సంతతి కుర్రాడు మాజీ వరల్డ్ నెంబర్ వన్ జకోవిచ్ కు గట్టిపోటీనిచ్చేలా ఆడాడు. అతడి జోరుకు జకోవిచ్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. నిశేష్ 46 తేడాతో పైచేయి సాధించాడు. కానీ ఆ తర్వాత సెట్లలో జకోవిచ్ పుంజుకోవడంతో నిశేష్‌కు నిరాశ ఎదురైంది. 6–3 6–4 6–2 జకోవిచ్ గెలిచాడు. ఏదేమైనా స్టార్ ప్లేయర్ పై తొలి రౌండ్‌లోనే విజయం సాధించిన నెల్లూరు కుర్రాడిపై తెలుగు క్రీడాభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు.



వైల్డ్‌కార్డ్ ద్వారా ఎంట్రీ ఇచ్చిన అతడు, ర్యాంకింగ్స్‌లో 133వ స్థానంలో ఉన్నప్పటికీ... ప్రపంచ మేటీ ఆటగాడినే వణికించడం గమనార్హం అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఇకపోతే నిశేష్‌పై జకోవిచ్ కూడా ప్రశంసలు కురిపించాడు. అద్భుతంగా పోరాడడంటూ కితాబిచ్చాడు. మ్యాచ్ చివరి వరకు నిశేష్ కనబర్చిన పోరాట పటిమ తనను ఎంతగానో ఆకట్టుకుందని చెప్పాడు. అతడి ప్రదర్శన తీరు తనను ఆశ్చర్యానికి గురి చేసిందని వెల్లడించాడు. కెరీర్‌లో నిశేష్ అత్యుత్తమంగా రాణించాలని తాను కోరుకుంటున్నట్లు తెలిపాడు. కాగా, రెండో రౌండ్‌లో జకోవిచ్ 21 ఏళ్ల పోర్చుగీస్ జేమీ ఫారియాతో తలపడనున్నాడు. ఈ టోర్నీలో ఎలాగైనా గెలిచి 25వ టైటిల్‌ను ఖాతాలో వేసుకోవాలని పట్టుదలతో ఉన్నాడు.

# రీల్

## బాక్సాఫీస్‌ను షేక్ చేస్తున్న ‘డాకు మహారాజ్’!

నటసింహం బాలయ్య – దర్శకుడు బాబీ కాంబినేషన్‌లో సంక్రాంతి కానుకగా వచ్చిన డాకు మహారాజ్ బ్లాక్ బస్టర్ టాక్‌తో బాక్సాఫీస్‌ను షేక్ చేస్తోంది. ఈ చిత్రం తొలి రోజున ప్రపంచవ్యాప్తంగా రూ.56 కోట్ల గ్రాస్‌ను వసూలు చేసింది. ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా తెలియజేస్తూ పోస్టర్‌ను రిలీజ్ చేసింది. మొత్తానికి ఈ సంక్రాంతి సీజన్‌లో బాలకృష్ణ మరో అద్భుతమైన విజయాన్ని అందుకున్నారు. సంక్రాంతి సెలవులు కూడా కలిసి రావడంతో.. రాబోయే రోజుల్లో ఇంకా సాలిడ్ కలెక్షన్స్ వచ్చే అవకాశం ఉంది. కాగా ఈ చిత్రంలో ప్రగ్యా జైస్వాల్ మరియు శ్రద్ధా శ్రీనాథ్ ప్రధాన పాత్రల్లో నటించారు. అలాగే, చాందిని చౌదరి, ఊర్వశి రౌటేలా, బాబీ డియోల్, బేబీ వేద అగర్వాల్ మరియు విటివి గణేష్



ఇతర కీలక పాత్రల్లో నటించారు. ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌తో కలిసి సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించిన ఈ సినిమాకి థమన్ సంగీతం అందించారు. ఈ సినిమాలో బాలయ్యపై యాక్షన్ సీక్వెన్స్‌లను ఎఫెక్టివ్‌గా డిజైన్ చేశారు. అదే విధంగా పాత్రల చిత్రీకరణతో పాటు ఆ పాత్రల నేపథ్యాన్ని కూడా పర్ఫెక్ట్‌గా డిజైన్ చేశారు.



## ‘శ్రద్ధా శ్రీనాథ్’కు బంపర్ ఆఫర్

బాలయ్య బాబు ‘డాకు మహారాజ్’ సినిమాలో శ్రద్ధా శ్రీనాథ్‌కి మంచి పాత్ర దక్కింది. ఆమె పాత్రలో ఎమోషన్ కూడా బాగానే హైలైట్ అయింది. ఈ నేపథ్యంలో శ్రద్ధా శ్రీనాథ్‌కి మరో బంపర్ ఆఫర్ తగిలినట్టు తెలుస్తోంది. సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన మాస్ యాక్షన్ ఎమోషనల్ ఎంటర్టైనర్ ‘జైలర్’ అద్భుత విజయాన్ని సాధించింది.
అందుకే, ఈ క్రైమ్ థ్రిల్లర్‌కు కొనసాగింపుగా ‘జైలర్ 2’ రాబోతున్న సంగతి తెలిసిందే.ఐతే, ‘జైలర్ 2’లో శ్రద్ధా శ్రీనాథ్ ఓ కీలక పాత్రలో నటిస్తోందని టాక్. ఆమె పాత్ర సినిమాలో చాలా కీలకం అని తెలుస్తోంది. ఇక ‘జైలర్ 2’ చిత్రీకరణ గురించి త్వరలో అధికారికంగా ప్రకటించనున్నారు. ఇక ఈ ‘జైలర్ 2’లో కూడా తమన్నా, యోగిబాబు, వినాయకన్, రమ్యకృష్ణ తదితరులు కీలక పాత్రల్లో నటించబోతున్నారు. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ ఈ జైలర్ 2ను కూడా గ్రాండ్‌గా నిర్మించబోతున్నారు. ప్రస్తుతం రజనీకాంత్ ‘కూలీ’ సినిమాతో బిజీగా ఉన్నారు. టైగర్ కా హుకుమ్ అంటూ ‘జైలర్’లో హంగామా చేసిన రజనీకాంత్, జైలర్ 2లో ఎలాంటి హంగామా చేస్తారో చూడాలి.

## అక్టోబర్ నుంచి ‘దేవర-2’ మొదలు?

భారీ అంచనాల మధ్య వచ్చిన ‘దేవర’ సినిమా బాక్సాఫీస్ దండయాత్ర చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమాకు మాత్రం భారీ కలెక్షన్స్ వచ్చాయి. ఎన్టీఆర్ హీరోగా నటించిన ‘దేవర’ మూవీ అటు ఓటీటీలో కూడా అద్భుతంగా అదరగొట్టింది. ఈ నేపథ్యంలో సీక్వెల్ పై భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే, ‘దేవర పార్ట్–2’ స్క్రిప్ట్ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. స్క్రీన్ ప్లే, కీలక సన్నివేశాలను ఆసక్తికరంగా మలిచేందుకు డైరెక్టర్ కొరటాల శివ, తన టీమ్ తో గత కొన్ని వారాలుగా వర్క్ చేస్తున్నారు. ఐతే, ఈ ఏడాది అక్టోబర్ నుంచి ఈ




సినిమా షూటింగ్ ప్రారంభమవుతుందని రూమర్స్ వినిపిస్తున్నాయి. ఇంకా అధికారిక అప్ డేట్ రానప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం ఈ వార్త వైరల్‌గా మారింది. కాగా ఈ మూవీలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించారు. సైఫ్ అలీ ఖాన్ విలన్ పాత్ర పోషించారు. అనిరుధ్ మ్యూజిక్ అందించారు. అలాగే, ఈ చిత్రంలో శ్రీకాంత్, ప్రకాష్ రాజ్, అజయ్, మురళీ శర్మ ఇతర కీలక పాత్రల్లో నటించారు. అన్నట్టు తాజాగా ‘వార్2’ షూటింగ్ పూర్తిచేసుకున్న ఎన్టీఆర్, ప్రస్తుతం ప్రశాంత్ నీల్‌తో చేసే సినిమాపై దృష్టి పెట్టారు.

## కశ్మీర్ ప్రజలకు నా వాగ్దానాలను నిలబెట్టుకుంటా..

సోనామార్గ్ : జమ్ముకశ్మీర్ ప్రజలకు తాను చేసిన వాగ్దానాలను నిలబెట్టుకుంటానని సోమవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ నొక్కిచెప్పారు. జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర పునరుద్ధరణ హోదాను ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా గట్టిగా ప్రస్తావించారు. కశ్మీర్‌ను సోనామార్గ్‌తో కలుపుతూరూ.2,700 కోట్లతో నిర్మించిన 6.4కిలోమీటర్ల వ్యూహాత్మక సొరంగమార్గాన్ని ఇక్కడ ప్రారంభించిన నరేంద్రమోదీ అనంతరం జరిగిన బహిరంగసభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మొదటగా ప్రసంగించిన ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా గత ఏడాది సెప్టెంబరులో జరిగిన జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రధానమంత్రి వాగ్దానం చేసిన విధంగా జమ్ము, కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని ఒత్తిడి చేశారు. మీరు ఈ హామీని త్వరలోనే నెరవేరుస్తారని నా హృదయం నమ్ముతుంది అని ఒమర్ అబ్దుల్లా గుర్తు చేశారు. రాష్ట్ర హోదా అంశం గురించి నేరుగా ప్రస్తావించకుండా నరేంద్రమోదీ సభను ఉద్దేశించి మాట్లాడుతూ ‘ఈయన మోదీ అని, ఆయన తన వాగ్దానాలను నిలబెట్టుకుంటారని మీరు నమ్మాలి’ అని ఆయన అన్నారు.‘ప్రతీదానికి ఒక సరైన సమయం ఉంటుంది. సరైన విషయాలు సరైన సమయంలో జరుగుతాయి’ అని మోదీ స్పష్టంచేశారు. ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రధాని నరేంద్రమోదీకి స్వాగతం పలుకుతూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. గత సంవత్సరం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి మోదీ చేసిన ప్రసంగాన్ని ఆయన గుర్తుచేస్తూ ‘మీరు మీ కార్యక్రమంలో మూడు ముఖ్యమైన అంశాలను చెప్పారు. మీరు ‘దిల్ కీ దూరి’ (హృదయాల మధ్య దూరం),‘దిల్లీ సే దూరి’ (జమ్ముకశ్మీర్ ప్రజలకు ఢిల్లీతో ఉన్న దూరం) గురించి మాట్లాడారు. మీరు ఈ రెండింటి మధ్య ఉన్న దూరాన్ని తొలగించడానికి ప్రయత్నిస్తున్నారు’ అని ఆయన అన్నారు. గతవారం, 15రోజుల వ్యవధిలోనే జమ్ముకశ్మీర్‌లో రెండు ముఖ్యమైన ప్రాజెక్ట్‌లను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించడం గౌరవంగా ఉందన్నారు. జమ్ముకశ్మీర్ రైల్వేడివిజన్‌ను ప్రధాని ఇటీవల వర్చువల్‌గా ప్రారంభించిన విషయాన్ని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రస్తావించారు. ఇటువంటి ప్రాజెక్ట్‌లతో ఢిల్లీనుండి హృదయాల దూరం కూడా తగ్గుతుందన్నారు. తన మాటలను నిజం చేసినందుకు ఒమర్ అబ్దుల్లా ప్రధానమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.




ముఖ్యమంత్రి మాట్లాడుతూ ‘ప్రజలు తనను తరచూ కలుస్తున్నప్పుడు జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను ఎప్పుడు పునరుద్ధరిస్తారని అడుగుతూ ఉంటారని, తన హృదయం మాత్రం అది త్వరలోనే నెరవేరుతుందని చెబుతుందన్నారు. జమ్ముకశ్మీర్‌కు మీ మూడవ వాగ్దానం ప్రకారం జమ్ముకశ్మీర్‌కు మరోసారి రాష్ట్ర హోదా పునరుద్ధరణ జరుగుతుందని ఒమర్ అబ్దుల్లా చెప్పారు.
గతేడాది అక్టోబరు 20న ఇక్కడ ఇక్కడి సొరంగం వద్ద ఉగ్రవాదులు జరిపిన దాడిలో మృతిచెందిన ఏడుగురికి ప్రధాని ఈ సందర్భంగా నివాళులు అర్పించారు. సొరంగమార్గం ప్రాజెక్ట్ ప్రారంభం అనంతరం ప్రధానమంత్రి టన్నెల్‌లోకి వెళ్లారు. అక్కడ ప్రాజెక్ట్ అధికారులతో ఇష్టాగోష్టి నిర్వహించారు.అత్యంత క్లిష్ట పరిస్థితులు ఉన్నప్పటికీ టన్నెల్‌ను పూర్తి చేసేందుకు బాగా కష్టపడ్డ సొరంగ నిర్మాణ కార్మికులను ప్రధాని మోదీ కలుసుకుని వారిని అభినందించారు.



కశ్మీర్-సోనామార్గ్ వ్యూహాత్మక సొరంగమార్గాన్ని ప్రారంభించిన ప్రధాని రూ.2,700కోట్ల వ్యయంతో 6.4 కి.మీ. మేరకు టన్నెల్ నిర్మాణం















Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com